ఇల్లుపట్టిన వెధవాడబడుచు

"వొరేయ్ తమ్ముడూ"

సాయంత్రం నాలుగున్నర దాటాక, నూతి పెరట్లో కూచోపెట్టి, చలపతి రావు నెత్తిమీద చమురు పెడుతూ యిలా ప్రారంభించింది బుచ్చమ్మ.

"పదిమాట్లు చెబుతుం దేమి టీపిచ్చిముండ అనుకోకేం? నువ్వు చిన్నవాడవు. ఆటలూ పాటలూ తప్ప, సంసారం అంటే యేమిటో యిప్పటికీ యెరగవు నువ్వు. నేను పెద్దదాన్ని. పిల్లాపీచా నాకు? మొగుడి మొగమే యెరగనయితి నసలు. అందుచేత, నాకు, తమ్ముడివయినా నువ్వే, కొడుకువయినా నువ్వే, కూతురివయినా నువ్వే. నలుసంత చెల్లెలయినా లేదు కదా? కనక, నాముద్దుముచ్చట్లన్నీ నీమూలంగానే తీరాలి. అందుకోసం చెబుతున్నానిదంతా బాగా వింటున్నావా?"

"............"

"కానయితే, పంచశిఖలతో వుండగానే నీకు పెళ్ళికావడం బాగానే వుంది. అయితే, జోగమ్మ యింత త్వరగా కాపరానికి వస్తుందని మేమెవళ్ళమూ అనుకోలేదు. మొన్న మొన్నటిపిల్ల కాదు,ట్రా అదీ? తల్లివైపు సంప్రదాయంపట్టి అలా బొబ్బిల్లావుంది; గాని మొన్ననేరా నిండాయి పదహారేళ్ళు దానికి?"

"............"

"ఇంతకీ, — కోడలు కాపరానికి రావడం కళ్ళతో చూసుకుందమ్మ. ఒక్కగానొక్క కొడుకు వయినందుకు ముచ్చట్లు బాగానే తీరాయమ్మకి."

"............"

"ముప్పయ్యేకరాల పల్లబ్భూమీ, పదెకరాల కొబ్బరితోటా, ఇనప్పెట్టి లాంటి యిల్లూ — చదువు లేకపోతే లేకపోయింది, నీకేం లోటూ? కాలిమీద కాలువేసుక్కూచున్నా — దమ్మిడీ అయినా సంపాదించకపోయినా — పది తరాల దాకా సరిపోతుంది నీకూ నీవాళ్ళకీని, తెలుసా?"

"............"

"గతిలేనివాడివా యేమిటి నువ్వు, ఎండా వానా అనకుండా, గాడిదలాగ పుస్తకాలు మోసుకుంటూ ఇస్కూళ్ళ వెంట తిరగడానికి?"

"............"

"బతికి వుండినంతకాలమూ నిన్ను కనిపెట్టుకుని వుంటాను కదా నేను?"

"............"

"అమ్మ లేనిలోటు తీర్చలేను; గాని కింద నడవనిస్తానా నిన్ను నేను?"

"............"

"చూడు తమ్ముడూ, నేనిల్లు పట్టాను. నాకు నువ్వే దిక్కు. నీకూ నేనే దిక్కుసుమా. నువ్వు నిస్సాకారంగా చూశావంటే - అబ్బే, వూరికే అన్నాను. నేనంటే నీకు భయభక్తులున్నాయి నాకు బాగా తెలుసు"

"............"

"కాని రోజులు మంచివి కావు. అంచేత, ఎప్పటికేమిటో అని - అందు కోసం చెబుతున్నానిదంతా"

"............"

"అనుమానం పెనుభూతం అన్నారు పెద్ద లెరుగుదువా? ఎందుకు చెప్పవచ్చానంటే? మన యింటి మొగవాళ్ళు పెళ్ళాలమాట వినడం యెప్పుడూ లేదు"

"............"

"ఛా, అదేం బతకు తమ్ముడూ? ఎక్కడో పుట్టి యెక్కడో పెరిగి, గుప్పెడు మెతుకులకోసం చేరిన పెళ్ళామా యింట్లో పెత్తనం చెయ్యడం? మొగజన్మ యెత్తినవాడికది యెంత పరువుతక్కువ పని?"

"..........."

"ఇంట్లో పుట్టి, యింటికోసమే బతుకుతూ, యిల్లే కనిపెట్టుకుని వుండిన ఆడబడుచులు మట్టికొట్టుకుపోవలసిందేనా?"

"..........."

"మన తాత కిద్దరుండేవారుట తోడబుట్టిన పడుచులు. ఇద్దరూ యిల్లు పట్టారుట వొకర్తి రెండేళ్ళు కాపరంచేసీ, మరొకర్తి సమర్తే ఆడకుండాను. చాకిరీ చెయ్యడం తప్పించింటో యెప్పుడూ పెత్తనం లేదుట నాయనమ్మకి భోజనం చెయ్యడమూ, నిద్రపోయినంతసేపు నిద్రపోయి స్వాములవారి వుపదేశాలు వింటూ మార్కండేయస్వామివారి గుళ్ళో కూచోడమేట యెప్పుడూనూ, తాతయ్య. ఇంటి సంగతి యెరగనే యెరగడుట, కాస్తా కూడా."

"..........."

"సరే, నాన్న సంగతి నువ్వే యెరుగుదువు"

"..........."

"మన అమ్మ, చాకిరీ కూడా చేసెరగ దెప్పుడూ, అదీ నువ్వే యెరుగుదువు. అమ్మకి చీర కావాలన్నా రైక కావాలన్నా అత్తయ్య కొనిపట్టుకు రావలసిందే బజారుకి వెళ్ళి"

"..........."

"కిక్కురుమన్నాడా నాన్న యెప్పుడైనా? ఎందుకూ? నానాబాధలూ పడేవాళ్ళింట్లో వున్నప్పుడు నిశ్చింతగా కూచోక మొగరాజుకి?"

"..........."

"కన్నకూతు రన్నట్లు చూసుకుంది అత్తయ్య నన్నెప్పుడూ. సంసారం గుట్టంతా నాచెవిలో పోసిం దావిడ. పోతూపోతూ తాళాలగుత్తి నాచేతికే యిచ్చింది గాని నాన్న కిచ్చిందా మరి?"

"..........."

"ఏ పొరపాటునైనా, తప్పి దారి, అత్తయ్య యిస్తుందే అనుకో. అయితే మాత్రం? నే నెదటే వుండగా, సాహసించి పుచ్చుకోగలడా నాన్న?"

"..........."

"ఇంటి గుట్టు బ్రహ్మకయినా తెలియనివ్వ ననీ, కుటుంబ గౌరవం బాగా నిలబెడతా ననీ, ఈ ఇంట్లో ఆడబడుచుల అధికారం అన్యాక్రాంతం

అయిపోకుండా జాగ్రత్త పడతాననీ — ఎన్నిమాట్లు నా చెయ్యి తన చేతిలో వేయించుకుందో అత్తయ్య, నువ్వెరుగుదువా?"

"............"

"ఇవాళ నేను హరీ అంటా ననుకో. ఎందుకయినా పనికి వస్తుందా యీ కొంప?"

"............"

"పోనీ, నా అత్తవారి ఇంటికి నేను వెళ్ళిపోతా ననుకో. యీ ఇంటిమీద కాకయినా వాల్తుందా యింక?"

"............"

"నీరెండిపోయిన చెరువులో చేపల్లాగ, బయటిపడిపోరూ నాన్నా నువ్వూను, క్షణంలో?"

"............"

"నాదంతా చేదస్తంగాని — ఇదంతా నువ్వే యెరుగుదువు, ఊరికే మాట వరసకి చెప్పా నంతే, మరేం లేదు."

"............"

"బుద్ధికలిగి, నీకు నువ్వే తెలుసుకోవలసిం దయినా, నేనుపని కట్టుకుని చెప్పవలసిం దయినా, వొక్కటేరా, తమ్ముడూ. ఏమి టంటావా? చేబోలు వారి ఆడవాళ్ళు కజ్జాకోర్లు. అందులోనూ నీ అత్తగారు మరీనూ. నెలకి నూట యాభై రూపాయల జీతం తెస్తా డన్నమాటే గాని, తెచ్చిం దంతా - తెచ్చిన పుత్తర క్షణంలో నీ అత్తగారి చేతిలో పొయ్యవలసిందే గదా నీ మామగారు?"

"............"

"లేకపోతే పచ్చి మంచినీళ్ళ కయినా గతి వుందా ఆ బ్రాహ్మడి కాయింట్లో?"

"..... ......"

"ఛీ, యెందుకు వచ్చిన బతుకు తమ్ముడూ అదీ?"

"............"

"ఏమయినా, నీ అత్తగారి వూసు నా కెందు గ్గానీ, నీ పెళ్ళాం యేమి చేసిందో యెరుగుదువా? ముదిమాటలూ అదీ - నీ బావ మరిది పోయినప్పుడు చూశాలే నేనదంతా."

"............"

"అన్నివిధాలా తల్లిని పుణికి పుచ్చుకుం దది యేమనుకున్నావో గాని."

"............"

"కావలసిన వాళ్ళు కదా అనీ, పుట్టెడు దుఃఖంలో వున్నారు పోనీ అనీ, ఆ పది రోజులూ వండిపెట్టాను కాదూ నేను? తల్లి వొకమూల పడివుండే దనుకో, తానయినా నాకు సాయం కావచ్చునా? ఆడబడుచు నవుదునా, సమర్తాడిన పిల్ల గదా, రాత్రిపూట అయినా కాస్త వంట చెయ్యగూడదూ తమ్ముడూ అదీ?"

"............"

"ఎప్పుడు వెళ్ళిపోతానా?" అనిపించనా యివతలి వాళ్ళకి?"

"............"

"నువ్వు చిన్నవాడవు. అంచేత చెబుతున్నా నిదంతా. వెయ్యికళ్ళతో నేను కనిపెడుతూనే వుంటాను; గానీ - ఏ మాత్రం చనువిచ్చినా నెత్తెక్కి కూచుంటుంది సుమా, క్షణంలో."

"............"

"నేనంటే కుక్కిన పేనయి పడివుండేటట్లు చూస్తూ వుండాలి సుమా దాన్ని?"

"............"

"నాన్న వెర్రిబాగులవా డనీ, నేను మనోవర్తి మనిషి ననీ, యిదివరకే బోధించివుంటుంది తల్లి. అబ్బో, ఆమాటకి వస్తే నీ పెళ్ళామే నెల్లూరి నెరజాణల రకం అసలు. అవతల పెద్దవాళ్ళున్నారు కదా అనీ, మన కెందు కనీ నదురు బెదురూ వుందనుకున్నావా కసింతయినా మనిషికి?"

"............"

"వేషాలంటే నువ్వు సరదా పడతావని అదనీ యిదనీ నగలు పురమా యిస్తుంది విన్నావు సుమా, వెర్రి నాగమ్మా! అంత సరదా అయితే అక్కణ్ణుంచి తెచ్చుకోమను డబ్బు. తానొక్కర్తే కాదూ వారికి బిడ్డ? వారి కున్నదంతా తనకి ముట్టేదే కాదూ?"

"............"

"నీ మామగారు రామాత్రం మనిషి కాడు గానీ, కొంపతీసి, నీ అత్తగారే యే కుర్ర కుంక నయినా దత్తత చేసుకుందా మంటుందేమో, అది పడనివ్వ గూడదు సుమా నువ్వు. అలా జరిగిం దంటే అక్కడిది వొక్క పూతిక పుల్ల కూడా తక్కడు సుమా నీకు?"

"............"

"కాస్తా కూస్తా కాదు, పదమూడు యకరాల భూమిరా వాళ్ళదీ? అయినకాడి కమ్ముకున్నా యాభై వేల కరుకులు రాలతాయిరా,"

"........"

"అదంతా నీ స్వాధీనం కావాలి, తెలుసా?"

".........."

"ఎప్పుడో అనుకున్నావేమో వల్లకాదు, నుంచున్న పాళంగా జరిగి పోవాలి రాతకోతలు. ఒక్కొక్కటే చరాస్తి అంతా ఇక్కడికి చేరవేసుకోమని తొందరపెట్టు నీపెళ్ళాన్ని, అలా చేస్తేనే నువ్వు మాట్టాడాలి దాంతో."

"........."

"వాళ్ళ పిల్లపేర రాస్తా మంటారు, వల్లకాదు సుమా"

"........."

"మీ ఆస్తి మీపిల్లపేర రాస్తే మా ఆస్తి అంతా మా నాన్నా నేనూ మా అక్కపేర రాసేస్తా మను, కచ్చితంగా"

"..........."

"ఆరాత కాస్తా అయిపోయిందా, కిక్కురుమన నిస్తానా యిక వాళ్ళని?"

"........ ..."

"పోనీ గాని తమ్ముడూ, అడిగేవాడు లేకగానీ—ఎంత వుద్యోగస్థు లయితే మాత్రం అవేం కాఫీలురా? హవ్వ, పొద్దుటిపూట చాలదూ, మధ్యాహ్నం కూడానా?"

"..........."

"కుడితికీ కాఫీకీ భేదం యేమిటంట?"

"..........."

"అక్కడ రుచిమరిగివుంటుంది - గానీ - ఇక్కడ సాగనిస్తా మంటే గుడ్డిగవ్వకు మారము సుమా మనం?"

"..........."

"తనకి రొస్టు లేకుండా నీకు మప్పుతుందది, విన్నావు సుమా; నువ్వు కాఫీరుచి మరిగావంటే, దానివల్లో పడిపోయా వన్నమాటే సుమా"

ఇలాగ చాలా సంగతులూ చెప్పింది బుచ్చమ్మ. చాలా దూరమూ చెప్పింది; కాని దేనికీ బదులు చెప్పలేదు చలపతి. ఆ మాటలు వినగా, అతనికి, ఒక పంటికింద తీపీ, మరో పంటికింద చేదూ పడ్డట్టుంది.

దాంతో, ముసిముసినవ్వులు నవ్వుకుంటూ కొంతసేపూ, సిగ్గుపడుతూ కొంతసేపూ, ఏమనాలో తోచక కిందా మీదా పడుతూ కొంతసేపూ, ఏమంటే యేమిటో అని జంకుతూ కొంతసేపూ నోరు కుట్టేసుకున్నా చున్నాడతను.

ఇదంతా తనకి విధేయతే అనుకుంది బుచ్చమ్మ. "ఇది జ్ఞాపకం వుందా" అని వొకటీ "అన్నట్టు మరిచిపోయా, నిది బాగా విను" అని వొకటీ: "ఇది ముఖ్యం సుమా" అని యింకొకటీ అని యేమిటేమిటో చెప్పి, చివరికి "నామాటే వింటాడు తమ్ముడు" అనుకుని తలంటు పూర్తిచేసిం దామె.

పొడిబట్ట కట్టుకున్నాడు చలపతిరావు. "చొక్కా తొడుక్కురా" అందామె. కండువా తెచ్చి తానే అతని బుజాన వేసిం దెందుకో చెప్పకుండా. ఒక అర్ధణా తెచ్చి అతని చేతిలోపెట్టింది "తెలిసిందా?" అన్నట్టు చూస్తూ, "దర్జాగా కాఫీహోటలుకి వెళ్ళు. కమ్మగా అరకప్పు కాఫీ పుచ్చుకో, కాలిమీద కాలువేసుక్కూచుని. పెళ్ళాంగారు పుట్టింటిసించి వచ్చాటప్పటికి, మొగంవాచి వుండినట్టు ఇంటో ఎదురుగా వుండగూడదు మొగుడు. కనుక, గోదావరిగట్టే వెళ్ళి, మూజియంతోటలో కూచుని, యెనిమిదింటికో యెనిమిదిన్నరకో యింటికి రా గప్చిప్పుగా" అంది కళ్ళు తిప్పుకుంటూ.

జబ్బపట్టుకు తీసుకువెళ్ళి వీధి గుమ్మం దాటించింది ఉత్తరంగా దారి చూపిస్తూ. ఛడీమని వీధి తలుపున్నూ వేసేసుకుంది: కాని నాలుక కరుచుకుంటూ వెంటనే తలుపు తెరిచింది. ఆత్రంగా వీధిలో కొక్కదూకు దూకింది; కాని అప్పటికే మాయమయి పోయాడు చలపతి.

"అది గోదావరి స్టేషనులో రెయిలు దిగుతుంది, తమ్ముణ్ణటే వెళ్ళమన్నా మేమిటి మనం? ఈ వెర్రినాగమ్మ స్టేషనులోనే కూచుంటా డేమో కొంపతీసి" అని పిసుక్కుంటూ అక్కడే వుండిపోయింది, అటే చూస్తూ.

2

రాత్రి యేడింటికి తీసుకువచ్చాడు జగ్గయ్య, కోడలు జోగమ్మని. మళ్ళీ తన భార్యపోయిన యిన్నాళ్ళకి తన నట్టింట పుణ్యస్త్రీ పడుచు మసల బోతున్నందుకు చాలా పొంగిపోతూ తీసుకు వచ్చాడతను. తాను స్వయంగా, తన కోడలిని తీసుకు తెచ్చుకోడం ఆ వీధిలో నలుగురూ చూడాలని యెంతో ముచ్చటపడుతూ కూడా తీసుకు వచ్చాడతను; కాని, సాయంత్రం అయిదు కాకుండానే గోదావరిస్టేషనుకి చేరుకోవలసిందల్లా, ఆవేళ, యేడున్నర దాటాక వచ్చింది రెయిలు.

తన ముచ్చట్లన్నీ యిలా అయిపోయేటట్టు గుర్తుకి రాగా, నిడదవోలు స్టేషనులోనే విసుగూ రోషమూ పుట్టుకువచ్చాయతనికి. మెయిలు బోటు దిగి, రెయి లెక్కడ మించిపోతుందో అని కంగారు పడిపోయినవా డల్లా, స్టేషను చేరుకున్నాక కొయ్యయి పోయాడతను.

అంచేత, జట్కాబండి గుమ్మాన ఆగడం తరవాయిగా బండి దిగి చర్రున యింట్లోకి చక్కాపోయా డతను.

ఆచంటలో బిక్కుబిక్కుమంటూనే బయలు దేరింది జోగమ్మ; కాని యెంత ఆలస్యం అయినా, రెయిలు దిగాక, చాలా వుల్లాసంగానే జట్కా యెక్కిం దామె. బుచ్చమ్మ, తనకోసం బండిదగ్గిరికే యెగిరివస్తుందనీ "దయ చేశారూ రాణీగారు?" అంటూ తన కణతలమీద మెటికలు విరిచి పొదివి పట్టుకుని తనని బండిదింపుతుందనీ, ఏ యిరుగుపొరుగు పిల్లనైనా సిద్ధంగా వుంచి, తాను గుమ్మం దగ్గిరికి వెళ్ళాటప్పటికి ఎర్ర అక్షింతలూ పచ్చ అక్షింతలూ దిగతుడిపించి, తన కాళ్ళమీద చెంబెడునీళ్ళు కూడా పోయించి యెక సక్కాలాడుతూ యింట్లోకి తీసుకు వెడుతుందనీ అనుకుంటూ వచ్చింది పాపం.

అప్పుడు తానెలాగు నవాలో, సిగ్గెలా నటించాలో, ఎంత అమాయికంగా కనపడాలో, దానాదీనా తన కెంత సంబరం కలుగుతుందో - ఇదంతా వూహించుకుంటూ కూడా వచ్చిందామె.

బుచ్చమ్మ కళ్ళబడకుండా, చలపతిరావు తనని తొంగిచూస్తాడనీ, తానున్నూ అతణ్ణలాగే చూడాలనీ - ఇలా కూడా అనుకుంటూనూ, ఆశించు కుంటూనూ కూడా వచ్చిందామె; కాని, బండి దగ్గిరికి రాకపోడమే కాదు, తొంగిచూడగా, గుమ్మంలో వున్నట్టున్నూ కనపడలే దామెకి బుచ్చమ్మ.

ఉత్సాహం అంతా చల్లబడిపోయింది. మనస్సు కూడా చెదిరిపోయింది. ఉసూరుమంటూ బండిదిగి, కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరి, తెలతెలపోతూ యింట్లో ప్రవేశించింది జోగమ్మ. ఎవళ్ళయింట్లోనో అన్నట్టు.

అప్పటికి, మండువా అంచున నుంచుని ఉత్తరపు గదిగుమ్మాన పెట్టిస్తు న్నాడు సామాను జగ్గయ్య. సిమెంటుబొమ్మలాగ పడమటింటి గుమ్మాన నుంచుని వుంది బుచ్చమ్మ, ద్వారానికి చేరబడి.

"అబ్బాయి కనపడ్డేం?" అనడిగాడు జగ్గయ్య, ఉండుండి.

"వంటెద్దుబండయితే మూడణాలకే వచ్చునుగదా, పావులా ఖర్చుపెట్టి గుర్రబ్బండెందుకు తీసుకువచ్చావూ?" అని యెదురడిగింది, దీనికి బుచ్చమ్మ.

చర్రుమన్నాడు జగ్గయ్య. "అబ్బాయిమాట అడిగాన్నే" నంటూ గదించాడు కూడా.

ఎగిసిపడింది బుచ్చమ్మ, తండ్రిధోరణి చూసి, "ఏమిచూసుకునీ యీ వాలకం?" అనిన్నీ అనుకుందామె, తనపెత్తనం నెమరుకి తెచ్చుకుంటూ.

"ఇంట్లో లేడు" అనిన్నీ అంది, వంటింటికేసి చూస్తూ నిర్లక్ష్యంగా.

"ఎక్కడికి పంపావూ?"

"నేను పంపానా?"

"పోనీ, యెక్కడికి వెళ్ళాడూ?"

"నేను చూశానా?"

"... ... ..."

"నాతో చెబుతున్నాడా వాడేమయినా, అసలు?"

"ఎంత సేపయిందీ వెళ్ళి?"

"నాకేం తెలుసూ?"

"భోజనం అయిందా?"

"లేదు"

"ఏం?"

"ఏమో?"

"వంటయిందా?"

"సడే! ఇప్పటిదాకా వూరికే కూచున్నాననే నీవుద్దేశం?"

జగ్గయ్యకి మళ్ళీ చర్రుమంది; కాని, ఏమి చెయ్యాలో కనీసం యేమి చెప్పాలో కూడా తోచలే దతనికి. బుచ్చమ్మే అందుకుంది.

"తమలపాకులూ పోకచెక్కలూ తెచ్చుకోమని డబ్బిద్దామని నేను వాకిట్లోకి వచ్చాటప్పటికే లేడు వాడు. రోజులు బాగా లేవు కనక, ఏదొంగయినా యింటో దూరతాడేమో అని తలుపు గడియవేసి వంటింటోకి చక్కాపోయానా పళంగా"

"........."

"నువ్వు తలుపు తట్టేదాకా నేనివతలికే రాలే దసలు"

"........."

"నాలుగ్గడియల పొద్దువేళ తలంటిపోశాను. అంతే, మళ్ళీ చూడలేదు తమ్ముణ్ణి నేను"

జగ్గయ్య కేమీ పాలుపోలేదు. "ఎక్కడికి వెళ్ళాడో యెవరితో తిరుగుతున్నాడో?" అని స్వగతంగా అనుకోబోయాడతను; కాని, పైకే వచ్చేసింది మాట.

ఇది విని జోగమ్మ వులిక్కిపడింది. "ఎక్కడికి వెళ్ళాడో" అన్నమాటకేం "యెవళ్ళతో తిరుగుతున్నాడో" అన్నమాటతో యేదో కంగారుపట్టుకుంధామెకి,

ఇది గుర్తించేసింది బుచ్చమ్మ. మాటమరిపించా లనుకుని "ఏచల్లగాలి కయినా - యేగోదావరివొడ్డు కయినా వెళ్ళి వుంటాడు తమ్ముడు, వెడితే మాత్రం భోజనాల వేళ కయినా రాకుండా అక్కడే వుండిపోతాడా? స్నానానికి నువ్వెలాగా గోదావరికి వెడతావు కనక, నీకు దారిలోనే యెదురవుతాడు వాడు" అంది తండ్రితో.

జోగమ్మ జగ్గయ్యకేసి చూసింది. జగ్గయ్య మండువా అంచునవున్న బిందెకేసి చూశాడు. అదిచూసి వంటిటోకి వెళ్ళి కుంభకోణం చెంబు తెచ్చి అతని యెదట వుంచింది బుచ్చమ్మ.

"సామాను సర్దుకోతల్లీ" అంటూ కోడలికి చెబుతూనే చెంబు పుచ్చుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు జగ్గయ్య.

వెలగలేక వెలగలేక వెలుగుతున్న బుడ్డిదీపం వదినా మరదళ్ళ చూపులు కలిపింది.

"ఏమిటీవాలకం?" అనుకుంది జోగమ్మ. "మామగారు సామానుసర్దుకో మని చెప్పేదాక బొమ్మలా నుంచోవాలి కామోసు. అదంతా సిగ్గు కామోసు. మేమెప్పుడూ యెరగం" అని వినపడీ వినపడకుండా సాగతీసుకుని గిర్రున తిరిగి వంటింటోకి చక్కాపోయింది బుచ్చమ్మ.

గోదావరిలో స్నానంచేసి, శ్రీసూక్త పారాయణం పూర్తికాగా కింది చీడీమీదే బ్రహ్మార్పణంగా యిన్ని నీళ్ళు విడిచిపెట్టి "అబ్బాయి వచ్చాడా?" అనడుగుతూ యింటో అడుగుపెట్టాడు జగ్గయ్య. ఉలిక్కిపడి "లే"దని బదులు చెప్పింది జోగమ్మ.

"సినీమాకే వెళ్ళాడో, యెవళ్ళతోనయినా తిరుగుతున్నాడో వెర్రినాయన" అనుకుంటూ వంటింటోకి చక్కాపోయాడు జగ్గయ్య.

ఇన్నాళ్ళకి వచ్చినా - ఇంతదూరం వచ్చినా - ఇంతసేపున్నా అయినా తన వస్తువు కళ్ళకయినా కనబడకపోగా బెంబేలుపడిపోయి నుంచున్నది నుంచున్నట్లుగా చతికిలబడి పోయింది జోగమ్మ.

3

ఆచంటలో, పొద్దున్న తొమ్మిదింటికి తిన్న మెతుకులు జోగమ్మకి.

ఆకలయినప్పుడు దారిలో తినమని జంతికలూ అవీ యిచ్చే పంపించింది తల్లి; కాని, మెయిలుపడవలో, ఆడవాళ్ళలో తానీచివరా, జగ్గయ్య ఆ పెట్టె భద్రంగా తన దగ్గిర పెట్టుకుని మొగవాళ్ళలో ఆచివరా వుండిపోడంవల్ల అవి తలుచుకుని గుటకలుమింగుతూనే కాలం గడపవలసి వచ్చిందామెకి.

ఇదేమీ యెరగని జగ్గయ్య, నిడదవోలు స్టేషనులో "అరటిపళ్ళు కొనమంటావా?" అనడిగాడు. బేరమున్నూ సాగించాడు, అంగడిమనిషితో; గాని "వద్దుగాక" వద్దనేసిందామె, సిగ్గుపడి, మొగమాట పడిపోయీని.

మొత్తానికి, రాజమహేంద్రవరం వచ్చాక, అడిగి పుచ్చుకునేదాకా పచ్చి మంచినీళ్ళయినా యెరగ దామె.

ఎనిమిదిన్నర కింటికి వచ్చాడు చలపతిరావు.

నీరసంతో గాఢనిద్రపట్టి వుండడంవల్ల జోగమ్మ అది యెరగదు.

ఇక్కడ జోగమ్మలాగే, అక్కడ - ఉత్తరవసారాలో గాది అరుగుమీద జగ్గయ్యకూడా గాఢనిద్రలో వున్నాడు.

ఏదోపనిమీద అటూ ఇటూ తిరుగుతున్నట్టు నటిస్తూ యిందుకోసమే యెదురుచూస్తున్న బుచ్చమ్మ, మెల్లిగా వెళ్ళి తలుపు తీసి, దురుసుగా హాల్లో అడుగుపెట్టినవాణ్ణి వీధి చీడిలమీదికి తీసుకువెళ్ళి "నీ పెళ్ళాం వచ్చిందిరా" అంది, కంఠం నొక్కుకుని.

"ఏదీ?" అనడిగాడు చలపతి.

అతను కూడా బుచ్చమ్మలాగ కంఠ నొక్కుకోడానికే ప్రయత్నించాడు; గాని వుబలాటం కొద్దీ గట్టిగానే వచ్చేసింది మాట.

ముందు ముక్కుమీద వేలు పెట్టుకుంది బుచ్చమ్మ. "ఇక గట్టిగా మాట్టాడ వద్దన్నట్టతని నోటి కడ్డంగా చెయ్యి పెట్టి "ఉత్తరపింటి గుమ్మాన పడుకుని నిద్రపోతోంది" అని చెప్పింది.

"సరే"

"ఇప్పుడు మాట్టాడించ కేం?"

"ఏం?"

లంఘనాలు చేసినవాడి మాటలాగ అతినీరసంగా వుందతని మాట.

"తప్పు తప్పు, లోకువయిపోవూ? గదిలోకి వచ్చి అదే ముందు నిన్ను పలకరించాలి"

"అలాగా?"

"ఇంటో నాలాంటి పెద్దవాళ్ళుండడం ఇలాగ మంచీ చెడ్డా చెబుతూ వుండడానికే"

"ఊహూ"

"బాగా అర్థం అయిందా?"

"ఆ"

"చడీచప్పుడూ కాకుండా గదిలోకి వెళ్ళి పట్టుపంచె కట్టుకు చక్కారా"

ఇద్దరూ బయలుదేరారు గాని గభీమని అతని కద్దుగా నుంచునీ "ఎవరైనా అడిగితే నీకు నువ్వే గోదావరిగట్టుకి షికారువెళ్ళినట్టు చెప్పేం?" అంది.

"నువ్వు వెళ్ళమన్నా వంటేం?"

"అ - వ్వ" అని రుంజుకుంటూ నోరు నొక్కుకుందామె.

కారణం లేని ఆజ్ఞ యిది; కాని జరిగిపోవాలి. ఇలాంటి సందర్భాల్లో ఆడవాళ్ళు వేసే తస్సా యిది. దీంతో మహా ప్రత్యవాయం యేదో స్ఫురిస్తుందవతలివాళ్ళకి. ఏమీ బోధపడదు; కాని నాడులు కుంగిపోతాయి.

"సరేలే" అనేశాడతను.

తరవాత, జోగమ్మ యెక్కడ చూసిపోతుందో అని నక్కుతూ, పిల్లిలాగ అడుగులు మెల్లిగా వేసుకుంటూ ఉత్తరపుగదిలోకి చలపతీ, పడమటింటోకి బుచ్చమ్మా చక్కా పోయారు.

బుచ్చమ్మ, వంటింటో పీటవాల్చింది. విస్తరివేసింది. కంచుచెంబుతో మంచినీళ్ళుంచింది, వడ్డించింది. వెచ్చగిల్లడం కోసం నేతిగిన్నె పొయ్యిదగ్గిరగా పెట్టింది, ఒక్కక్షణం గుమ్మంకేసి చూసింది; కాని యిన్ని చేశాటప్పటికిన్నీ చలపతి మడి కట్టుకురాలేదు.

వెంటనే మండువాలోకి వచ్చి ఉత్తరపుగది కేసి తొంగి చూసిందామె. అతని జాడేమీ కనపడలేదు. ఒక్కక్షణం చూసి గదియెదటికి వెళ్ళినుంచుంది, అలికిడయి జోగమ్మ మేలుకుంటుందేమో అని భయపడుతూనే.

గదిగుమ్మంలోకి వెళ్ళి తొంగిచూసింది చివరికి. మంచానికి చేరబడి నుంచుని వున్నాడు చలపతి. జోగమ్మకోసం యెదురు చూస్తున్నాడతను. "లేచిందా?" అనీ "వస్తోందా లేదా?" అనీ రెండుమాట్లు తొంగిచూశాడు కూడా అప్పటికతను.

ఇంతలో ఆలికి డయింది. జోగమ్మే వస్తోందనునుని కుడికాలి బొటనవేలితో గోదినీ రాస్తూ గభీమని మొగం వంచేసుకున్నాడు; కాని వోరకంట చూశాడు.

తెల్లని బట్ట కనపడింది.

కిందచూపులే నిదానించి చూశాడు.

బోసికాళ్ళు కంటబడ్డాయి.

అనుమానిస్తూనే మొగం పైకెత్తుకుని చూశాడు, కళ్ళనిండా.

నిలువునా బుచ్చమ్మ.

తెల్లపోయాడతను. నీరున్నూ అయిపోయాడు.

ఆ స్థితి గ్రహించి, లోపలికి వెళ్ళి "రావేం?" అనడిగింది బుచ్చమ్మ, వెనకటిలాగే కంఠం నొక్కుకుని.

"లోపలి కది యింకా రాలేదు మరి?"

"ఇప్పుడు కాదురా"

మెల్లిగానే గదిమిందిలాగ బుచ్చమ్మ, నోరునొక్కుకుంటూ.

"మరెప్పుడూ?"

"భోజనం చేశాక"

"అయితే పద"

బుచ్చమ్మ ముందు బయలుదేరింది. పట్టుపంచె కట్టుకుని, జోగమ్మ నిద్రపోతోంది గదా అన్న దిలాసాతో వెన్ను విరుచుకుంటూ తరవాత వెళ్ళాడు చలపతి.

4

వెళ్ళి వెళ్ళడంతోనే పరిషేచన చేసేశాడు చలపతి.

వెంటనే బుచ్చమ్మ నెయ్యి వడ్డించబోయింది; కాని రెక్క పట్టుకుని యెవరో వెనక్కి లాగేస్తున్నట్టాగి పోయి, చురచుర చూస్తూ "కాళ్ళు కడుక్కున్నావా?" అనడిగింది కంగారుగా.

చూసుకోగా, కంకరదుమ్ము కొట్టుకుని వున్నాయి కాళ్ళు.

తెల్లబోయాడు చలపతి.

బిక్క మొగమున్నా వేశాడు.

ఎలా వున్నావారలా కొయ్యయిపోయా రిద్దరూ, వొకరికేసి మాత్రం వొకరు చూసుకుంటూ.

ఏమిటిదారి? ఇంటికి పెద్దదిక్కు కదా, అనాచారం జరిగిపోతూ వుంటే చూస్తూ వూరుకోడమేనా బుచ్చమ్మ? ఊరుకోగలదా అస లామె?

కాని జరిగిపోయింది. ఇక కలిసిరాదు. అయినా, సంప్రదాయం నిలవబెట్టవలసినపూచీ తనకే వుండడంవల్ల వొక్కక్షణం ఆలోచించింది బుచ్చమ్మ. ఆమె ఆలోచించినంత సేపూ, విస్తరిలో యెక్కడ యెలావున్న చెయ్యి, అక్కడే - అలాగే వుంచేసుకుని ఆమె కేసే చూశాడతను.

చివరికి- అంతర్వాణి ఆదేశం అందింది, బుచ్చమ్మకి. "ఇంకెప్పుడూ ఇలా చెయ్యకేం?" అంటూ గద్దించింది. కాళ్ళవతలికి చాపమని తానే కాసిన్ని నీళ్ళు చిలకరించింది. "భోజనం చేశాక మాత్రం నూతికి వెళ్ళి బాగా

కడుక్కోసుమా" అని గట్టిగా కట్టడ చేసింది. చివరికి నెయ్యి మరో గరిటె యెక్కువ వడ్డించింది.

తరవాత ఆమె మామూలుగానే మాట్లాడింది, మెల్లిగా; కాని సంజ్ఞల తోనే కాలక్షేపం చేశాడతను. వంచిన తలయెత్తకుండా నాలుగుమెతుకులున్నా తినేశాడు గబాగబా, చెయ్యి మాత్రం కడిగేసుకున్నా డాదరాబాదరా. జోగమ్మకి మెళుకువ రాకుండా గదిలో కుడాయించాడు. అప్పటికే నిద్ర ముంచుకురాగా అతికష్టాన పట్టుపంచె విడిచి నూలుపంచె కట్టుకుని, మంచాన పడ్డాడు.

అతనిలా నిద్రకి పడ్డాడు, గడియారం అలా తొమ్మిది కొట్టింది. జోగమ్మ వులిక్కిపడిలేవడమూ "బొట్టుపెట్టి పిలవాలి కామోసు" అనుకుంటూ దుమదుమలాడుతూ బుచ్చమ్మ మండువాలోకి రావడమూ వొక్కమాటే జరిగి పోయాయి.

ఇద్దరికళ్ళూ కలిశాయి, అంతే, వెంటనే ముందు బుచ్చమ్మా, ఆమె వెనకనే జోగమ్మా వంటింటోకి బయలు దేరారు. కట్టుకున్నది పెద్దాపురం పట్టుచీర కావడడంవల్ల కాళ్ళు మాత్రం కడుక్కుని భోజనం ప్రారంభించింది జోగమ్మ.

"నా కేమవసరం?" అనుకుంటూనే మీనాన్నా మీ అమ్మా కులాసాగా వున్నారా?" అని నోరు జారేసింది బుచ్చమ్మ.

"ఆ" అంది జోగమ్మ.

బుచ్చమ్మ యిక వాక్ప్రవాహం ఆపుకోలేక పోయింది.

"మీనాన్న దగ్గిర మూడో గుమాస్తా? ఆయన చెల్లెలు? మరిచిపోయానా విడపే రేమిటీ?"

"పుల్లమ్మ"

"ఆచంటలోనే వుందా ఆవిడ?"

"ఆ"

"అప్పుడే వెడుతుం దనుకున్నారు, రామేశ్వరం వెళ్ళి వచ్చిందా ఆవిడ?"

వొళ్ళు మండుకుపోయింది జోగమ్మకి. "నత్తా రామేశ్వరమేనా?" అనడిగింది కొంటెగా చూస్తూ.

"అదేమిటే అలా అంటావు?"

"ఏం? ఆవూళ్లో వాళ్ళకి చుట్టాలున్నారుట కాదూ?"

"ఉంటే?"

"చుట్టాల యింటికి వెళ్ళరుటండీ?"

మాటతోచలేదు బుచ్చమ్మకి; కాని వూరుకోలేక "మహా మంచి మనిషావిడ. నాలుగురోజులు మాట్లాడుకున్నామో లేదో బాగా కలిసి పోయింది మాకు. ఎప్పుడో ఒకమాటు వెళ్ళి చూసి రావాలి" అంది, అటు చూడకుండానే.

ఒక్కక్షణం యిద్దరూ మౌనంగా భోజనం చేశారు.

మళ్ళీ అందుకుంది బుచ్చమ్మ.

అయితే, అదనీ యిదనీ ఆచంట గొడవ లడిగింది. ఉండుండి యిక్కడి కబుర్లు చెప్పింది. మధ్యమధ్య యిరుగు పొరుగు దంపతులకు పేర్లూ పద్దులూ పెట్టింది. కొత్తిమిరి కారంతోనూ, మామిడిపిందెల పచ్చడి బద్దలతోనూ, చివరికి మీగడ పెరుగుతోనూ కాస్తకాస్త చొప్పున వుప్పుపిండి తింది. తానిలాగా అలాగా తిరుగుతూ ఇల్లంతా జోగమ్మచేత సద్దించింది. తన పక్క సవరించుకోవడంలో జోగమ్మ సాయం పుచ్చుకుంది.

"అమ్మయ్యా, రామయ్య తండ్రీ, చాకిరీ అంతా చేసుకునేటప్పటికి నడుం లాక్కుపోయింది రామయ్యతండ్రీ" అంటూ గభీమని పక్కమీద కూచుంది. "హు—హు—హ్హా" అంటూ వొక్కమాటావైపూ యీవైపూ దొర్లింది. "ఇక పడుకో" అంటూ జోగమ్మకి సెలవిచ్చింది, కళ్ళుమూసుకుని,

పదిమ్ముప్పా వయింది ఖరాగా, అప్పటికి.

5

తెల్లవారుజామున మూడున్నరకే మెళుకువ వచ్చింది బుచ్చమ్మకి.

తరవాత మరి నిద్ర రానూలేదు, అందుకోసం ప్రయత్నించనూ లేదామె.

పైగా, ఏమిటో మించిపోతున్నట్టు మనస్సు గందరగోళ పడిపోయింది.

రెండుమూడు మాట్లామె ఉత్తరపుగది తలుపు దగ్గిరికి వెళ్ళి తలుపు సందులకు చెవి ఆనించివింది; గాని దంపతుల్లో వొకరూ కూడా మేలుకుని వున్నట్టు కనపడలేదు.

తరవాత, వొక అరగంటసేపు మంచానకూచుంది. అతి కష్టంమీద.

మరో పావుగంట వస్తాయించింది. ఇంకో అయిదు నిముషాలున్నా వూరుకుంది; కాని మరి వుండలేకపోయింది. వెనకబడి యెవరో తరుముకు వస్తున్నంత కంగారుపడిపోయింది కూడా ఆమె.

సరిగా యీ సమయాన పక్కయింటి గడియారం నాలుగు కొట్టింది. "ఇంకేముంది బాబోయ్" అనిపించింది దాంతో, వెంటనే వొక్క అంగవేసింది మళ్ళీ గుమ్మంలోకి. గొళ్ళెం దడదడలాడించింది, ఆవేశంతో, "తెల్లవారిపో వచ్చింది లేచి చదువుకో తమ్ముడూ" అంటూ పిలుపుమీద పిలుపున్నూ మొదలు పెట్టింది.

జవాబు లేకపోగా, వొక నిమిషం చూసి మళ్ళీ పిలిచింది. ఓరుగాలి గొడుతున్నట్టు తలుపు గుంజింది; దాంతో జోగమ్మకి మాత్రం మెళుకువ వచ్చింది: గాని పలకలే దామె.

అన్నిమాట్లు పిలిచినా యెవరూ పలకనందుకు చాలా అభిమానపడింది బుచ్చమ్మ. ఇదంతా జోగమ్మ మూలంగానే జరిగిందని కూడా నిశ్చయించు కుందామె. దీంతో చాలా వుక్రోషం వచ్చింది. దాంతో "వొరేయ్, వోరి నీనిద్ర—" అంటూ చెండుకుంది. మళ్ళీ గొళ్లెం కదిపింది. తలుపు గుంజింది. ఉరిమిన్నీ పిలిచింది మళ్ళీ మళ్ళీ.

దీంతో జోగమ్మకి మెళుకువ వచ్చింది. "తెల్లవారిందా" అనుకుందామె కళ్ళు నులుముకుంటూ; కాని చదువుమాట వినపడింది. "రోజూ చదివిస్తోందా ఖామ?" అనుకోకపోలేదు; గాని "అయినా చూద్దాం" అనిన్నీ అనుకుని "మీ అక్క పిలుస్తోంది" అంది, చలపతిని కదుపుతూ.

భోజనం చేసి పడుకున్నాడు, మళ్ళీ చలపతి కిదే మెళుకువ రావడం; కాని బద్ధకం తగ్గలే దతనికి. కాక, తన్ను లేపుతున్నది జోగమ్మ కాని బుచ్చమ్మ కాకపోయింది. "వాకిట్లో యెంత చించుకుంటేం, అక్క యింటోకి రాదు కదా?" అనుకున్నాడు. "ఊరుకుందూ" అని ముసముస లాడా డీదిలా సాతో, ముసుగున్నూ బిగించాడు.

స్పష్టంగా తెలియకపోయినా లోపల యేదో సంభాషణ జరగడం గ్రహించేసింది బుచ్చమ్మ. ఒక్కక్షణం చూసింది, మళ్ళీ మాట సవ్వడి కాలేదు. "వాడు మేలుకున్నాడు; కాని అదే లేవనివ్వడం లేదు" అని నిశ్చయించుకుంది. "తమ్ముడూ" "అబ్బాయీ" "వొరే బుల్లాడా" అంటూ యెంతో ప్రేమగా మళ్ళీమళ్ళీ పిలిచింది. చివరి "కిలా వుందా నీవని?" అనుకుని "మొగుడూ పెళ్ళామూ గూడా యిద్దరి కిద్దరే. యీ కొంపలో మొగవాళ్ళ కెప్పుడూ యింతబండ నిద్దరలేదు. ఏడిచినట్టే వుంది సడసం. సిగ్గూబిడియమూ లేకపోతే సరి. మొండివాడు ముక్కుకోస్తే నెత్తురు తాగాడుట, అలా వుందిది. ఇలా అయితే, తెల్లవారిందన్నమాటే సంసారం. మంచి సంప్రదాయమే దాపరిం

చింది మాకు, చివరికి. పోనీ, నీకయినా మెళుకువ రాలేదుటే మాతల్లీ?" అని సాగదీసుకుని రెండునిమిషాలసేపు తలుపు గుంజిగుంజి విడిచి పెట్టింది.

ఈ అల్లరికి "మామగారు లేవకపోతారా" అనుకుంది జోగమ్మ. ఎంత చూసినా, తానూ బుచ్చమ్మా తప్ప మరో మనిషి మేలుకున్నట్టు తోచలేదామెకి. అయినప్పుడు రొస్టు మనకెందు" కనుకుని లేచివచ్చి తలుపుతీసిం దామె, మాట్లాడకుండా.

తలుపు తెరుచుకుందంతే, వొక్క దూకుదూకింది మంచం దగ్గరికి బుచ్చమ్మ. అదిచూసి జోగమ్మ యివతలికి వచ్చేసింది. అందుకు మరీ సంతోషించింది బుచ్చమ్మ. వెంటనే నాలుగుమాట్లు అటూ యిటూ దొర్లించిందామె తమ్ముణ్ణి. చెవిలో నోరుపెట్టి "యేదో చదువుకుంటున్నట్టు కనపడక పోతే నీపెళ్ళాం లోకువచేస్తుందిరా" అని చెబుతూ తానే పట్టుకుని మంచానకూచో బెట్టింది. ఒక్కక్షణం చూసి చెయ్యి పట్టుకుని యివతలికిన్నీ లాక్కువచ్చి అరుగుమీద కూచోబెట్టింది.

ఇదంతా చూశాటప్పటికి జోగమ్మకి అరికాలిమంట నెత్తికి వచ్చింది, వల్లమాలిన దుఃఖమూ ముంచుకు వచ్చింది. దిక్కు తోచలేదామెకి. వెంటనే లోపలికి వెళ్ళి, తలుపు గొళ్ళెం పెట్టుకుని రెండుచేతులా మొగం కప్పుకుని యేడుస్తూ కూచుంది.

6

"దీపం పెద్దదిచెయ్యి మరి" అంటూ చెరబడ్డాడు చలపతి; కాని యెప్పుడూ లేని దివాళ యీపురమాయింపేమిటో అర్థం కాలేదతనికి. అయినా యేమి పుస్తకం చదవడమో కూడా తోచలేదు.

అతని దగ్గిర పుస్తకాలే లేవసలు.

సంవత్సరం కిందట, జోగమ్మ రజస్వల అయిందన్న శుభలేఖ రాగా, వెంటనే అతని బడిచదువు మానిపించేసింది బుచ్చమ్మ. అప్పటి పుస్తకాలయినా యేమయి పోయాయో యెవరూ యెరగరు.

జగ్గయ్యదగ్గిర పంచాంగం తప్ప మరేమీ లేదు. పోనీ అంటే, చలపతి కది నడవదు.

తమ్ముని స్థితి అంతా గ్రహించింది బుచ్చమ్మ. నమకమైనా చమకమయినా—విఘ్నేశ్వరపూజ అయినా చలపతికి వచ్చివుంటే బుచ్చమ్మ అవే యేకరువు పెట్టుకోమని ఆజ్ఞాపించి వుండును; కాని అవే కాదు, చలపతికి సంధ్యావందన మయినా రాదు.

ఏమయినా, దేని కయినా ఆయింటో బాధ్యత అంతా బుచ్చమ్మది. పెత్తనం కావాలని పాకులాడేవారు ప్రతీయింటోనూ వున్నారు, సందేహంలేదు; కాని వారిలో చాలా మంది, సమయం వచ్చినప్పుడు తమ బాధ్యత గుర్తించు కోరు. బుచ్చమ్మ అలాంటిదికాదు. కనక, చలపతికిప్పుడు ఏదో వొక పుస్తకం అందించవలసిన బాధ్యత తనది అని గుర్తించుకుందామె. అది నిర్వహించుకో డానికీ పూనుకుందామె.

చూడగా, అన్నిగోడలకూ మధ్యగా ఆయింటో వున్నది, అప్పుడప్పుడు బుచ్చమ్మ పాడుకునే లంకాయాగంపాట పుస్తకం వొకటే. ఆలోచించగా - పదిహేనునిమిషాల పాటున్నూ వెతగ్గా, వంటింటో చింతపండు బుట్టమీద మూత అయివుందది. అదే తీసుకువచ్చి అతని చేతిలో వుంచిందామె.

దీపం కూడా పెద్దది చేసింది.

చలపతి పుస్తకం విప్పాడు. నిద్రమత్తుతో ఎక్కడికో పోయివున్న అక్షరజ్ఞానం నెమరుకు తెచ్చుకున్నాడు. "శ్రీరామ రఘుపతీ సీత పిలిపించుకుని కోరి వేగము చదవగా" అంటూ పాడ్డమున్నూ మొదలు పెట్టేశాడు, లక్షణంగా.

చదువుల్లో శ్రుతపాండిత్యం అన్నది వొకటి. పనిపట్టి శ్రద్ధగా నేర్చు కున్న దానికంటే అదే యెక్కువగా పట్టుబడుతుం దెవరికైనా. ఇంటో యేవిద్య అయినా వుండడం వుంటే, ముందుగా అదే పట్టుబడుతుంది కూడా.

ఆ యింటికల్లా వున్నవిద్య - ముఖ్యంగా యెవరి కయినా వినిపించే విద్య వొక్క బుచ్చమ్మ దగ్గరే వుంది. అది తరుచుగా లక్షణంగా ఆమె లంకాయాగం పాడుకోడం. కనక, చలపతికే గాదు, మరియెవరి కయినా, ఆ నాలుగ్గోడలమధ్యా శ్రుతం అయేది అదొక్కటే. అంచేత, ఆస్థితిని పట్టిపోయి వుంది చలపతి కది.

కనక, బుచ్చమ్మ ఆజ్ఞ అయింది కనక అది లక్షణంగా పాడ్డమే అతని బాధ్యత. దీంతో, చలపతి బాధ్యతా తీరింది, బుచ్చమ్మ బాధ్యతా తీరిపోయింది; కాని అదే విని తెల్లపోయిం దామె.

పురుషులు నేర్చుకోవలసిన విద్యలు వేరనీ, స్త్రీలు నేర్చుకోవలసిన విద్యలు వేరనీ ఆమెకి బాగా తెలుసు మరి.

కాక, - కావలసినంత భూవసతి వుంది కనకా, పెట్టేవంటి యిల్లున్నూ వుంది కనకా చలపతికి చదువే అక్కర్లేదని ఆమె నిర్ధారణ చేసింది కాని, అతను స్త్రీలపాటలు పాడ్డం యెప్పటికీ వొప్పుకోదు.

కాగా, లక్షణంగా కాలిమీద కాలువేసుకుని మంచానపడుకుని చలపతి తనమాట వింటున్నందుకు మురిసిపోతున్న దల్లా నాలుక కరుచుకుంటూ యిది వినగానే గభీమని లేచి కూచుందామె. కూచున్న వెంటనే చలపతి దగ్గిరికిన్నీ వురికింది. తీవ్రంగా చూస్తూ మూతిబిడాయించుకుని ముందతని చేతిలో వున్న పుస్తకం వుళాక్కుంది. తరవాత, కిందికి వాలివున్న అతని మొగం రెండు చేతులతోనూ పైకెత్తి, వొకచెవి పైకి వచ్చేటట్టు వెంటనే పక్కకిన్నీ వంచి, ఆచెవిలో తన నోరుపెట్టి "వోరివాజమ్మా, పైకి పాడతావుట్రా, నీ తెలివి తెల్లవారిపోను. నీపెళ్ళాం నవ్వదుట్రా వినపడితే? ఇవాళకీ లోపల్లోపలే పాడుకో. అంటే, కూడబలుక్కో, తెల్లవారాటప్పటికినాన్నని బజారికిపంపి పెద్దబాలశిక్ష అయినా యెక్కాలపుస్తకం అయినా తెప్పించి యిస్తాను, రేపణ్ణుంచి గట్టిగా చదువుకుందువుగాని" అని చెప్పింది. అందుకు సరే అన్నట్టు చలపతి బుర్ర వూపగా, మళ్ళీ ఆ పుస్తకమే అతని చేతిలో పెట్టిదీపం తగ్గించి వచ్చి పడుకుంది ముందు సంగతి ఆలోచించుకుంటూ

"బతికాం" అనుకున్నాడు చలపతి. నిద్రచెడగొట్టి పుస్తకం చేతికిచ్చి దీపం దగ్గిర కూచోపెట్టినందు కామెమీద కోపంగానే వుందతనికి; కాని యీమాట చెవిని పడాడప్పటికి కోపం పోడమేకాదు, సంతోషమున్నూ కలిగిం దతనికి.

నిజానికి, బుచ్చమ్మ ఆప్పుడప్పుడు పాడుకోడం వింటున్నాడు కనక, రెండుమూడు చరణాలు మాత్రమే నలిగివున్నాయతనికి. అవి అయి పోయాయా, ఎక్కడి కక్కడే కూడబలుక్కోకుండా, ముందుముందు, వొక్క అక్షరమైనా ససిగా నడవ దతనికి.

అత నక్షరాస్యుడు కాడనడానికి వీల్లేదు. ఏమంటే, విద్యా శాఖవారి లెక్కల్లో, అతను ప్రయిమరీ పరీక్షలో నెగ్గినవాడనీ, ఆపైని మరికొన్ని తరగతులున్నూ చదివివున్నాడనీ పెద్దక్షరాలతో రాసివుంది.

అయితే జరిగిందేమిటంటే? "అబ్బాయిచేత బి. ఏ. పరీక్ష యిప్పించి "మేస్రీటు" పని చేయించాలని వుబలాటపడి మేనత్త అతణ్ణింగ్లీషులో ప్రవేశ పెట్టించింది. ఆదిలో; కాని ఫస్టుఫారంతోనే దండయాత్రలు ప్రారంభించా డతను. చివరికి, ఫస్టుఫారంలో ప్రవేశించిన యేడేళ్ళకి, అంటే, తన పందొమ్మిదోయేట థర్డుఫారం చదువుతూ చదువుతూ బడివిడిచిపెట్టేశాడతను".

ఇక్కడ "బడి విడిచిపెట్టేశాడతను" అంటే అతనది స్వతంత్రించి చేసినపనని చెప్పడంలేదు. పెద్ద చదువులు చదివించాలని అతణ్ణి బడిలో వేయిం

చింది మేనత్త. అప్పటి కాయింటి బాధ్యత అంతా ఆమెది. తరవాత అతణ్ణి బడి మానిపించింది బుచ్చమ్మ. ఇప్పటి కాయింటి బాధ్యత యీమెది మరి.

దానాదీనా అతని కింగ్లీ షంటలేదు. పాఠశాలకే—అసలు విద్యాశాఖకే బలాదూరు కావడంవల్ల తెనుగు గుంటపువ్వులు పూసేసింది.

పైపెచ్చు - ఆ లంకాయాగం, "పి. కె. థ భ ధ థక్క మొదలియారు సుకీయ ఆరుముగం ముద్రాసాలన్ ముద్రింపించి బహిష్కరింప బడ్డది" కూడాను.

ఇంతకీ, - లాంతరునిండా చమురుండడంవల్ల దీపం బంతి పువ్వులా వెలిగిపోతూనూ వుంది. పుస్తకంలో మొదణ్ణుంచి చివరికీ చివరినుంచి మొదటికీ గిరగిరా తిరిగిపోతూనూ వున్నాయి కాగితాలు. "తమ్ముడు నాచేతిలోనే వుంటా" డని బుచ్చమ్మ గర్వపడుతూనూ వుంది. ఇదేమిటో బోధపడక - తనముందు గతిస్నీ తోచక గదిలో జోగమ్మ అటమిటించి పోతూనూ వుంది; కాని యిలాంటి సమయాన, యెలా వచ్చిందో యెవరికీ తెలియకుండా వచ్చి ముగ్గురినీ అలుముకుంది గాఢనిద్ర.

భళ్ళున తెల్లవారాక అప్పలమ్మ వచ్చి "బుచ్చమ్మ గోరూ, బుచ్చమ్మ గోరూ" అంటూ పదిమాట్లు వీధితలుపు గుంజేదాకా యెవరికీ మెళుకువ రాలేదు.

7

అప్పుడయినా, అందరికంటే ముందు జగ్గయ్యకి వచ్చిందా మెళుకువ.

తుళ్ళిపడి మేలుకుని, కళ్ళునులుముకుంటూ లేచి, తూల్తూ తూల్తూ బయలుదేరి వచ్చాటప్పటికి, నడవలో వున్న అరుగుమీద వెలవెలపోతున్న లాంతరు దగ్గిర కొట్టేసిన పాములా పడివున్న చలపతి కనిపించా డతనికి.

"ఏమిటిదీ?" అనుకున్నాడు జగ్గయ్య.

"జోగమ్మ నడవలో పడుకుందా" అనుకున్నాడు; గాని యెవరూ లేరక్కడ.

బుచ్చమ్మ తనమంచంమీదే వుంది, అటుతిరిగి.

తలుపు అప్పటికీ గుంజుతూనే వుంది, అప్పలమ్మ. అందుకూయిందుకూ చాలా కోపం వచ్చింది జగ్గయ్యకి. "వినపడింది, వస్తున్నానే" అంటూ గుమ్మం కేసి చూస్తూ వొక్క వురుమురిమాడు ముందతను దాంతో. "ఇక్కడ పడుకున్నావేం నాయనా" అంటూ ఆప్యాయంగా అడిగాడు తరవాత తట్టి లేపుతూ చలపతిని.

చలపతికి మెళకువ వచ్చింది; కాని "చదువుకోమంటూ నాలుగ్గంటలకే లేచి కూచోబెట్టిం దక్కయ్య" అంటూ వుబ్బెత్తుగా లేచి తడబడుతూ పెరట్లోకి చక్కాపోయా డతను.

"చదువా?" అని కళ్ళు చికిలించుకుంటూ పుస్తకం తీసిచూశాడు జగ్గయ్య "లంకాయాగం" అన్న అక్షరాలు కొట్టవచ్చాయి. తెల్లపోయాడతను? కాని మళ్ళీ తలుపు గుంజింది అప్పలమ్మ.

ఇటు లంకాయాగం పుస్తకమూ, అటు లంకిణిలాగ అప్పలమ్మాను. వీటికి సాయం యెప్పుడూ లేంది, చలపతికి తెల్లవారుజామున చదువు.

అగ్గయిపోయాడు దీంతో జగ్గయ్య. వొళ్ళు మరిచిపోయి ఆ పుస్తకం నిలువుగానూ అడ్డంగానూ రెండుచింపులు చింపి మండువాలోకి విసిరేశాడు ముందతను. తరువాత తలుపుతెరిచి "వస్తున్నానే అంటూనే వున్నాను గదా, అదే గుంజడమా తలుపు? ఒక్కక్షణం నుంచోలేవూ? ఇంత తొందర పడే దానివి, ఇంతపొద్దెక్కేదాకా యేమి చేస్తున్నా వసలు?" అంటూ బాగా చెండు కున్నాడు.

ఈ రభసకి తుళ్ళిపడి, గదిలో జోగమ్మా, వాకట్లో బుచ్చమ్మా వొక్కమాటే మేలుకున్నారు.

అయితే, తండ్రి రుసరుసలూ- అప్పలమ్మ గొణుగుడూ చూసి అదంతా తలుపు తియ్యడం దగ్గిరే వచ్చిందనుకుంది బుచ్చమ్మ, దీనిమీద "నేనొక్క క్షణం యెక్కడి కైనా వెడితే - వొక్కక్షణం నిద్రపోతే - వొక్కక్షణం బద్ద కిస్తే కొల్లేరయిపోతుంది కొంప. నేనేం కావాలని నెత్తిన పెట్టుకున్నానా యేమిటీ పెత్తనం? పనిమనిషిమీద యెగిరి పడకపోతే నన్నే లేపితేయేం?" అంటూ లేచికూచుందామె.

ఆలేవడం అయినా, జోగమ్మ యివతలికి వచ్చిందా లేదా అని వోరకంట గదికేసి చూస్తూనే లేచిందామె.

"మరి, నీకంత బండనిద్ర యేం?" అనడిగాడు జగ్గయ్య. అప్పటి కింకా ధుమధుమలాడుతూనే వుందతని మొగం.

"కొట్టుక్కొట్టుకుని పదకొండింటికి పడుకున్నాను, పట్టక పట్టక తెల్లవారగట్ల నిద్రవచ్చింది నాకు"

"నాలుగ్గంటలకే లేపావుట అబ్బాయిని?"

"నాలుగే అయిందో, అయిదే అయిందో నాకేం తెలుసూ?"

"వాణ్ణి లేపవలసిన అగత్యం యేమి వచ్చిందీ?"

"చదువుకో మనడం తప్పా?"

"లంకాయాగమా వాడు చదవ్వలసింది?"

కొయ్యయిపోయింది బుచ్చమ్మ. ధుమధుమ లాడుతూనే నూతి పెరట్లోకి వెళ్ళిపోయాడు జగ్గయ్య.

అప్పటికీ మంచంమీద కూచునేవుంది బుచ్చమ్మ. "ఇంటో మరో పుస్తకం లేక లంకాయాగం యిచ్చాను, తప్పా" అనుకుంది. తండ్రికీ లేకపోయె, కొడుక్కీ లేకపోయె చదువులీ కొంపలో, మరి పుస్తకా లెలా వస్తాయీ మరో రకం?" అనిన్నీ రుంజుకుంది. ఈ రుంజుకోడంలో అటూ ఇటూ చూసింది. గుర్రాలకళ్ళలాగ మొగం తిప్పుకుంటూ. అలా తిప్పుకోడంలో మండువాలో వున్న కాగితాలముక్కలు కనపడ్డాయామెకి. నిదానించగా యేదో పుస్తకం చింపేసిన బాపతన్నట్టున్నా యవి. ఆత్రంగా తీసి చూడగా లంకా యాగం.

తన లంకాయాగానికి పట్టిన గతి అది. "అయ్యో, అయ్యో" అంటూ నోరు నొక్కుకుని కొయ్యయిపోయింది వెంటనే. "నాకీ గతిపట్టిన కొత్తరికం అత్తయ్య కొనిపెట్టిం దీపుస్తకం. ఇంతకాలమూ నా చేతిలో నలిగిన దీని కిప్పటి కీగతి పట్టింది" అనుకుంటూ చాలా బాధపడిపోయిందామె. "మరి, యిలాంటి పుస్తకంటే మొగపిల్లవాడి చేతిలో పెట్టవలసిందీ" అని యెవరో అడిగినట్టయింది? కాని అది వినిపించుకో లే దామె.

"ఏమి చూసుకునీ యీ మిడిసిపాటు? ఎలాగయితేం వచ్చిందే కోడలు, ఆవిణ్ణి చూసుకునా యిదంతా? అయితే, తిన్నారన్నమాటే యిద్దరూ కూడా బువ్వ" అని యీసడించుకుంది. "చూస్తాకాదూ? ఈ కళ్ళ కీ రెప్పలు దూర మవుతాయా?" అనుకుంటూ తల పంకించుకుంది. చివరికి.

దంతధావనం ముగించుకుని యిలాంటప్పుడు మండువాలోకి వచ్చింది జోగమ్మ, మొగం తుడుచుకుంటూ. ఆమెని చూడగానే వొళ్ళు మండుకు పోయింది బుచ్చమ్మకి. "ఇంటో అడుగుపెట్టావో లేదో అప్పుడే కజ్జాలు పెంచు తున్నావు ఇనప గజ్జెల తల్లివి" అనుకుం దామె. "నన్ను కాదని యీ కొంపలో యెవరు నెగ్గుకురాగలరో చూస్తా కాదూ?" అని వొట్టునున్నా పెట్టుకుంది.

ఉండుండి "ఇంత పొద్దెక్కేదాకా మంచం దిగకపోతే పను లెలా తెమలుతాయీ? నేను మాత్రం పడుకోలేనా యేమిటి భోజనాలవేళదాకా కమ్మగా?" అంటూ సాగతీసుకుంది కూడా; కాని ఇదేమీ వినిపించుకోకుండా గదిలోకి బయలుదేరింది జోగమ్మ.

"వంటిల్లు అలకాలి, బొట్టుపెట్టి చెప్పనక్కరలేదో వొదినా" అంటూ

ఝూంకారంగా పిలిచిం దామెని బుచ్చమ్మ. ఆమె అలా అంటూ వుండగానే గదిలోకి వెళ్ళింది జోగమ్మ; కాని వొక్కక్షణాన మళ్ళీ యివతలికి వచ్చి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

తానున్నూ కాళ్ళూ తీర్చుకుంది; గాని తిన్నగా వీధి గుమ్మంలోకి వెళ్ళి నుంచుంది బుచ్చమ్మ. అప్పటికప్పుడే పక్కయింటి సోదెమ్మ కరివేపాకూ, కొత్తిమిరీ, పచ్చిమిరపకాయలూ, గుమ్మబద్దలూ - ఇలాంటివి కొంటోంది.

అక్కణ్ణుంచి ఆవిడా యిక్కణ్ణుంచి యీవిడా వొక్కమాటే చూసు కున్నారు. "మీ మరదలు వచ్చిందా యేమిటి?" అనడిగింది సోదెమ్మ. "ఆ, తోడితెచ్చుకున్నా డమ్మా మా నాయన కోడల్ని" అంది బుచ్చమ్మ, ముక్కూ మూతీ తిప్పుకుంటూ. ఆ మాట యీ మాట అనుకుంటూనే యిద్దరూ సోదెమ్మ అరుగుమీద చేరుకున్నారు.

ఇద్దరూ మాటమీద మాట ప్రవాహ వేగంగా వాడేస్తున్నారు. ఉండుండి "అయితే, వొసే వదినా, సుఖంగా నిద్ర పోకుండా పాపం నాలుగ్గంటలకే లేపావెందుకే చలపతి బావనీ?" అనడిగింది సోదెమ్మ. "ఆ మరే లేపకపోతే వూరుకుంటాను పాపం. పెళ్ళాంగారు వచ్చారని చదువు మానుకుంటే యెలాగా? చూశావా మా నాన్నని? బంధువులకు ఉత్తరాలు రాయాలన్నా, వచ్చిన వుత్త రాలు చూడాలన్నా నీమరిది కాళ్ళు పట్టుకోవాలి గదా? తెలిసివుండీ కూడా అలా తయారు కానివ్వ మంటావుటే చలపతిని?" అంటూ యెదురడిగింది బుచ్చమ్మ.

గతుక్కు మనిపోయింది సోదెమ్మ అది విని; కాని ధోరణి అంతా గ్రహించేసింది. ధోరణి మార్చేసింది నిమిషంలో; కాని బుచ్చమ్మ ఆమె ప్రయత్నం సాగనివ్వలేదు. "కోడల్ని చూసుకుని మానాన్న మహా పొంగి పోతున్నాడు గాని కావెడు సారె అయినా తెచ్చుకోలే దావిడ" అంటూ ముందుకు సాగిం దామె. దానిమీద "అమ్యో, నా తెలివి తెల్లవారిపోనూ చెప్పావే కాదేమిటే?" అంటూ సోదెమ్మా "వొసి నీమొగం యిడ్చా, నేను మాత్రం చూశానా యేమిటే" అంటూ బుచ్చమ్మా సాగతీసుకుంటూ ఈ యింటికి బయలు దేరారు.

అప్పటికి జోగమ్మ, ఆడబడుచు చెప్పిన పని పూర్తిచేసి, చేతికందిన మరి రెండుమూడు పనులున్నూ చేసి పుట్టింటినుంచి తెచ్చుకొన్న సామాను సర్దుకుంటోంది మెల్లిగా.

గది గుమ్మాన అడుగు పెట్టాటప్పటికి, బుచ్చమ్మకీ సోదెమ్మకీ బల్లమీద మొదట హార్మోనియం కనబడింది. దానితరవాత ట్రంకు పెట్టే, బొట్టుపెట్టే,

పొందానూ, వెండిసామాను కొంతావున్నాయి. బుచ్చమ్మ మూతిబిడాయించు కుంది; గాని సోదెమ్మమాత్రం సంబరం కనబరిచింది. "ఏమేమి సారెపెట్టా రమ్మా మీవాళ్ళు?" అని చాలా ప్రీతిగా కూడా అడిగిందామె.

ఆమాటలో జోగమ్మ కెంతో ఆత్మీయత కనబడింది. బుచ్చమ్మ ధోరణిని పట్టి కూడా ఆమెకిది తృప్తి కలిగించింది. వెంటనే "అక్కయ్యగారూ" అంటూ ఆమెని సంబోధించి "సెలవు పుట్టక మానాన్నారు నాకూడా రాలేక పోయారండీ. ఈనెల ఆఖరుకి తప్పకుండా వీలవుతుందని నమ్ముకుని వున్నారు వారు. మాఅమ్మకూడా వస్తుందప్పుడు. పందిరి మంచమూ, బట్టల బీరువా, కుర్చీలూ, టేబిలూ, ఇత్తడి సామానూ, వెండిసామాను మరికొంతా కూడా కొనిపెడతారండీ అప్పుడు" అని మిక్కిలీ ముద్దుగా బదులు చెప్పిం దామె.

సోదెమ్మ చాలా సంతోషించింది. "బాగుంది తల్లీ" అందామె బుజం తట్టుతూ ముందు. "అందచందాలు బాగా తెలుసు మీవాళ్ళకి. అచ్చటాముచ్చటా నీకు బాగానే తీరతాయి నాకు తెలుసు" అని చాలా మెచ్చుకుంది. చివరికి.

కాని బుచ్చమ్మ అనుకోని దిది. సోదెమ్మ తన మరదల్ని చూసి యింత సంతోషిస్తుందనుకోలే దామె. జోగమ్మ గుట్టూ మట్టూ తెలుసుకోడానికే సోదెమ్మ మాట్టాడుతుందనీ, చివరికి తనలాగే ప్రాతికూల్యమే వహిస్తుందనీ కూడా ఆశించిందామె. దాంతో, యిది కొట్టినంత పనయిం దామెకి. మొగం మాడిపోయింది కూడా. "సానిసాపని పంపినట్టు ముందు ఆర్మణీ యిచ్చి పంపారుగదా?" అంటూ యీసడించుకుంటూ యివతలికి చక్కావచ్చిం దామె, వెంటనే.

జోగమ్మ చిన్న బుచ్చుకుందది విని. కళ్ళనీళ్ళ పర్యంతమూ అయిం దామెకి. అది చూడగా గుండెల్లో కలుక్కుమంది సోదెమ్మకి. నాలుక కరుచు కుంటూ తానున్నా యివతలికి వచ్చి "అదేమిటే నీ బుద్ధిగడ్డితినా అంతమాట అన్నావు?" అనడిగింది కంఠం నొక్కుకుని.

ఇద్దరూ గోదావరికి బయలుదేరారు మరి మాట్టాడకుండా.

8

కాఫీహోటలుకి వెళ్ళి అప్పుడే వచ్చాడు చలపతి, బిందెలు బుజాల పెట్టుకుని బుచ్చమ్మా, సోదెమ్మా గోదావరికి బయలు దేరడం అల్లంత దూరాన వుండగానే కనపడింద తనికి. పరుగన్నట్టునడిచి యింటో పడ్డాడు

వెంటనే అతను. గది గుమ్మం సమీపించాటప్పటి కతనికిన్నీ ముందు హాక్మోనియమే కనపడింది. అనుకోకుండా కూనిరాగమున్నూ వుబికేసిందతనికి.

"ఓహో, యిది తెచ్చావూ? భలేదానివి" అంటూ వొక్క దూకున గదిలో పడ్డాడతను.

అప్పటికి జోగమ్మ జంతికిల బరిణే, అరిసెల బరణే పైకి తీస్తోంది పెట్టెలో నుంచి.

"అరిసే, జంతికా పుచ్చుకుందురుగాని యిలా కూచోండి" అంటూ బల్ల కాళీచేసింది వెంటనే ఆమె.

"ఎక్కడికి పంపిందో రాకాసి" అనుకుంటూనే వుందామె, అలాంటిదల్లా బుచ్చమ్మ అలా యిల్లు విడిచిపెట్టగానే అతనిలా యింటికి వచ్చినందుకెంతో మురిసి పోయింది, మరి.

"సాంబారుతో యిడ్లీ తిని యిప్పుడే కాఫీ పుచ్చుకు వచ్చాను; గానీ - ఇలాతే" అంటూ ముందవి అందుకునే తరవాత కూచున్నాడతను. కూచోడమే తడువుగా అరిసె కూడా విరిచాడు, ఆత్రంగా.

తానున్నూ కొంచెం అరిసెముక్క నోట వుంచుకుని అతి నాజూకుగా నములుతూ "నాకు కాఫీ తెచ్చిపెడతారా?" అనడుగుతూ అతనికి చేరబడి నుంచుందామె, వయ్యారంగా.

"మా అక్కని రానివ్వ" మన్నాడతను.

"ఎందుకూ?"

"మరి డబ్బులో?"

"మీరెలా పుచ్చుకువచ్చారూ మరీ?"

"ఎన్నడూ లేదుగానీ - నిన్నా యివాళా తనికి తానే యిచ్చింది మాఅక్క"

"మీకు మీ అక్క యివ్వడం యేమిటీ?"

"నాకేమిటి మానాన్న కేమిటి, డబ్బులు కావాలంటే మా అక్కే యివ్వడం"

"ఏం?"

"ఇనప్పెట్టె తాళాలు మా అక్కదగ్గిరే వుంటాయి, మరి"

ఆమె కనుబొమ్మలు ముడివడ్డాయి.

"పోనీ, నేనిస్తాను పట్టుకురండి వెళ్ళి" అందామె చూసి చూసి.

"తే" అంట్లూ చెయ్యి చాపాడతను. పెట్టెకేసి రెండడుగులు వేసిం

దామె; గాని అంతలో వొక సందేహం తోచగా ఆగిపోయి "ఈ సంగతి రహస్యంగా వుంచుతారాః" అనడిగింది.

"ఏం, రహస్యం యెందుకూః"

"నేను కాఫీ పుచ్చుకున్నట్టూ, అది మీచేత తెప్పించుకున్నట్టూ వారికీ వారికీ యెందుకు తెలియాలీః"

"మా అక్క అడిగితేః"

"ఎలా అడుగుతుందీః"

"నువ్వు పుచ్చుకోడం చూస్తేః"

"నే నెవరూ చూసేటట్టు పుచ్చుకోను. మీరు కూడా వొకళ్ళు చూసేటట్టు తీసుకురావద్దు"

"తరవాత తెలిస్తే 'నాతో యెందుకు చెప్పావు కా'దని గదమదూ మా అక్కః"

అదిరిపడింది జోగమ్మ.

"అయితే, మీరు తీసుకురానే వద్దు. నేనిలా అడిగానని మాత్రం యెవరితోనూ చెప్పకండి"

"చెబితే యేంః"

"అగత్యం యేమిటీ మీకూః"

"చెప్పినా యేమీ అనదు మా అక్క"

"వొక రనడమూ ఆనకపోడమూ - ఇదంతా యెందుకు రావాలీః కనక, మీరు చెప్పనే వద్దు, తెలిసిందాః"

దీనికి బదులు చెప్పలేదు; గాని "నీకు ముఖారి రాగం వచ్చునా"ః అని మాత్రం అడుగుతూ హార్మోనియంకేసి తిరిగా డతను.

"వచ్చు" నందామె. అయితే, "చెప్పకండేంః" అంటూ అతని బుజాల మీద చేతులు వేసి, మొగం మీద మొగంపెట్టి పక్కవాటుగా నుంచుంది.

"చల్ మోహనరంగా పాడగలవాః"

"అది నాకు రాదం" దామె. అని "కాఫీ సంగతి మీ అక్కతో చెప్పకుండా వుంటారు కాదూః" అనడుగుతూ అతని గడ్డం పట్టుకుంది కూడా.

"పోనీ - "సిరిసిరిమువ్వ" - పాడగలవా."

"అలాంటి వడుగుతా రేమిటండీః మీరు నేర్చుకున్నారా అవన్నీః"

"వో, దంచేసి పాడతా న్నేను."

చూసి చూసి "మీ అక్క నేర్పిందాః" అనడిగిం దామె.

"బండప్పలసామి నేర్పాడు నాకు. "అప్పనా తనా మనా" "ఓరోరి బండోడా" "అద్దురూపాయి డబ్బులికీ - " ఇలాంటివి చాలా వచ్చు నాకు."

"కాకి ముక్కుకి దొండపండు కట్టడం" అంటే యేమిటో ఆమె కిప్పు డర్థం అయింది. అందుకే ఆమె కుమలి పోసాగగా "నేనవి పాడతాను, నువ్వు హార్మణీ వాయించు" అంటూ తొందర పెట్టా డతను.

చాలా చురుగ్గా చూసిం దామె, అతని కేసి. "నా కలాంటివి రానూ రావు, నేనవి వాయించనూ వాయించలేను" అంటూ కరుగ్గా కూడా చెప్పింది, తన అసహ్యభావం కనపరుస్తూ. కాని అతని కదేమీ అర్థం కాలేదు. ఆ ధోరణే లే దతని కసలు.

"మరేం వచ్చునూ?" అని మాత్రం అడిగాడు.

"రామ నీ సమానమూ, రామభక్తి, పక్కల నిలబడీ మనసు కరుగ దేమీ, ఎంత వేడుకొందునూ, ఎందరో మహానుభావులూ, సంగీత శాస్త్ర జ్ఞానమూ—"

ఇంకా చెబుతూనే వుందామె; కాని "అలాంటి ముసలమ్మ పాట లెవరి క్కావాలీ యిప్పుడు?" అన్నా డతను, నిరసనగా.

"వెధవ పల్లెటూళ్ళ వాళ్ళ బతుకింతే" అని అనుకున్నాడు కూడా అతను. గిరికీలు కొడుతూ యెందరో అప్పలస్వాములు కనపడ్డా రతని కళ్ళకి. "వాళ్ళలా పాడగలిగితేనా, నారాజా?" అని వూరిపోయాడు. జోగమ్మ వాళ్ళ పెళ్ళాల వంటిది కాకపోయినందుకున్నూ వుసూరుమనిపోయాడు.

దీనికి సాయం, ఆ పాటలమీద సరదా యెక్కువయిపోయిందతనికి. "మా అక్క ఇంటికి రాకుండా యేదో వొక మట్టు పాడెయ్యి తొరగా" అంటూ హార్మోనియం కేసిన్నీ లాగాడత నామెని.

కొయ్యయిపోయింది జోగమ్మ. ఆడబడుచు దౌర్జన్యానికి సాయం యీ వుద్ధృతం కూడా చూసి ఆమె బల్లమీద కూలబడిపోయింది నుంచోలేక.

అదిన్నీ గమనించ లేదతను. "లే మరి. మా అక్క వచ్చేవేళ అయిపోతోంది కానియ్యి తొరగా" అంటూ ఆమెను లేవతీశాడు.

"మీ అక్క వస్తే యేం?"

"తిడుతుంది."

ఇలా అంటూ హార్మోనియం మీదకి లాగా డత నామె చెయ్యి.

"ఎవర్ని తిడుతుందీ?"

"నిన్నూ నన్నూ కూడా."

"మీరింకా ఆవిడచేత తిట్లు తింటున్నారా?"

"లేకపోతే చంపెయ్యదూ?"

"అంటే?"

"అన్నం పెట్టదు. గుమ్మంలోనికి రానివ్వదు."

మీది ప్రాణాలు మీదికే యెగిరిపోయా యామెకి. బుచ్చమ్మ యెంత గడ్డుమనిషో గుర్తించ గలిగింది; గాని చలపతి యింత మద్దుమనిషి అని వూహించుకో లేకపోయింది.

ఏడుపు వచ్చిం దామెకి. అయినా, కన్నీళ్ళు రెప్పల్లోనే అప్పళించుకుని, ధైర్యమున్నూ చిక్కబట్టుకుని యేదో అనపోయింది; కాని మాట తొణకనివ్వలే దతను.

"తొరగా తొరగా" అని రెక్కగూటిమీద పొడుస్తూ తరమసాగాడు కూడా.

మాట రాలే దామెకి; ఆజ్ఞాపిస్తున్న వాడు భర్త. కాదనలేకపోయింది. "తొలినే జేసిన పూజాఫలము" లన్న కృతి వాయించడం మాత్రం పెట్టుకుంది.

అతని కదేమీ నచ్చలేదు. పైగా, వుబలాటం వశం తప్పిపోయింది. వెంటనే జోగమ్మ నివతలికి లాగేసి హార్మోనియం తన కేసి తిప్పుకున్నా డతను.

పెట్టె స్వాధీనం అయింది; కాని మెట్లు? ఆ వుత్సాహంలో - బుచ్చమ్మ వచ్చేస్తుందన్న ఆ కంగారులో యిదేమీ తోచలే దతనికి.

మొదట, యెడమచేతి శక్తి అంతా వినియోగిస్తూ గాలి పొయ్యసాగా డతను. తనకి వచ్చిన ట్యూమీలన్నీ యేకబిగిని వాయించెయ్యాలని యేక కాలంలో నాలుగుమెట్లు నొక్కాడు.

ఒక్క ట్యూమీ కూడా పలకలేదు. కాని యేకటాకీని నాలుగు వూర కుక్కలు మొరుగుతున్నట్టు మాత్రం అయింది.

విసిగిపోయా డతను, దానాదీనా.

దీనికి సాయం బుచ్చమ్మ వచ్చేసిన సవ్వడిన్నీ అయింది.

ఎలా వున్నా హార్మోనియం అలా వదిలేసి, వెంటనే వాకట్లోకి వొక్క దూకున్నూ దూకేశాడు.

జోగమ్మ అందుకే తెల్లపోగా, బిందె బుజాన వుంచుకునే యెదురుగా నుంచుని, బిందె బరువుకీ కోపావేశానికీ వూగిస లాడిపోతూ "మా పరువు తక్కనివ్వవూ? నేను బతికి వున్నంత కాల మయినా ఆర్మణీ కట్టిపెట్టు.

తరవాత నువ్వేలాగా భూమ్మీద మన్నవులే" అంటూ గింజుకుని, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వంటింటోకి యెగిరి పోయింది బుచ్చమ్మ.

9

జోగమ్మ చాలా యిదయిపోయింది.

"ఎందుకూ తిట్టడం? హార్మోనియం వాయిస్తే తప్పేమిటీ?" అంటూ యెంతో బాధపడింది.

కానయితే, వచ్చినప్పణ్ణుంచీ తెలుస్తూనే వుంది బుచ్చమ్మ వాలకం; కాని, యింతలో అది యింతగా ముదిరిపోతుందనుకోలే దామె.

ఆమె తల్లి పూర్ణమ్మమాత్రం యెప్పుడో గ్రహించి వుందిది.

బుచ్చమ్మ, తాను వితంతు వయివుండిన్నీ తన తమ్ముని పెళ్ళిలో అన్నిటికీ తానే ముందుకి వస్తూ, ప్రతీదానికి పెడర్థాలు తియ్యడమూ, కుయుక్తులు పన్నడమూ, ఒక్కొక్కపూట చలపతిని ఫలాహారానికి విడిది నుంచి తమ యింటికి రానివ్వకపోడమూ, అలకమంచం మీద తగని పట్టు పట్టించడమూ, ప్రోల్లో పట్టుచీర వెనక్కి పెట్టించి తన కూతురుకి సాదా రంగునేత చీర పెట్టించడమూ ఇలాంటివి పూర్ణమ్మ మరిచిపోలేదు, వొక్కటీ కూడా.

తరవాత, పండుగులకు చలపతితో కూడా వచ్చి ఆమె చేసిన అల్లరి కూడా మరిచిపోలే దామె.

తన యేకపుత్రుడు పోయినప్పుడు బుచ్చమ్మ చేసిన అగాయిత్యం కూడా మరిచిపోలే దామె.

మొత్తానికి, మొగుడి అప్రయోజకత్వమూ, ఆడబడుచు రాగతనమూ తన కూతురుకి ముప్పు తెచ్చి పెడతాయని మొదణ్ణుంచీ అనుకుంటూనే వుందామె.

కాగా, జోగమ్మని అందుకు తగ్గట్టే తయారుచేసింది.

అసలు, జోగమ్మయినా సిసింద్రీకాని వాలుజెవుల మనిషికాదు.

"తాళాలు నీ మామగారి చేతిలో వుండాలి. లేకపోతే నీమొగుడి దగ్గిర వుండాలి. అతనికి చేతకాకపోతే నువ్వు చేసుకుంటావు పెత్తనం. మధ్యగా యీ గాలివాన మనిషెవరే నీ యింటోనూ?" అని తల్లి అడిగిన మాట బాగా జ్ఞాపకం వచ్చింది జోగమ్మ కిప్పుడు.

అయితే, తొలీమాటు వచ్చాటప్పటికే కథ యిలా అడ్డం తిరిగింది గదా యేమిటి దారి;

బుచ్చమ్మకి స్థానబలం వుంది. అంటే, - తండ్రిబలం వుంది. తమ్ముడి బలం వుంది. ఇరుగుపొరుగుల ఆసరా కూడా వుంది,

మరి, తనమాటః

వచ్చీరావడంతోనే కజ్జాకి సిద్ధపడితే, తరవాత జయంమాట యేమయినా, ముందు లోకులు పీకెయ్యరూః చివరి కే యిరుగుపొరుగు ముసలమ్మ అయినా తనకి ఆసరా అవుతుందన్న భరవసా లేనప్పుడు యిక న్యాయం తనదయితే మాత్రం యేమి లాభమూః

తల్లిచేసిన బోధ అంతా ఆమె కిప్పుడు బాగా నెమరుకి వచ్చింది. అంతా గమనించుకుంది. దురదృష్టపురోజు లెన్నాళ్ళో అన్నాళ్ళూ తన కిది తప్పదనుకుంది.

ప్రాజ్ఞత లేనివాడు కనక తన మొగు డీవేళ బుచ్చమ్మ చేతిలో వున్నాడు. ఆదారినే రేపు తన చేతిలో పడకుండా వుంటాడాః" అనిన్నీ ఆలోచించుకుంది. ఈ నిశ్చయంతో, బుచ్చమ్మ యెన్నిమాట లన్నా యెలాంటిమాట లన్నా బదులు చెప్పడం మానుకుంది.

కాని, వచ్చిన మూడోనాటి రాత్రి, ఇక పడుకోడమే తరవాయి అయి వున్నప్పుడు, బుచ్చమ్మ "ఇవాళ రంగూన్ రౌడీ నాటకంట కాదూః చూడాలని లేదుట్రా తమ్ముడూ నీకుః" అని అంటించి, యెరగనివాణ్ణి రెచ్చగొట్టి, అర్ధ రూపాయకాసు చేతిలోపెట్టి, తండ్రికి తెలియకుండా చలపతి నవతలికి పంపేసి నప్పుడు బేలపోయి వొక్క గంటసేపు మాత్రం కుమిలి కుమిలి యేడ్చిం దామె.

ఆ దుఃఖం కొత్తగోదావరి వరద అంత వుద్ధృతంగా వచ్చింది. గజగజలాడించేసింది. అటూ యిటూ విసిరేసింది. సుడిగుండాలలో తిప్పితిప్పి కొట్టింది. అడుక్కంటా ముంచేసింది. ఆకాశానికిన్నీ యెగరగొట్టేసింది. ఇన్ని చేసిన్నీ చివరికి మాత్రం ఆమె బేలతనం కొట్టుకు చక్కాపోయింది.

అంతటితో పూర్తి కాలే దది.

ఆరాత్రి చలపతి మూడున్నర కింటికి వచ్చాడు. అతను తలుపు గుంజడమూ, బుచ్చమ్మ తలుపు తియ్యడమూ "నీ కిప్పుడు నాటకాలేమిటి నాయనాః" అని జగ్గయ్య మందలించడమూ వరాసగా జరిగిపోయాయి.

ఈ సందడితో తనకి నిద్రాభంగం కాగా, మొగుడింటోకి వస్తాడు కదా అని, చడీ చప్పుడూ కాకుండా తలుపు గడియతీసి వుంచి పడుకుంది జోగమ్మ.

కాని బుచ్చమ్మ వుక్రోషం అంతటితో తీరలేదు.

చలపతిని తన మంచంమీద వాకట్లోనే పడుకోమని, కొంగుపరుచుకుని తాను అరుగుమీద పడుకుంది. అదేమిటో - ఇదెందుకో గూడా అర్థంకాక - వుసూరుమంటూ పడుకుని, పడుకోడం తడువుగా వొళ్ళు మరిచి గాఢనిద్రలో పడిపోయాడు చలపతి.

అప్పుడు కూడా వుత్తర వరదలాగ వుడుకుమోత్తనం వచ్చింది జోగమ్మకి; కాని తనే తుమ్ముకుని తనే దీవించుకున్నట్టు, కొంత సేపటికి తన్ను తానే వోదార్చుకుం దామె.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ గోడవైపు తిరిగి పడుకుని ఆలోచన ప్రారంభించిం దామె.

"ఏమిటి దీని కుపాయం?"

ఇలా యెత్తుకుందామె విషయం; కాని దీనికి జవాబు తోచడానికి బదులు "నీ ఇంట్లో మాయబుచ్చమ్మకి పెత్తనం యెలా వచ్చిందీ?" అని యెవరో ముదలకించి అడిగినట్టయింది.

అవును - నిజమే - ఎలా వచ్చిందీ?

జగ్గయ్య వెర్రిబాగులవాడు కనక, చలపతి వో - ట్టి తులసీదాసు కనక, ఇప్పటివరకూ ఆ కొంపలో యిలా ఆలోచించినవారు లేకపోయారు కనక?

అయితే, ఇప్పుడు చెయ్యవలసిం దేమిటీ?

ముందు చలపతికీ బుచ్చమ్మకీ భేదాలు పెట్టడం. తా నతణ్ణి లోపు చేసుకోడం. కొంతవర కయేనా యిది సాధ్యం అయితే, అప్పుడు తన కాళ్ళకి నేల అంది నుంచోడానికి వీలవుతుంది.

తరవాత, జగ్గయ్యకి, కూతురిమీద ప్రేమే యెక్కువో తనమీద వాత్సల్యమే యెక్కువో కనిపెట్టడం.

అతను కూతురుపక్షం అయివుంటే, సేవచేసి, పూజచేసి కాళ్ళు కడిగి దాహం పుచ్చుకుని, తన తెలివి తేటలూ, వినయ విధేయతలూ, జాగ్రత్తగా కనబరిచి, బుచ్చమ్మ రాగతనం గ్రహించేటట్టున్నూ చేసి అతని వాత్సల్యాను రాగాలు సంపాదించుకోడం.

ఈ యిబ్బంది లేకపోతే, అతనిచేత చలపతికి బుద్ధిచెప్పించుకోడం.

ఈ ఆలోచనా, ఈ ప్రణాళికా జోగమ్మకి తృప్తి, ఆశా, ధైర్యమూ కలిగించాయి. ఆందోళన పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నాలుగుంబావయా టప్పటికి గాఢనిద్ర పట్టిం దామెకి.

10

బుచ్చమ్మ విషయమై చదరంగపెత్తులున్నూ ప్రారంభించింది జోగమ్మ; కాని నాలుగు రోజుల్లోనే ఆ సంగతి గ్రహించేసింది బుచ్చమ్మ.

జోగమ్మా చలపతీ యేకం అయితే యిక తన బతుకేంగానూ? నిజానికి వారేకంకావడమే ధర్మం అని తెలుసుకాని తాను "మనోవృత్తి ముండ"గా మాత్రమే బతకడం ఆమె కిష్టంలేదు.

ఇంటిపెత్తనం తానే చెయ్యాలనీ, చలపతికి ముకుదాళ్ళుపోసి అవి తన చేతిలోనే వుంచుకోవాలనీ, ముప్పుతిప్పలు పెట్టి జోగమ్మని మూడు చెరువుల నీళ్ళు తాగించాలనీ ఆమె వొట్టుపెట్టుకుంది.

"చూసుకో నిన్నేం చేస్తానో?" అని జోగమ్మ నుద్దేశించి పళ్ళున్నూ పటపట్లాడించుకుంది.

చలపతి మొదణ్ణుంచీ తన చెప్పుచేతల్లోనే వున్నాడు. అందే బాగా జాగ్రత్తపడి తా నతణ్ణలా తయారుచేసుకుంది. కనక, తన పెత్తనం యెవరూ తప్పించలేరని దృఢనిశ్చయం చేసుకుంది. అయినా, ఎటొచ్చి యెటుపోతుందో చూపంతా అటే వుంచుకుంది.

ఒకనాడు జోగమ్మ నూతిపెరట్లో నీళ్ళు పోసుకుంటున్న సమయం కనిపెట్టి, చలపతిని వీధిగుమ్మంలోకి తీసుకువెళ్ళి "వెర్రినాయనా, పగలు పెళ్ళాంతో మాట్లాడగూడదు" అని వొక మంత్రోపదేశం చేసింది. "పదిపన్నెండు తరాల నుంచీ మన కుటుంబం సంప్రదాయం యిది" అని తమ ఘనత విశదం చేసింది.

"కోడి కూసింది మొదలు వూరుమాటుమణిగే దాకా రాజుల యిళ్ళ మొగుడూ పెళ్ళా లొకరికంట వొకరు పడరు. గొప్పవాళ్ళ మర్యాదలవి. నీ మామగారు నౌకరీ చేసుకుంటేగాని పొట్టగడవని కుటుంబంలో పుట్టారు. ఇలాంటి మర్యాదలు ఆయనకే తెలియవు, నీపెళ్ళాని కెలా తెలుస్తాయీ? పోసీ అంటే, రాచకొమాళ్ళు నీదగ్గిర దిగతుడుపు. నీకేం తక్కువ?" అని బాగా వుబ్బేసింది, తరవాత.

"సాయంత్రం మనం యిద్దరమూ బజారుకి వెడదాం, వొంటెద్దు బండేం కర్మం, జట్కామీదే వెడదాం దర్జాగా. ఒక టేబులూ, వొక కుర్చీ, ఒక సిరాబుడ్డీ, వొక కలమూ, వొక అద్దుడుకాగితమూ, నాలుగు తెల్లకాగితాలూ కొనుక్కుందాం. నాలుగు కాపీబుక్కులు కూడా కొనేస్తా న్నీకోసం నేను. పగలస్తమానమూ నువ్వు దొరగారిలాగ వీధిగదిలో కచేరి చేసుకుంటూ వుందువు

గానీ, నెలకొక రూపాయ ఇస్తే నీదగ్గిర ఆపనీ యీపనీ చేస్తూ వుంటుంది, వొక పిల్లని కూడా జీతానికి పెట్టేస్తాను. ఇంతలో నీ కూ్కతురు పుడితే అదె యెత్తుకుంటూ కూడా వుంటుంది. అయితే, నేను పిలిస్తేనే నువ్వింటోకి వస్తూ వుండాలి. మరెవరు పిలిచినా రాగూడదు సుమా" అంటూ వూరించినట్టే వూరించి ముందరికాళ్ళకి బందమున్నూ వేసింది.

ఇది పొద్దున్న జరిగింది.

కాని యిదేమీ యెరగని జోగమ్మ, ఆవేళ మధ్యాహ్నం మూడుగంటల వేళ తల దువ్వదామని సన్నచేసి చలపతి నింటోకి పిలిచింది. చలపతి మెల్లిగా బయలుదేరనూ బయలుదేరాడు. అతను గదిలోకి వచ్చిరావడంతోనే తలుపులు వేసెయ్యడాని జోగమ్మ సిద్ధంగా నుంచుంది కూడా.

కాని, పడమటింట్లో వున్న బుచ్చమ్మ యిదంతా కనిపెట్టేసింది.

"తమ్ముడూ" అంటూ పిలిచిందెంతో ముద్దుగా ముందామె. "ఇప్పుడే వెడుదువుగాని వొకమాటిలా రా నాయనా" అని మెల్లిగా రమ్మంది, తరవాత. వచ్చిరావడంతోనే అతని రెక్కపట్టుకుని, యేమిటేమిటో అంతరమంతర గొడవలు చెబుతూ వంటింటి పెరట్లోకి తీసుకువెళ్ళింది, చివరికి.

ఎందుకో అనుకున్నాడతను: కాని "ఇదేమిట్రా రోడ్డు బూడిద, అంతా నీతల్లోనే వుంది?" అంటూ కూచోపెట్టి, నిమిషంలో సాధన సామగ్రి తెచ్చి తనే తలదువ్వేసింది, ఆదరాబాదరా. "ఇక వెళ్ళు అదెందుకో పిలిచింది పాపం" అంటూ పంపేసింది, మండువాదాకా సాగనంపి.

మర్నాడు పిల్లికంటే వొడుపుగా కూచుని గదిలోకి రమ్మని కన్నుగీటింది జోగమ్మ. "మాట చెబుతా కూచోండి" అంటూ రెండు రెక్కలూ పట్టుకుని కూచోపెట్టి నూనె సీసా అందుకుంది తటాలున.

అరిసెలో జంతికలో పెడుతుం దన్న ఆశతో వచ్చాడు చలపతి. నిన్న కూడా అత నలాగే అనుకున్నాడు; కాని బుచ్చమ్మ అవి తక్కకుండా, చేసిందని అవతలికి వెళ్ళాక చాలా బాధపడ్డా డతను పాపం. చివరికయినా పెట్టక పోతుందా అనుకుంటూ ఆశపడుడూ కూచున్నా డివాళ.

కాని బుచ్చమ్మ యిది కూడా కనిపెట్టేసింది.

ఒక్క అంగలో గదిగుమ్మం దగ్గిరికి వెళ్ళి, తా నెంత సేపణ్ణుంచో ఎంత గట్టిగానో పిలుస్తూ వుండినట్టు చురచురలాడుతూ "ఎంత గొంతుకు చించుకున్నా పలకవేమిటే మా తల్లీ?" అంటూ రుంజుకుని జోగమ్మ నివతలికి రప్పించేసింది వెంటనే.

మెల్లిగానే ఇవతలికి వచ్చింది జోగమ్మ; కాని "యేమి మించిపోయిం దేమిటి?" అన్నట్టు చురుకూ చురుకూ చూసింది.

మించిపోలేదు, అసలు, పనీ లేదు: కాని తెల్లపోతే యెలాగా? అంచేత, తనవెంట రమ్మని ముందామెని వుత్తరపు వసారాలోకి తీసుకువెళ్ళింది బుచ్చమ్మ. ఏదయినా పని కల్పించా లక్కడ, అప్పటికప్పుడు. కనక అలాగా యిలాగా చూడగా వొక స్తంభం దగ్గిర చీపురుకట్ట పడివుంది. వెంటనే "ఇది ఇక్కడేనా పడెయ్యడం?" అనడిగింది, ఏదో అకార్యకరణం జరిగిపోయిం దన్నట్టు రూక్షంగా చూస్తూ.

ఉగ్రురా లయిపోయింది జోగమ్మ. ఆమె వచ్చాటప్పటికే అక్కడే వుందది. వచ్చినప్పణ్ణుంచీ దాని స్థలం అదే అనుకుని అక్కడే పడేస్తోంది జోగమ్మ, దినమ్మూ. అయితే, ఇప్పుడీ ఆక్షేపణ ఎందుకు వచ్చిందో తెలుసు నామెకి. అంచేత "మరెక్కడ పడెయ్యా లేమిటి?" అనడిగిందామె, నిలవతీస్తు న్నట్టు చూస్తూ.

"అక్కడ గాదిసావట్లో మానాన్న పడుకునే మంచమా? ఇది ఇక్కడా యెదురుగా?"

"నే నీవూరు వచ్చాటప్పటికే ఇది యిక్కడ వుంటోందా? ఇవాళ దీనికి తప్పువచ్చిందా?" అని యెదురడిగింది జోగమ్మ.

బుచ్చమ్మ తెల్లపోయింది.

పులుకూ పులుకూ చూసుకున్నా రిద్దరూ.

"పనిమనిషి పడేసిందేమో యెప్పుడయినా? ఇంటోవాళ్ళకయినా ఆలోచన వద్దూ?" అనడిగింది బుచ్చమ్మ.

"ఇల్లు మోసినవాళ్ళు వెంటనే చెప్పుకోవద్దూ మొదటే?"

"ఇదిగో ఇప్పుడు చెబుతున్నాను."

"ఇదిగో నేనూ ఇప్పుడే వింటున్నాను."

"అక్కడా ఇది వుండవలసినచోటు" అంటూ బుచ్చమ్మ వొకమూల చూపించింది జోగమ్మకి తానక్కడే వుండి."

వెంటనే "యిదిగో" అంటూ ఆ చీపురు పుచ్చుకుని అటువెళ్ళి "ఇక్కడ పడేశాను సరా?" అంటూ అక్కడ యెత్తిపడేసి "మరి ఇంకేమిటి తరవాయి?" అనడిగింది యెదటికి వచ్చి.

బుచ్చమ్మ ఆ వెటకారం గుర్తించకపోలేదు; కాని "తొందర పడకో ఖామా" అనుకుంది మనస్సులో. ఈ వ్యవధానంలో అలాంటివే మరో చిన్న

పనులు కనిపిందా యామెకి. "అదిగో అది" "ఇదిగో యిది" అని అవిన్నీ చూపించిందా దామె వెంటనే.

జోగమ్మ అవి అందుకునేటప్పటికి మరో రెండు పనులు కనిపెట్టింది బుచ్చమ్మ. అవి పూర్తి చేశాటప్పటికి మరొకటి కూడా కల్పించింది. అయితే, పనిమీద పని కల్పించడంలోనూ, అవి పురమాయించడంలోనూ తానూ అక్కడే వుండిపోవలసి రావడంవల్ల బుచ్చమ్మ కూడా చలపతికి తలదువ్వ లేకపోయింది.

దీనికి సాయం, ఇదంతా యెందుకో జోగమ్మ కనిపెట్టేసింది. దాంతో, చెప్పింది వినిపించుకోకుండా, వికటప్రశ్నలు వెయ్యసాగింది. పెడర్థాలు కల్పించి చెప్పిందానికి తల్లక్రిందులుగా చెయ్యసాగింది. అలా చెయ్యడంలో కూడా తాను చేసిందల్లా బుచ్చమ్మ మళ్ళీ చేసుకుంటే గాని వీలులేనట్టు చేసింది.

"ఆకసింత పనికీ అంత సేపుటే" అని బుచ్చమ్మ సాగతీసుకుంటే "అయ్యో, వస్తున్నా నా మరీ? చేస్తున్నానా? నేనేమీ కూచోలేదు గదా? ఇది చెయ్యడంగాని చెప్పడం కాదుగదా పైని కూచునీ?" అని తానంతకంటే సాగ తీసుకుంటూ – మరింత ఆలస్యమున్నూ చేస్తూ తిప్పితిప్పి కొట్టింది జోగమ్మ ఆమెని.

ఇక్కడ, చలపతి, ఎంత సేపటికీ జోగమ్మ రాకపోవడంచూసి విసిగి పోయాడు. "అరిసెలూ జంతికలూ రాత్రి అయినా పెట్టదా?" అనుకున్నాడు. ఎప్పటికయినా వాళ్ళ పని ముగియడం అంటూ వుంటే "ఇంత సేపూ గదిలో నక్కావుట్రా?" అంటూ బుచ్చమ్మ వచ్చి చీవాట్లు పెడుతుందన్న భయంతో వీధిలోకిన్నీ వెళ్ళిపోయాడు, ఊర్ధ్వశ్వాసతో.

మర్నాడు జోగమ్మ మళ్ళీ ప్రయత్నాలు ప్రారంభించింది. చలపతిని గదిలోకి వెళ్ళకుండా చేద్దామని బుచ్చమ్మ కూడా అంతకిముందే సిద్ధంగా కూచుంది. చూశారు చూశారు ఇద్దరూ కార్యక్రమం అందుకున్నారు.

జోగమ్మ కనుసన్న చేసింది. చలపతి యెగిరి గదిలో పడ్డాడు. ఇద్దరూ నవ్వుకున్నా రొకర్ని చూసి వొకరు; కాని "తమ్ముడూ" అంటూ కేకవేసింది బుచ్చమ్మ వచ్చి. ఇద్దరూ తెల్లపోయారు ముందు. జోగమ్మ ఉగ్రురాలు కాగా, చలపతి వెర్రిమొగం వేశాడు, తరవాత.

కాని బుచ్చమ్మ వూరుకోలేదు. "వొరేయ్, తమ్ముడోయ్" అంది లాలనగా ముందు. "మొన్న ననగా సుభద్రమ్మ వదినతో వొక పని చెప్పాను రా. దాని మొగం యీడ్చా, ఎంత తొందర అని చెప్పినా, యిప్పటికీ మళ్ళీ కళ్ళబడిందే కాదురా అది. మళ్ళీ జన్మకి నీ కడుపున పుడతాను గానీ వొక్క పూటు ఆల్కట్టుతోటకి వెళ్ళిరా నాయనా! దాంతో యీమాట చెబితేగాని

నువ్వింటికి రావద్దు. అది యింట్లో లేకపోతే అక్కడ కూచో నువ్వు. ఒకవేళ యిప్పుడు రాలేనంటుంది. తప్పదను. కాదూ కూడదంటే చివరికి రేపు మధ్యాహ్నం అయినా తప్పకుండా రావాలని చెప్పిరా." అంటూ రెక్కపట్టుకుని వీధిలోకి తీసుకువెళ్ళి చలపతిని ధవళేశ్వరంవైపు పంపేసి మరీ యింట్లోకి వచ్చిందామె.

దీంతో అంతా సద్దుకుంది. జోగమ్మకి బుచ్చమ్మకి కూడా సావకాశం చిక్కింది. వెంటనే సోదెమ్మగారి యింటికి వెళ్ళి కబుర్లు విడేసింది బుచ్చమ్మ.

ఇందులో తనకూ జయం వుండడం గుర్తించుకుంది జోగమ్మ. "నేనే కనక ఆడదాన్నయితే సీరాలుగాయతనం వదిల్చి తీరతా"నని వొట్టుపెట్టుకుంది బుచ్చమ్మని తలుచుకుని ఆమె. వెంటనే గదిలోకి వెళ్ళి, వొక అరిసే వొక జంతికా కమ్మగా తిని, మంచినీళ్ళు పుచ్చుకుని, తాంబూలం కూడా వేసుకుని కాలిమీద కాలువేసుకుని దర్జాగా మంచంమీద పడుకుని, సావకాశంగా సత్యవతీచరిత్ర చదువుకోసాగింది, సావకాశంగా.

11

ఆవేళ రాత్రి చలపతి గదిలోకి వచ్చాక, మీదిమీదికి వెళ్ళి నుంచుని, "తలదువ్వుతాను కూచోండి" అంది జోగమ్మ.

"ఇప్పుడా?" అన్నాడు చలపతి చకితుడయి.

"అయితే యేం?"

"పగలు—"

"అందరూ పగలే దువ్వుకుంటారు తల; కాని మీకు తీరుబడేదీ పాపం? ఇవాళ ఆల్కట్టుతోటకి వెళ్ళారా మరి? రేపు ఆర్యాపురమో, దానవాయిగుంటో, వీరభద్రపురమో, సీతంపేటో, చివరికి హుకుంపేటో—"

"రాత్రి తలదువ్వుకుంటే సానిపుట్టుక వస్తుందిట కాదూ?"

"ఎవరన్నారూ?"

"చాలామాట్లంది మాఅక్క"

"చాలా మంచిమాట అన్నారావిడ. ఇంతకంటే మీకదే నయం అని కోరుకుంటున్నారన్నమాట ఆవిడ. పైగా, ఆ జన్మలోకూడా మీ అక్క మీకు అక్క అయే పుడతారు లెండి, బెంగపెట్టుకోకండి"

గతుక్కుమనిపోయాడు.

మొగమున్నూ బాగా వంచేసుకున్నాడు.

ఇలా అని ఆమె వెంటనే దీపం హెచ్చించి, అది ట్రంకుపెట్టెమీద వుంచి, దాని కెదురుగా అతణ్ణి కుర్చీపీటమీద కూర్చోపెట్టి, పెద్దబిళువారీ అద్దం చేతికిచ్చింది.

బుచ్చమ్మ తలదువ్వితే యెప్పుడూ అద్దం చేతికివ్వదు.

అతను తరవాత చూసుకున్నా అది యింత పెద్దదీ కాదు, ఇంత మంచిదీ కాదు, ఇంత చక్కనిదిన్నీ కాదు.

పైపెచ్చు దానికి చట్రమే లేదు.

"కళాయి పోతోంది నాన్నా" అంటూ బుచ్చమ్మ యెన్నాళ్ళో పోరగా పోరగా, జగ్గయ్య, వొక తాటాకుపెట్టె మూతలో బిగించా డది. దాని కొక నులకతాడు ముక్క కట్టాడు. అది తగిలించడానికి వంటింటి గుమ్మంపక్కని వొక వాసంమేకున్నూ కొట్టాడు.

అద్దం సంగతి యిలా వుండగా, జోగమ్మ తెచ్చిన నూనె మామూలుగా కాక, యెర్రగా వుంది. అది ఆమె చేతిలో వేసుకున్నప్పుడే ఘుమఘుమలు మొదలుపెట్టింది. అది తన తలకు రాసినప్పు డతనికి పాతముక్కు పోయి కొత్తముక్కు వచ్చిన ట్టనిపించింది.

బుచ్చమ్మ తలదువ్వితే, చెవులూ నుదురూ చెంపలూ మెడా నూనె మరకలతో నిండిపోతాయి. ఎక్కడో వొకచోట దువ్వెన్న తప్పకుండా గీసుకు పోయి రక్తం కూడా కళ్ళబడుతుంది, కాస్తో కూస్తో.

జోగమ్మ, అలాకాక చాలా జాగ్రత్తగా నూనె రాసింది. చాలా నాజూకుగా దువ్వింది. ఆ పెద్దద్దంలో వొకదాన్నొకటి రాసుకుంటున్నట్టు ఇద్దరి మొగాలూ ఎంచక్క కనపడుతున్నాయి.

కాక, - మధ్యమధ్య మీదికి వాల్తూ, చెవిలో నోరుపెట్టి "ఇలాగేనా తల దువ్వడం?" అని వొకమాటూ "ఎక్కడయినా దువ్వెన్న గీసుకుపోతే యేమీ అనకండేం" అని వొకమాటూ "ఎంచక్కుంటుంది ముచ్చటముడి వెయ్యనా?" అని యింకోమాటూ "రేపణ్ణుంచి కాకిలాగ గోదావరిలో మునిగి చక్కారాకండి. మీఅక్క గోదావరికి వెళ్ళాక వినోలియా సబ్బుతో వొళ్ళు తోమి నేను స్నానం చేయిస్తూ వుంటాను" అని మరోమాటూ— అని యిలాగ మెల్లిమెల్లిగా యేమి టేమిటో అడుగుతూ, నవ్విస్తూ తుళ్ళిస్తూ, ఉండుండి బుగ్గలకు తన పెదవులు అనిస్తూ, చక్కలిగిల్లిపెట్టి వూపేస్తూ, చిరునవ్వు నవ్వుతూ కొంటెచూపులు చూసి మైకం కమ్మిస్తూ, జంకెనచూపులతో చురుకు పుట్టిస్తూ క్రొత్త ప్రపంచములో తిప్పేసింది కూడా ఆమె.

అక్కడికే ఏదో కొత్తదనం జాగృతం అయిం దతని ప్రకృతిలో. దీనికి సాయం, జోగమ్మ, ముందు తాను సబ్బుతో చేతులు కడుక్కుని వచ్చి తడి గుడ్డతో మొగమంతా మెల్లిగా తుడిచిం దతనికి. కమ్మని స్నో రాస్తూ మొగం అంతా నిమిరింది. అంటీ అంటకుండా పౌడరు రాస్తూ బుగ్గలు పొడిచింది.

పాందానుమూతలో వున్న తమలపాకుచిలక లెడమచేత వుంచుకుని, పక్కపొడిచేర్చి రెండుమూడు చిలక లతని నోటి కందించి, తన నోటకూడా నాలుగు చిలక లుంచుకుని "కాస్త చోటివ్వండి నాకు" అంతా సుతారంగా బుజాలు పట్టుకుని వూపింది, కళ్ళల్లోకి చూస్తూ.

ఇద్దామనే అనుకున్నాడు చలపతి; కాని, వొక్క మనిషికే చాలీచాలని పీట అది. ఈ సంగతి ఆమెకీ తెలుసు. జరగడానికి చోటులేక అతను కంగారు పడుతూ వుండడమున్నూ గుర్తించిం దామె; కాని విలాసవతి కనక "పోనీ లెండి.... ఏం?" అంటూ వెంటనే అతని వొళ్ళో కూచుంది.

అందుకే అతను పరవశు డయిపోగా, ఎడమచెయ్యి అతని మెడకి చుట్టేసి, వొక చిలక పుచ్చుకుని సగం తన నోట వుంచుకుని "ఊ, ఊ," అంటూ పావురం లా గుబాళిస్తూ ఆనోటితోనే తక్కిన ఆ సగం చిలకా అతని నోటి కందించి, వొకమాటు పెదవి కరిచి తరవాత కటుక్కున కొరికి మళ్ళీ కళ్ళలోకి చూసింది, బెల్లిస్తూ.

12

తెల్లవారాక అలాగా యిలాగా తిరగడంలో - వొకమాటు పక్కపక్కగా నడవడంలో చలపతి సంగతి కనిపెట్టేసింది బుచ్చమ్మ. గుప్పున కొట్టింది జోగమ్మ రాసిన తలనూనె సువాసన ఆమెకి. వెంటనే నీళ్ళపొయ్యమీద డేగిసా పడేసి అతనికి తలంటు ప్రారంభించిం దామె.

అది చూసి "వోసి నీబుద్ధి బుగ్గయిపోనూ" అని యీసడించుకుంటూ గదిలోకి చక్కాపోయింది జోగమ్మ.

తలమీద నూనె పెడుతూ "రాత్రి తలదువ్వించుకున్నావు. కదూ అబ్బాయీ?" అనడిగింది బుచ్చమ్మ.

"నేను వద్దన్నాను; కాని అదే దువ్వింది."

'నేనరుగనూ? దానిపనే యిది. అచ్చంగా సానిపాపే మాతల్లి.

తననికూడా ఏమంటుందో అని భయపడ్డా డతను.

"రాత్రి తలదువ్వుకుంటే సానిజన్మవస్తుంది, ఇంకెప్పుడూ అలా చెయ్యనియ్యకు వెర్రినాయ్ననా,"

రాత్రి జోగమ్మ అన్నమాటలు జ్ఞాపకం వచ్చాయి.

"మొగవాడి కాదజన్మ యెలా వస్తుందే?" అని మాత్రం అనగలిగా డతను.

"ఏం రాకా? దేవుడికి ఆడా మొగా భేదం వుందనుకున్నావా? వెనుకటి జన్మలో నీ పెళ్ళాం మొగవాడు కాక ఆడదనుకున్నావా యేమిటి బుల్లాడా?"

అతనికి శరీరం కొంచెం వణికిన ట్టయింది.

"కాకపోయినా, సానికొంపలో మొగవాడ వయి పుట్టి తిత్తివూదే యోగం పడితేనో?"

కొయ్యయి పోయాడు చలపతి.

అది గుర్తించి "తెలిసిం దంటే 'నువ్వయినా చెప్పావు కాదేం?' అని నన్ను తిడతాడు నాన్న" అని అందుకుం దామె.

"దువ్విన వాళ్ళు బాగానే వుంటారు, మధ్య, యేమీ యెరగని నాకూ చివాట్లూ చెప్పుదెబ్బలూను. పెత్తనం చేసి నేనేమీ బాముకోడం లేదు. కుటుంబ మర్యాద నిలబెట్టడానికి నేనెన్నిపాట్లు పడుతున్నానో ఆభగవంతుడి కెరుక. అమ్మ చూసుకోవలసిన వివన్నీ. అలో మని యేడుస్తూ మూలపడి వుండకుండా భారం అంతా మొయ్యవలసి వచ్చింది నాకు. అయితే, యినప గజ్జెల తల్లి ఇంటో అడుగుపెట్టింది, అమ్మ ఎలా తక్కుతుందీ మనకి?"

దీనిమీద రాత్రి చర్య అంతా జ్ఞాపకం వచ్చింది చలపతికి. తాంబూలం నోటితో అందించడమూ, వొళ్ళో కూచోడమూ - జోగమ్మ ఈ విలాసా లన్నీ కళ్ళకట్టి నట్టయినా యతనికి. పైగా "ఆ ఇంటో మీ అక్క అడుగుపెట్టింది, మీ బావ చచ్చిపోయా"డని ఆమె అంటున్నట్టున్నూ తోచిం దతనికి.

"మీ అక్క దౌర్భాగ్యం తెలుసా నీకు?" అని యెవరో బుగ్గమీద పొడిచి నట్టున్నూ అయిం దతనికి.

ఈ మాటలే అనేద్దా మనుకున్నాడు; కాని మాట రాలేదు.

తరవాత కూడా నాలుగైదు మాట లందామె. వాటిలో వొకటి రెండు ప్రశ్నార్థకా లయివుండినా చలపతి బదులు చెప్పకపోడం చూసి "తమ్ముడు సిగ్గుపడుతున్నాడు జరిగిపోయినదానికి. బుద్ధివచ్చింది" అనిన్నీ అనుకుంది. ఆమెకూడా వూరుకుంది, చివరికి.

నోరెప్పు డూరుకుందో అక్కడి నరాల్లో వున్న కదలిక అంతా ఆమె చేతినరాల్లోకి బదిలీ అయింది.

దాంతో, పాళాలు కనిపెట్టే ధోరణి మరిచిపోయి వొకమాటు సలసల లాడే మరుగునీళ్ళు పోసీ, తనచేతులే చురుక్కుమనగా వెంటనే నాలుగుచెంబులు చప్పని చన్నీళ్ళు పోసీ, మెడ బెణికేటట్టు జుట్టు దులిపి, ఫెంకులు తీసెయ్య

కుండా కుంకుడు పిప్పితో నొక్కి వొళ్ళు తోమీ మరో పది నిమిషాలకు తలంటు పూర్తిచేసిం దామె.

అక్కడ సద్దుబాట్లన్నీ చేసుకుని ఆమె వాకిట్లోకి వచ్చాటప్పటికి చలపతికి జోగమ్మ తల చిక్కుతీస్తోంది. తలలో వున్న కుంకుడుకాయపిప్పి కూడా తీస్తోంది.

ముందు కొయ్యయిపోయి తరవాత అగ్గయిపోయింది బుచ్చమ్మ. తాను గోదావరికి వెళ్ళవలసిన సమయం అది. తానొక్కర్తీ వెడితే ఇంటో, తలంటువిషయమై ఎన్నివంకలు పన్నుతుందో? అదంతా చెప్పి చలపతి మన స్సేం విరిచేస్తుందో? ఈ సందేహం కూడా కలిగిం దామెకి.

అప్పటికి జోగమ్మ పని పూర్తయింది. వెంటనే బిందెపుచ్చుకుని బయలు దేరి, యెక్కడ లేని అపేక్ష కనపరుస్తూ "గోదావరికి వెళ్దాం రావే మరదలా" అని పిలిచింది, ప్రేమ గుమ్మరిస్తూ.

అది విని "నాతరవాయి వచ్చిందా ఇప్పుడు?" అనుకుంది జోగమ్మ. "గోదావరి కాదు, నీకు తగ్గది కొల్లేరు" అనుకుంటూ పళ్ళుకూడా కొరుక్కుంది, అటు తిరిగి. "మాటలు పెరిగితే ఏమయినా సరే దులిపేస్తా" నని నిశ్చ యించుకుంది. ఈ నిశ్చయంతో కొంచెం దురుసుగానే వచ్చింది, కొంచెం యెదటికి

"గోదావరికి వెడదాం రా" అని మళ్ళీ పిలిచింది బుచ్చమ్మ.

బుంగమూతి పెట్టుకుని "నేను — రాను" అని బదులు చెప్పిందందుకు జోగమ్మ.

"అదేమే మాతల్లీ?"

"గోదావరిలో స్నానంచేస్తే నాకు జబ్బుచేస్తుంది బాబూ."

"ఎంత వులకమే మామ్మా?"

"మీరు వెళ్ళిరండి ఇంట్లో నాకు పని కూడా వుంది"

బుచ్చమ్మ గతుక్కుమంది. "మా తమ్ముడికి ఉన్నవీ లేనివీ కల్పించి చెబుతావు. అంతకంటే పనేమిటి నీకు?" అనుకుందామె మనస్సులో. ఎలాగయినా ఆమెని వెంటబెట్టుకుని వెళ్ళవలసిందే అనిన్నీ నిశ్చయించుకుంది.

"ఎందుకు చెప్పానో విను"

"నాకంతా తెలుసునండి"

"అంతా తెలుసునూ? అయితే, యివాళ యేకాదశి కదా, సముద్రం అంత గోదావరి వుండగా కాదని బ్రాహ్మణ పుట్టుక పుట్టిన ఆడ దెవరయినా నూతినీళ్ళతో స్నానం చేస్తుందా యీవూళ్ళో?"

ఈమాటకి బదులుచెప్పలేక జోగమ్మ తెల్లపోతుందనీ, పుచ్చినట్టు తన కూడా వస్తుందనీ అనుకుంది బుచ్చమ్మ. కానీ జోగమ్మ వూరుకోలేదు. "మీరు కనక సరిపోయింది గాని, బ్రాహ్మణ యింట్లో పుట్టిన ఆడది యెవర్తయినా ఏకాదశిపూటా, తన తమ్ముడికి తలంటుతుందా యీవూళ్ళో?" అని యెదురడిగిందామె, తల యెగరవేసుకుంటూ.

ఈమాటకి కొయ్యయిపోయింది బుచ్చమ్మ. కత్తివేస్తే నెత్తురుచుక్క లేకుండాపోయింది కూడా ఆమె మొగాన.

నిజంగా ఆమెకి చచ్చినచావయిపోయింది.

దీనికి సాయం, గాదెసావిట్లో జంధ్యాలు వొడుక్కుంటున్న జగ్గయ్య "అలవాటు లేకపోతే జబ్బు చేస్తుంది, పాపం బలవంతపెట్టి దాన్ని గోదావరికి తీసుకువెళ్ళకే అమ్మాయీ" అంటూ కొంచెం గదిమినట్టన్నాడు.

13

ఆవేళ మధ్యాహ్నం, తలదువ్వించుకుందామని ముచ్చటపడి సొంతంగా చలపతే బయలుదేరాడు గదిలోకి; కాని అదే సమయాన, పరికరాలతో వచ్చి వొడుపేసి అతణ్ణి పట్టుకుని వాకట్లోనే మండువా అంచున కూచోపెట్టి బుచ్చమ్మే తల దువ్వసాగింది.

అయితే అక్కడ చలపతికి ముచ్చట అయినట్టే "ఈపాటికి పిలుద్దాం" అంటూ యిక్కడ జోగమ్మకీ సంకల్పం కలిగింది. పరికరాలన్నీ వసారాలో పెట్టి వెంటనే ఆమె వాకట్లోకి బయలుదేరింది.

కాని వాకట్లో అడుగుపెట్టాటప్పటికిదీ "ఖాగోతం."

వొళ్ళు తిరిగి విసిరేసినట్టయి జోగమ్మ, ఆ పక్కనే వున్న స్తంభానికి చేరబడిపోయింది, దాంతో.

ఇది చూసి, బుచ్చమ్మ మరీ మొండికెత్తింది. ఒకమాటు కీగంట జోగమ్మ కేసి చూసీ, వొక్కమాటు కొంచెం ఆలోచన కూడా చేసీ అందుకుని "ఎప్పుడూ లేంది నిక్షేపంవంటి జుట్టు ఇలా పాయలుపాయలుగా వూడిపోతోంది, బజారుకంపు నూనె లేమయినా తగులుతున్నాయా యేమిటి బుల్లేడా" అనడిగింది, ఝూంకారంగా ఆమె.

ఇది విని పెదవులు విరుచుకుంటూనూ, మెడ బిగించుకుంటూనూ జోగమ్మ తల అడ్డంగా తాటించుకుంటూ వుండగా, పిలిచినట్టు పెత్తనాలకు వచ్చింది పక్కయింటి సోదెమ్మ.

ఆ యిద్దరి వాలకమ్మూ చూసి "యేదో వుంది" అనుకోకపోలేదామె; కాని మనకెందుకని వెనక్కి వెళ్ళలేకపోయింది. కాక, — "రావే" అని బుచ్చమ్మా ఆహ్వానించలేదు "రండి" అని జోగమ్మా స్వాగతం చెప్పలేదు, అయినా ముందుకే వచ్చేసింది కూడా.

కూచుంటూ కూచుంటూ ఆమె జోగమ్మకేసి చూడగా, జోగమ్మ ఆమె కేసి చూసింది.

ఎవరో చెప్పినట్టు బుచ్చమ్మకెదురుగా కూచుంది సోదెమ్మ. అవతల యెవరో పిలుస్తున్నట్టు జోగమ్మ కూడా గదిలోకి వెళ్ళిపోయింది.

బుచ్చమ్మలాగ సోదెమ్మా వితంతువే. వారి స్నేహానికది కూడా వొక కారణమే. అయితే. సోదెమ్మ హృదయం స్తబ్దం మాత్రమే అయిపోయింది; గాని శూన్యం అయిపోలేదు. నల్లరాయిన్నీ అయిపోలేదు.

యథారూపంగానే వుందది. నిర్మలంగానూ వుంది, ఆర్ద్రంగానూ వుంది, స్నిగ్ధంగానూ వుంది కూడా. దాని స్పందనం మాత్రం చెల్లెలి హృదయానికి ధారపోసిందామె.

కొడుకులు లేకపోడంవల్ల ఆమె తండ్రి రెండో అల్లుణ్ణిల్లరికం తెచ్చుకున్నాడు. సోదెమ్మ, చెల్లెలే కూతురుగానూ, మరిదే తమ్ముడుగానూ సంసారం దిద్దుతోంది.

సోదెమ్మకి చలపతికి వదినామరదుల వరస. అప్పుడప్పుడు, ఆమె "వెర్రిబాగులవాడు" అనుకుంటూనే చలపతిని పరియాచకం చేస్తూ వుంటుంది.

ఈ చనువుతో "పెళ్ళాంచేత తలదువ్వించుకోడం సిగ్గా యేమిట్రా బావా?" అనడిగిందామె చలపతిని.

పై పెచ్చు, — "కాకపోయినా, చక్కగా పక్కపాపిడి క్రాపింగు పెట్టించుకోక, ఆడపిల్లకి లాగ నీకంత జుట్టేమిట్రా యీరోజుల్లోను?" అనిన్నీ అందామె, చలపతిని పిలిచి.

ఆ సమయాన సోదెమ్మ రావడం బుచ్చమ్మ కిష్టంలేదు. పోనీ అంటే, వచ్చింది వచ్చినట్టుండక అటు జోగమ్మ మొగంకేసీ యిటు బుచ్చమ్మ మొగం కేసీ పరీక్షగా చూడసాగింది కూడా.

అయినా వూరుకుంది బుచ్చమ్మ, లోపల యెంత యిష్టం లేకపోయినా; కాని పెళ్ళాం తలదువ్వడంమాటా క్రాపింగు మాటా తెచ్చాటప్పటి కిక సహించలేకపోయిందామె.

చనువూ, స్నేహమూ, మొగమాటమూ దూరంగా పెట్టేసింది ముందు. ధుమధుమలు సాగించింది తరవాత. "ఇంట్లో వున్న ఆడవాళ్ళు భయభక్తులూ

సిగ్గుబిడియాలూ వున్నవాళ్ళయితే అంతరమతరంవాళ్ళు గజ్జెకట్టుకు వచ్చి యిలా భాగోతం అడగలరా యేమిటి? సిగ్గుకాకపోతే మాత్రం పెళ్ళాంగారు వచ్చారక తోడబుట్టినవాళ్ళని తీసిపారేసుకోవాలా? తలదువ్వే దిక్కు లేకపోతే మొగముండాకొడుకు క్రాపింగూ పెట్టించుకోక బోడిగుండూ చేయించుకోక మరేం చేస్తాడూ? గురివిందగింజ తనకున్న నలుపెరగదు. ఒకళ్ళ ఇంటి ముచ్చట్లు మాత్రం ఇంతకంటే బాగా వుండి యేడిచాయా? కాకపోయినా, కొంతమందికి కళ్ళల్లో వుంటుంది విషం" అంటూ విసిరికొట్టింది, చివరికి.

సోదెమ్మ మనస్సు చివుక్కుమంది. చాలా అభిమానపడి పోయిందామె. కళ్ళనీళ్ళ పర్యంతమూ కూడా అయింది. మరి కూచోలేకపోయింది.

"యాదాలాభంగా అన్నమాట కింత అల్ల రేమిటే మా తల్లీ" అని పులుకూపులుకూ చూస్తూ వుబ్బెత్తుగా లేచినుంచుంది మొదట ఆమె. "తెల్లవారి యెవరి మొగం చూశానో?" అనుకుంటూ వీధిలోకి వెళ్ళిపోయింది తరవాత. "తీరికూచుని యెంతంతలేసి మాటలు పడవలసి వచ్చిందీ?" అని మిక్కిలీ పరితపిస్తూ ఇల్లుచేరుకుని "మరద లంటే కళ్ళల్లో అంతగా నిప్పులు పోసుకుంటుందే?" అని గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

"వెళ్ళిపో, నాకేం దిగడిపోతుం దనుకున్నావా? అసలిక్కడికి నిన్నెవరు ర మన్నారే బుద్ధిలేనిదానా?" అనుకుంది బుచ్చమ్మ.

"అల్లరిట అల్లరి, చూశావా తమ్ముడూ? గుమ్మంలోకి రానిస్తే ఎంతెంత లయినా పుట్టిస్తుందిది. చెల్లెలికి మాయమాటలూ మంకుపట్లూ నేర్పి మరిదినెంత ఏడిపిస్తోందో యెరుగుదువా నువ్విది? నీ పెళ్ళాన్ని లోపుచేసుకుని మనకొంప క్కూడా ముప్పతెస్తుంది సుమా చివరి కిది, కనుగలిగి వుండాలి నువ్వూ నేనూ కూడా" అని చలపతి చెవిలోనున్నూ వూదిం దామె.

తరవాత జోగమ్మ నుద్దేశించి, ఆగదికేసి చూస్తూ "ఆటక్కులాడితో మాట్టాడి చూడు నిన్నేం చేస్తానో?" అంటూ పళ్ళనున్నూ కొరుక్కుంది, చివరికి.

లోగుమ్మంలో నుంచుని, జోగమ్మ, ఆ చెలికత్తెల మాటలన్నీ వింది. చలపతిని గురించి వారి కిద్దరికీ విరోధం వచ్చినందు కెంతో పొంగిన్నీ పోయిందామె.

14

నెల్లాళ్ళగ్గానీ రారనుకున్న జోగమ్మ తల్లీ తండ్రీ పదిహేను రోజులకే వచ్చారు

నిజాని కవిరోజులే; గాని జోగమ్మకి సంవత్సరాలన్నంత భారం అనిపించాయి.

వా రయినా, జోగమ్మని విడిచి వుండలేక అయితే నేమి, నెల ఆఖరున గాని అందదనుకున్న సెలవు పదిహేను రోజులకే రావడంవల్ల నయితే యేమి పిలిచినట్టు వచ్చారు కనక సరిపోయింది గాని, లేకపోతే, ఎంత బిగపట్టుకున్నా ధైర్యం నిలవక బెంబేలుపడిపోయివుండును జోగమ్మ.

అక్కడికీ, పెట్టె తెరిచి మినపసున్నిబుట్టా, మిఠాయిబుట్టా పైకితీస్తూ తలవని తలంపుగా తన మొగంచూసి "అదేమే మామ్మా, అంత కంప అయిపోయావు?" అంటూ తల్లి చేతులు చాపాటప్పటికి దుఃఖం పొంగుకురాగా తల్లి మీద వాలి బేరు మనిపోయిం దామె.

బుచ్చమ్మ వెయ్యి కళ్ళతో కనిపెడుతూనే వుంది; గాని, జోగమ్మ, ఇక్కడి సంగతి అంతా ఆ పూటే తల్లితో చెప్పేసింది.

పూర్ణమ్మ కరికాలి మంట నెత్తికి వచ్చింది. అది విని వేంకటాచలం కూడా చాలా ఆగ్రహపడ్డాడు; కాని అల్లుడి అమాయకత్వం జ్ఞాపకంవచ్చి "తొందరపడకు" అని పూర్ణమ్మని ముందు సముదాయించి "పద్దన్ని రోజులు పట్టవు, తల్లీ, వోపికపట్టు. మేమిక్కడ పదిరోజు లుందా మని వచ్చాము. ఈ లోపున చలపతిని దిద్దగలుగుతానా సరే, లేకపోతే, తరవాతి సంగతి అప్పుడు చూసుకుందాం" అని జోగమ్మని కూడా వోదార్చి ఆలోచన ప్రారంభించా డతను.

ఇదిలా వుండగా, జోగమ్మనీ, పూర్ణమ్మనీ చలపతినీ వెంటబెట్టుకుని ఆవేళ మధ్యాహ్నమే బజారుకి బయలుదేరా డతను; కాని చలపతి వారితో వెళ్ళడం బుచ్చమ్మకి సుతరామూ ఇష్టం లేదు. అయితే, ఆ మాటా ఈ మాటా చెప్పుకుంటూ వాకట్లో కూచున్నవారు కూచున్నట్టుగానే బయలుదేరడంవల్ల వద్దనడాని కామెకి వీలుకాలేదు. కళ్ళతో సన్నచేసి అయినా ఆపుచేద్దా మని యెంతయినా చూసింది; గాని వొట్టు పెట్టుకున్నట్టు చలపతి, ఆమె కేసే చూడలే దాసమయాన.

మళ్ళీ అయిదుగంటలవేళ వచ్చారు వా రింటికి వెండి - కంచు ఇత్తడి సామానూ, పందిరి మంచమూ, పీచుపరుపూ, దూదిపరుపూ, మార్బిలుమేజా - ఇలాంటి సామాను కొంత పట్టించుకునే వచ్చారు వా రూరికే కాదు.

జగ్గయ్య పొంగిపోయాడు; కాని అదంతా చూసీచూడగానే మూతి ముడుచుకుని వంటింటోకి చక్కాపోయింది బుచ్చమ్మ

తండ్రి సన్నచెయ్యగా, తల్లి ముందుకి నడిపించగా "మా అమ్మా మా నాన్నారూ మమ్మల్నిద్దరినీ బజారుకి తీసుకువెళ్ళి నాకు సారెవస్తువులు కొన్ని పెట్టారు మామయ్యగారూ?" అంటూ మురిసిపోతూ వెళ్ళి చెప్పింది జోగమ్మ, ముందు జగ్గయ్యకి పాదాభివందనంచేసి. ఆ వస్తుసామగ్రి కంటే కోడలి వినయం చాలా ఆనందం కలిగించిం దతనికి. దాంతో పరవశు డయిపోయి, అతను "జమీందార్లు, మీ వాళ్ళిచ్చారన్నా, పెట్టిపుట్టావు, నువ్వు తెచ్చుకున్నావన్నా వింత యేమి టమ్మా?" అని కోడల్నీ, "మా ఇల్లు పడుతుందా బావగారూ?" అంటూ వియ్యంకుణ్ణీ ప్రశంసించి, కూలీలను వాకిట్లోకి రప్పించి "ఇక్కడ-ఇక్కడ" అని సామానంతా దింపించాడు జగ్గయ్య.

జాపితాప్రకారం సామానంతా సరిచూసుకుని, నూతికివెళ్ళి, కాళ్ళు చేతులూ కడుక్కుని మంచినీళ్ళు స్వయంగా పుచ్చుకున్నారు రెండుజోడాల వారున్నూ.

పాతమంచం విప్పి వాకిట్లోకి చేర్చేదాకా కూడాకూడావుండి జగ్గయ్య, తరవాత బుచ్చమ్మని బలవంతాన తీసుకువచ్చి ఆమె సాయంతో అది పడమటింటో అమర్చుతూ వుండగా — జోగమ్మ సెలవులందుకుంటూ, పూర్ణమ్మ సాయం పుచ్చుకుంటూ వేంకటాచలమూ చలపతీ పావుగంటలో కొత్త మంచం అమర్చేశారు.

తక్కిన సామాను కూడా గదిలోకి చేరేదాకా సాయపడి, తరవాత "ఇక నావల్ల కాదమ్మోయ్! కాకపోయినా, నేను వియ్యపురాలినైతిని, మీయింట్లో నేను చాకిరీ చెయ్యడం యేమిటీ? ఎవరయినా చూస్తే నవ్విపోరూ, సిగ్గుసిగ్గు" అంటూ చలపతికేసి వోరచూపులు చూసి, జోగమ్మకి కన్నుగీటి వాకట్లోకి వచ్చి చతికిలబడి — సామా నెక్కడ వుండవలసిందక్కడ సద్దడంలో వొకరికొకరు సలహాలు చెప్పుకుంటూ, వొకరికొకరు సాయం చేసుకుంటూ, మధ్యమధ్య "నీకు తెలియ"దంటే "మీరెరగరండీ" అని వాదించుకుంటూ "నాకు తోచింది చెప్పాను, ఆపైని నీయిష్టం అంటే, "నేననుకొన్నది చెప్పాను. ఇక మీయిష్టం సుమండీ" అని మళ్ళీ అంతలో సమాధానపడుతూ జోగమ్మా చలపతీ బుజమూ బుజమూ రాసుకుంటూ తిరగడంచూసి వేంకటాచలంకేసి సాకూతంగా చూసింది పూర్ణమ్మ,

అది చూసి, ముందు ముసిముసినవ్వులు నవ్వుకుని, తరవాత, తువ్వాలు పరుచుకుని కవాచీ బల్లమీద నడుంవాల్చాడు వేంకటాచలం.

15

"తెచ్చిన వెంటనే వస్తువులు వాడుకుంటే ముహూర్తం అక్కర్లేదుట" అంది జోగమ్మ.

"అవునుట, చాలామట్లు చెప్పాడు మానాన్న" అన్నాడు చలపతి.

"ఇంకేం, మరి, కుర్చీమీద కూచోండి ముందు" అంటూ చెయ్యి పట్టుకుని అతణ్ణి అలా తీసుకువెళ్ళింది జోగమ్మ.

"అది నీకోసం కొన్నారు మీనాన్నారు. ముందు నువ్వు కూచోవాలః కాని నేనాయేమిటిః" అని నసుకుతూనే దర్జాగా కూచున్నాడతను.

"నేను వొట్టి కుర్చీలో కూచుంటానా యేమిటి మీలాగః" అనడిగింది జోగమ్మ, మీదికి వాలి.

"మరెలా కూచుంటావుః" అనడిగాడు చలపతి.

"ఇదిగో యిలాగ" అంటూ వెంటనే అతని వొడిలో కూచుందామె, బెల్లించి చూస్తూ.

రెండుచేతులూ అతనిమెడకి చుట్టవేసి, బుగ్గాబుగ్గా ఆనించి కువకువలాడి "తెలిసిందాః బాగుందాః" అనిన్నీ అడిగిందామె.

దాంతో, తెరపిమరపుల్లో పడిపోయాడు కాస్సేపతను.

తరవాత, అతని మొగాన మొగంవుంచి రేపు పొద్దున్న మీరు కోరుకున్న కుర్చీ కొంటారుట మా నాన్నారు" అంది జోగమ్మ.

"నీతో చెప్పారాః"

"మా అమ్మా మా నాన్నారూ అనుకున్నారు."

"ఊహూ."

"ఆ కుర్చీకి తగిన టేబిలు కూడా కొనమంది మా అమ్మ."

అతని మొగం విప్పారింది.

"కొంటా" నన్నారు మా నాన్నారు.

"భేష్!"

"ఫౌంటెన్ కలం కూడా కొని ఇమ్మన్నా న్నేను."

"వో" అంటూ యెగిసిపడ్డా డతను, జోగమ్మని పక్కకి తీసి.

"ఇక అస్తమానమూ రాసుకుంటూనే కూచుంటా న్నేను" అని ఆమెని గట్టిగా పొదువుకున్నాడు కూడా.

ఇంతలో "అడగడం ధర్మం కాదుగానీ - అయినా, వూరికే - విందామనీ సంతోషిద్దామనీ సుమండి. మంచం యెంతకి పుచ్చుకున్నారు భావగారూః" అని జగ్గయ్య అడగడమూ "దాల్లో తప్పేవుంది బావగారూః వస్తువు కంటి

కింపుగా వున్నప్పుడు "వెల యెంతః" అన్న ప్రశ్న సహజంగా తోస్తుం దెవరి కయినా. కనక, మీరడగడం ధర్మమే కాదు, మాకు మన్ననాను. అది మా అదృష్టం అనండి, ఈశ్వర కటాక్షం అనండి, మే మనుకున్న చేవకర్ర మంచమే దొరికింది పురమాయించినట్టు. నూటయెనభై ఆరు రూపాయలు పుచ్చు కున్నా డనుకోండి షాపతను; కాని మంచిపనివాడి తనం కూడా వుంది. ఇక పరుపులు రెండున్నూ. నలభై ఆరు పై చిల్లర అయాయి ఆ రెండూ, దిండ్లు రెండున్నూ" అని వేంకటాచలం బదులు చెప్పడమూ చల్లగా వినపడ్డాయి.

వెంటనే కౌగిలి విడిపించుకుని, వొక్కదూకున మంచం మీదికి వెళ్ళి వాలి "ఎంత మెత్తగా వుందో పరుపుః" అంటూ కిలకిల్లాడింది జోగమ్మ.

"అవును సుమా" అంటూ వెళ్ళి చలపతి పరుపు తాకాడు.

వెంటనే మెడపట్టుకుని అతని మొగం తన మొగం మీదికి తీసుకుంది జోగమ్మ.

నాలుగు పెదవులూ ప్రీతి నెరుపుకున్నాయి.

ఆ మహాపుణ్యకాలాన రంయి మని వచ్చి, గోదావరి గాలి, గులాబీ పువ్వుల పరిమళం తీసుకువచ్చి వారిని పరవశులను చేసింది.

కాని, మబ్బులేని పిడుగు లాగ, దానివెనకనే "తమ్ముడూ, వొకమాటిలా రావాలి" అంటూ కఠోరాహ్వానం కూడా వచ్చింది పడిమటింటోనుంచి.

జోగమ్మ కడుపులో రాయి పడ్డట్టయుంది. అయినా, వెంటనే తేరుకుని "వెళ్ళకండీ, వెళ్ళకండీ" అంటూ చేతులు గట్టిగానే బిగించిం దామె; గాని ఆ పట్టు బలవంతాన విడిపించుకుని చలపతి యెగిరి చక్కాపోయాడు దూది పింజెలాగ.

దెబ్బతిన్న ఆడతాచు లాగ నిప్పులు కక్కుతూ లేచివచ్చి, జోగమ్మ తనకేసి సామర్షకరుణం చూడగా "చూశారా" అన్నట్టు పూర్ణమ్మ వేంకటాచలం కేసి చూసింది.

ఇదంతా కనిపెడుతూనే వున్నాడు జగ్గయ్య. వియ్యంకుడు తనకేసి చూస్తూవుండడమూ, ఆ చూపుల్లో తీవ్రమైన అసంతృప్తి వుండడమున్నూ గమనిస్తూనే వున్నాడతను. అతనిచేత యేదో అనిపించుకోడం యిష్టంలేే దతనికి. తనకీ చాలా కోపం వచ్చింది మరి. "ఇప్పు డేం పనేః వాడెందుకు నాతో చెప్ప రాదుటేః" అంటూ వొక్క వురుమురిమా డతను, వంటింటి కేసి చూస్తూ; కాని

అప్పటి కప్పుడే ముందు బుచ్చమ్మా, గుడికి మేకపోతులాగ ఆమె వెనక చలపతీ వంటింటి పెరట్లోకి నూతిసమీపానికి వెళ్ళిపోయారు.

"ఇప్పుడే చూశాను ఉప్పుయిపోయింది, పట్టుకు రావాలి" అంది, వెనక్కి తిరుగుతూనే బుచ్చమ్మ.

మాట్లాడలేక పోయాడు చలపతి, చెయ్యి మాత్రం చాపాడు.

ఆ చేతిలో పడెయ్యడాని కొక అణాకాసు ఎత్తిపట్టుకుని "వాళ్ళు రమ్మంటే, వెనకా ముందూ చూసుకోకుండా కూడా చక్కాపోతావా?" అని ముందు గదిమే "అయితే, యేమేం కొన్నారేమిటి?" అని తరవాతే అడిగింది లాలనగా.

16

"వాళ్ళు బయలుదేరేదాకా యెందు కూరుకోవాలి?" అనుకుని మర్నాడు పొద్దున్న ముందే మేలుకుంది బుచ్చమ్మ. దీనికి సాయం, ఆవేళ లేచినంత తొందరగా యెప్పుడూ లేవ లేదు చలపతి.

దంత ధావనాదికం పూర్తిచేసుకుని అతను షర్టు తొడుక్కుంటూ వుండగా జోగమ్మకి మెళుకువ వచ్చింది. కూనిరాగం తీసుకుంటూ కోడిగుడ్డు లాంపు వెలుగులోనే అద్దం యెదుట నుంచుని అతను బొత్తాములు పెట్టుకుంటు న్నాడు. "ఎక్కడికో పంపుతోంది భామ" అనుకుందామె, అది చూసి. అటు కోపమూ, ఇటు ఆత్రమూ ముప్పిరి కాగా వురికివెళ్ళి, రెండు రెక్కలూ పట్టు కుని అతణ్ణి తనవైపు తిప్పుకుని "ఏమిటీ సడసం?" అన్నట్టు చురుగ్గా చూసిం దామె, వెంటనే.

ఉలకలేదు పలకలేదు "మీరంతా వో—ట్టి నిద్రమొగా" లన్నట్టు మొదట చిరునవ్వు నవ్వుతూ చూశా డతను. తరవాత, ఆమె ధోరణి గుర్తించి "చూసుకో నేను లేచి అప్పుడే గంటయింది. ఇక మీరు బయలుదేరడమూ, పత్రకులు కొట్లు తెరవడమూ మాత్రమే తరవాయి" అంటూ కనుబొమ్మలూ తల యెగర వేసుకున్నా డతను.

"వోస్, ఇంతే కదా?" అంటూ స్థిమితపడి జోగమ్మ పెరట్లోకి వెళ్ళి పోయింది. ఆమెని చూసి పూర్ణమ్మా, పూర్ణమ్మని చూసి వేంకటాచలమూ, వాకట్లో వీరి సందడి విని గాదె సావట్లో జగ్గయ్యా లేచారు.

వీరినందరినిచూసే పొడుపు కొండమీదికి వచ్చాడు సూర్యుడు.

"దొంగలు పడ్డ ఆరుమాసాలకు కుక్కలు మొరిగాయన్నట్టు, ఆ తర వాత, సావకాశంగా ఆరుకొట్టింది పక్కింటి గడియారం.

చలపతి మనస్సు ఆగిపోయింది.

"పిల్చింకా ఎప్పటికి తేలనూ? అని చిరాకుపడుతూ మొదట రెండుమూడు నిమిషాలసేపు వాకట్లో తచ్చాడా డతను.

అంతలో జ్ఞాపకం వచ్చి పెళ్ళామో మామగారో "సంయే" అనీ అనడం తోనే పిలిచేద్దా మని వచ్చేపోయే జట్కాలలో కాళీగా వున్నవి చూడ్డానికి వీధి లోకి వెళ్ళి అరుగు చివర కూచున్నాడు.

అత నలా కూచున్నాడు, అంతే. ఇలా వచ్చి బుచ్చమ్మ గుమ్మాన నుంచుంది, అప్పుడే.

దూరాన వొక కాళీజట్కా కనబడింది. సమీపించింది. వచ్చింది. వెళ్ళిన్నీపోయింది. అత నది గమనించలేదు, అందుకోసమే కూచుని వుండిన్నీ. అతని చూపు బుచ్చమ్మ మొగం మీదే వుంది. అతని శ్రద్ధ అంతా ఆమె చూపులమీదే వుంది.

చూసిచూసి "ఇలా రా" అన్నట్టామె కళ్లు చికిలించుకుని బయలుదేరింది. మంత్రముగ్ధు డన్నట్టత నామె వెనకాలే నూతిపెరట్లో దొడ్డిగుమ్మం దాకా వెళ్ళాడు.

ఇలాగా అలాగా వొకమాటు పరకాయించి, బుచ్చమ్మ రెం డణాకాసు లెత్తిపట్టుకుంది.

వెంటనే అతని కుడిచెయ్యి ముందుకు సాగింది.

"ఈ రెండణాలూ పుచ్చుకో. కాఫీహొటలుకి వెళ్ళి పెసరట్టూ వుప్మాతిని కాఫీ తాగు. చల్లగా ధవళేశ్వరం వెళ్ళి చక్కారా. జట్కాకి రానూపోనూ రెండణా లెందుకూ ఖర్చుపెట్టడం, తిన్నది జీర్ణం కూడా అవుతుంది. దర్జాగా నడిచివెళ్ళి నడిచే వచ్చెయ్యి" అంటూ ఆ రెండణాలూ అతని చేతిలో విడిచి పెట్టిం దామె.

"బజారుకి వెళ్ళవద్దూ?" అనడిగా డతను, బిక్కమొగం వేసుకుని; గుప్పిడి మాత్రం గట్టిగానే బిగించాడు.

"నువ్వెందుకూ?" అని గదిమిం దామె.

మాట్లాడ లేకపోయా డతను.

"నీ పెళ్ళాం వెడుతోంది చాలదూ దొరసాని లాగ?'

"............"

"దానికి దాని తల్లీతండ్రీ సాయం వున్నారు, నేను లేకుండా నువ్వేం చెయ్యగలవూ వెళ్ళి?"

"............"

"నిన్ను లోకువ చేసేస్తారు రా"

"............"

"సారె అన్నప్పుడు, వాళ్ళు, మనతాహతుకి తగ్గట్టు పట్టుకు రావాలి. సరిగా తెస్తారా, మనం పుచ్చుకుని వూరుకుంటాం. తక్కువ తెస్తే మాత్రం వూరుకోం, అల్లరిచేస్తాం. వాళ్ళు సామాను కొనేటప్పుడు నువ్వు దగ్గిరే వుంటే, పేచీపెట్టడానికి తరవాత నీకు హక్కేం వుంటుందీ?"

"............"

"కాకపోయినా, నీ పెళ్ళాని క్కొంటున్నారు వాళ్ళు, వెనకాలే నువ్వెం దుకురా?"

"డబ్బెక్కువ అయినా, అదీ నేనూ కొనమన్నవే కొంటున్నా రే."

"....కూతురి మాట వింటున్నారు కామోసు, నీ మాట వింటారా యేమిట్రా వెర్రిమొగమా?"

"వింటూ వుంటేనే"

"అయితే వెళ్ళు"

ఇలా అంటూ చేతులు దులుపుకుని వొక్క అడుగు వెనక్కి వేసిం దామె. "నీకర్మం........నా కేం?" అంటూ మూతి బిడాయించుకుని, మొగం కూడా తిప్పేసుకుంది, గుర్రాలక్కలాగ.

అతని కడుపులో రాయిపడింది.

వెడితే యేమిటో, వెళ్ళకపోతే యేమిటో?

పదిరోజుల కిందట అయితే ఆతనికి తటవటాయింపు లేకపోయి వుండును. ఇప్పుడు ద్వంద్వ ప్రభుత్వం వచ్చిపడింది.

బజారుకి వెళ్ళాలని యెంతయినా వుందతనికి. వెడితే తనూ పెళ్ళామూ యిరుకిరుగ్గా బండిలో కూచుని బజార్లో షికార్లు కొట్టవచ్చు, ఇవాళ, మామగారు తాను కోరుకున్న కుర్చీ, దానికి తగ్గ టేబిలూ, వాటికి అనుగుణమైన ఫౌంటెన్ కలమూ కొంటారు. రాసుకునే టప్పుడు కాగితా లెగిరిపోకుండా వొత్తు పెట్టుకో డానికి రెండుమూడు పెద్దగవ్వలు కూడా కొనమని కోరమందా మనుకుంటు న్నాడు. "దాంతో చెబితే అదే కొనిపించేస్తుంది, నోరు విప్పి మనం అడగనే అక్కర్లే" దని కూడా చాలా ధీమాగా వున్నాడు తాను.

మరి, బజారుకి వెళ్ళకపోతే యెలాగా?

అంతా ముజ్జిడ్డుగా కనపడిం దతనికి.

"ధవళేశ్వరం వెళ్ళకపోతేనేం?" అనుకున్నాడొకమాటు: కాని ధైర్యం నిలిచేటట్టు కనపడలే దతనికి.

ఒకరికే సొకరు చూసుకున్నారు.

ఒక్క_క్షణమే చూసుకున్నారు.

ఉత్తరక్షణంలో అతని దుర్బల హృదయం మీద వొక్క_ మెరుపు మెరిసింది.

"సరే" అన్నాడు, దొడ్డితెరుచుకుని సందులో పడ్డాడు.

కాని నాలుగడుగులు వేశాడో లేదో చిటికలు వేసి వెనక్కి_ రప్పించి "పదిగంటలు దాటాకా........తెలిసిందా? ఈలోపుగా నువ్వు రావద్దు. వచ్చినా అల్కట్టుతోటకి అవతలే వుండు, తెలిసిందా? మరి వెళ్ళు" అంటూ తల యెగర వేసుకుంటూ సెలవిచ్చింది, బుచ్చమ్మ.

"సరే" అన్నట్టు తలమాత్రం వూపి కప్పగంతులతో సందు దాటేశా డతను.

17

ఖరాగా యెనిమిదిన్నర అయింది.

"ఈపాటికి అంగళ్ళన్నీ తెరిచేసి వుంటా రిక తొరగా తెమలం డమ్మాయీ" అంటూ జోగమ్మనీ పూర్ణమ్మనీ తొందరపెట్టి "చలపతీ" అని పిలిచాడు వేంకటాచలం.

జవాబు లేదు.

"ఎక్క_డికి వెళ్ళారో సమయానికి" అని చిరాకుపడుతూ కాలుకాలిన పిల్లిలాగ యిల్లంతా వెతికి వచ్చింది జోగమ్మ.

ఉండలేక "మీ తమ్ము డేడమ్మా?" అని ప్రాధేయ పూర్వకంగానే అడిగింది పూర్ణమ్మ; కాని బుచ్చమ్మ "నేనే మెరుగుదునూ?" అని సాగతీసు కుంటూ నూతిపెరట్లోకి వెళ్ళి పోయింది.

వేంకటాచలం పూర్ణమ్మ కేసి చూశాడు. జోగమ్మ కేసి చూస్తూ "ఎక్క_డికో పంపేసింది" అంది పూర్ణమ్మ. "సందేహం లేదు, ఆపీనుగు పనేయిది" అంటూ పళ్ళు కొరుక్కుంది జోగమ్మ.

ఉసూరు మంటూ చివరికి ముగ్గురే బయలుదేరారు వారు.

పడమటివసారాలో నక్కి_ ఇదంతా కిటికీల్లోనుంచి కనిపెడుతూనే వుంది బుచ్చమ్మ. బయలుదేర లేక బయలుదేర లేక బయలుదేరుతూ జోగమ్మ తండ్రికేసి చూసిన చూపు తలుచుకుని "కొంగున ముడివేసుకుని తిరుగుదా

మనుకుంటున్నావు కాదూ మా తమ్ముణ్ణి? తొందరపడకు, తిరగుదువు గాని" అనుకుంటూ గర్వపడింది పడమటింటో నుంచుని. వారు గుమ్మం దిగి నాలుగిళ్ళు దాటివుంటా రన్నప్పుడు ధీమాగా వాకట్లోకి వచ్చి, మండువా అంచున నుంచుని, వీధి గుమ్మంకేసి చూస్తూ "ఇహగింజాకు చావండి. మహా బాగా చేశాను కాదూ?" అంటూ వురిమినట్టు రాకాసినవ్వు నవ్వింది విరగబడి.

బండి మెయిన్‌రోడ్డెక్కుతుం దనగా "చలపతి యేదండి బావగారూ?" అనడిగాడు, కూరలసంచితో యెదురు వచ్చి, జగ్గయ్య.

మామగారిని చూసి యేడుపు మొగం పెట్టుకుంది జోగమ్మ, పుడుకు మోత్తనం వచ్చి.

అందుకే జగ్గయ్య కుతకుతలాడి పోసాగాడు.

"ఇప్పటిదాకా యింట్లోనే వున్నాడు; కాని తీరా బయటుదేరతా మనగా యెక్కడికో వెళ్ళాడు పాపం. ఏం పనులున్నాయో చెడిపోయేవి, చక్క బెట్టుకోకపోతే యెలాగా?" అన్నాడు వేంకటాచలం గంభీరంగా చూస్తూ.

జోగమ్మ అర్థం చేసుకుంది.

తేరి చూడసాగింది పూర్ణమ్మ.

జగ్గయ్య ఈమాటలు విన్నాడు, అంతే.

పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ యింటిదారి పట్టాడు, బుర్ర వంచుకుని.

బండి కూరలబజారులో వెడుతోంది.

వెనకాల నడుస్తూ వేంకటాచలం జోగమ్మ కేమిటో నచ్చ చెబుతున్నాడు.

మధ్య మధ్య యేమిటేమిటో అంటోంది పూర్ణమ్మ కూడా.

ఎక్కణ్ణుంచి వచ్చాడో, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చలపతి చక్కావచ్చా డీసమయాన. "ఎక్కణ్ణుంచోయ్?" అని వేంకటాచలం కొంచెం చురుగ్గా అడిగేదాకా జోగమ్మా పూర్ణమ్మా కూడా చూడలే దతణ్ణి.

మధ్యమధ్య మొగం వంచుకుంటూ అటూ యిటూ చూడసాగాడు చలపతి, అంతే.

"ఎక్కడికి వెళ్ళా రండీ?" అనడిగింది జోగమ్మ, చుర చుర చూస్తూ.

అప్పు డయినా వచ్చినందుకు సంబరపడలేకపోయిం దామె.

ఉండుండి యెక్కడికో వెళ్ళిపోయినందు కింకా వుక్రోషం తగ్గలేదా మెకి.

"ఎక్కడికయినా నువ్వే వెళ్ళావా, నిన్నెవరయినా పంపారా నాయినా?
అనడిగింది పూర్ణమ్మ, లాలనగా.

"మాట్లాడ రేమండీ?" అని మళ్ళీ అడిగింది జోగమ్మ కొంచెం కరుగ్గానే.

ఎవరికీ బదులుచెప్ప లేదు చలపతి. మునిమునినవ్వులకు మాత్రం వాక అంత ఎక్కువ చేసిపూరుకున్నాడు.

"ఎక్కడికి వెళ్ళాడో వెళ్ళాడు, యెవరు పంపారో పంపారు వూరుకోండిక. వెళ్ళిన పని చక్కగా దక్కబెట్టుకునే వచ్చివుంటా డందుకు సంతోషించండి" అంటూ జోగమ్మనీ పూర్ణమ్మనీ ముందు సముదాయించి "చెప్పివెడితే నన్ను కూడా తీసుకువెళ్ళవలసివస్తుం దని రహస్యంగా వెళ్ళివచ్చావు కాఫీ హోటలుకి, అవునా?" అని తరవాతే చలపతిని ముదలకించాడు వేంకటచలం, కొంటె చూపులు చూస్తూ.

దానికీ బదులు చెప్పలేదు చలపతి.

మొగం వంచేసుకున్నాడు కూడా, సిగ్గుపడి.

దీనిమీద, కాఫీ నోరూరించగా జ్ఞాపకం వచ్చి "నిన్న మరిచిపోయాను. ఇవాళ నాకు కాఫీఫిల్టరు కొనియివ్వకపోతే వొప్పుకోను నాన్నారోయ్" అంటూ గునిసింది జోగమ్మ.

"అవునేవ్ ! నేనూ మరిచిపోయాను చూశావా? ఇవాళ తప్పకుండా కొంటాను సరా; దానికి సాయం, చిన్న యిడ్డెన్ల పాత్ర వుంటుంది ముద్దొస్తూ, అదీ రెండుమూడు జతల పింగాణీ కప్పులూ సాసర్లూ, వాటికి చెంచాలూ కూడా కొంటాను" అది పూర్ణమ్మ.

"అయితే, వెండికప్పులూ సాసర్లూ కొనిపించా వెందుకమ్మా? కాఫీ పోసీ పొయ్యడంతోటే వేడెక్కిపోతా యవి. కాఫీవేడికి నాలుక చుర్రుమనా, కప్పు వేడికి పెదవులు చురుక్కుమనా - యేమి సుఖమూ? కనక, మధ్యాహ్నం తీసుకు వెళ్ళి కాస్త నష్టానికయినా సావుకారికే యిచ్చేస్తేను, బతిమాలి మళ్ళీ. తరవాత మరో రెండు జతలు పింగాణీవే కొనిపెడుతుంది దర్జాగా మీ అమ్మ నీకు" అన్నాడు వేంకటాచలం, చిరునవ్వు అదిమిపెట్టుకుంటూ.

"వల్లకాదండీ" అంది జోగమ్మ, ముందు, తండ్రితో.

"చూశావుటే అమ్మా?" అంటూ తల్లికేసి తిరిగి గారాంకుడిచింది తరువాత.

ఈ సంభాషణ తన హృదయవీణకు శ్రుతి కలపగా "బాబయ్యగారు వూరికే అంటా రం దమ్మాయిగారూ! కూతుళ్ళ కిచ్చిన వస్తువులు తల్లిదండ్రులు

మళ్ళీపుచ్చుకోడం యెక్కడయినా వుందాండి, భూమ్మీద?" అన్నాడు, కొత్త పెళ్ళికొడుకు, బండిమనిషి.

"మరే" అంది జోగమ్మ. "విన్నావా? మాట్టాడవేం? వద్దని నాన్నారితో చెప్పవేం?" అంటూ తల్లి రెక్కమీద పొడిచిం దామె.

"మీమాటలు విని అల్లుడు నవ్వుకుంటున్నాడు తెలుసా?" అనడిగాడు, దానిమీద వేంకటాచలం.

"తప్పేం?" అనడిగింది పూర్ణమ్మ. "నాయనా, నీనవ్వే మాకు పది కోట్లు" అల్లుణ్ణిబుజ్జగించి "రా, కూచో నాయనా" అని అతణ్ణి పిలుస్తూ కొంచెం ముందుకి జరిగింది కూడా ఆమె.

జోగమ్మ కూడా కాస్త జరిగింది కళ్ళతో పిలుస్తూ.

"అయితే, మామగారు నడుస్తూ వుండగా తాను బండెక్కడమా, మానడమా?" అని అతని బుద్ధి చర్చలోపడగా, అతని శరీరం మాత్రం యెగిరి ఆలా బండిలో పడింది.

18

అనుకున్నదీ, కనపడగా బుద్ధిపుట్టినదీ, జ్ఞాపకంరాగా "అవునవు" ననుకున్నదీ సామా నంతా కొనేటప్పటికి పదకొండు కావచ్చింది.

అనుకోనివాటిలో కాఫీసామగ్రి వుంచుకోడానికి జోగమ్మ ముచ్చటపడ్డది చిన్న బీరువా వొకటి.

జోగమ్మా, చలపతీ, పూర్ణమ్మా వొకబండిలో కూచోగా చిల్లర సామానంత తన దగ్గిర పెట్టుకుని వేంకటాచలం మరో బండిలో కూచున్నాడు.

చేవచెక్కల బట్టలబీరువా, చక్కని టేబిలూ, దానికి తగ్గ కుర్చీ, కూలీలు పట్టుకువస్తున్నారు, బళ్ళవెనకనే,

పింగాణీసామానుబుట్ట తన వొడిలో పెట్టుక్కూచుంది జోగ్గమ్మ. మధ్య మధ్య అవి చూసి మురిసిపోతోం దామె, వొక్కొక్కటే పైకి తీసి తిరగా మరగా చూస్తూ. కాఫీ కూడా కమ్మని సువాసనతో జ్ఞాపకంవస్తోం దామెకి.

ఉండుండి జ్ఞాపకం రాగా స్ఫురిత అయి "నువ్విచ్చిన కాఫీ గింజలు వీసెడూ—మాయిద్దరికి రెండుమాసాలు సరిపోతాయే అమ్మా" అంటూ ప్రారంభించింది జోగమ్మ.

"అదేమిటే, నీ మామగారి కివ్వవుటే పాపం?" అనడిగింది పూర్ణమ్మ, చలపతి కేసి చూస్తూ.

"ఏమండి, మీనాన్నారు కాఫీ పుచ్చుకోడం వుందా యెప్పుడైనా?" అంది జోగమ్మ, చలపతినే చూస్తూ.

"ఎప్పు డయినా వుంది. అలవాటు లేదు. నిషేధం అంతకంటే లేదు" అని బదులు చెప్పాడు చలపతి.

"అయితే, మాకు నెల్లాళ్ళు వస్తాయే, మరి"

"మరి, తరువాత?" అన్న ప్రశ్నతోచింది చలపతికి. నాలుక చివరికే వచ్చింది కూడా మాట; కాని, పెదవులడ్డేశాయి.

పూర్ణమ్మ మాత్రం అందుకుంది "నన్నడగడం యెందుకే?" అని ముదల కిస్తూ. "మీసంగతి నాకేం తెలుస్తుంది, నాకెందుకసలు? రెండునెలల్లో కాదు, వొక్క నెలలో కాదు, చివరికి వొక్క వారందినాల్లో కానిచ్చేసుకోండి మాకేం? కాదంటే, మేమిక్కడ వున్నన్నాళ్ళూ మాకోసం ఖర్చయేవి కొని ముదరా యిచ్చేస్తారు మీనాన్నారు నీకు. వొట్టి కాఫీ ఫిల్టరూ అవీ యివ్వకూడదని వీసెడు కాఫీగింజలూ రెండు వీసెల చక్కెరా యిచ్చాం, వాటికోసం మూడు రూపా యలు పైగా అయింది మాటలా?" అని కూడా అడిగింది, కళ్ళు తిప్పు కుంటూనూ, తల యెగరవేసుకుంటూనూ.

"పోనీ, ఆ వీసెడు కాఫీగింజలకు ఆరెండుపీశల చక్కెరా సరిపోతుం దేమో నువ్వే చెప్పు మరి, లెక్కలువేసి"

"చక్కెర అయిపోతే మీ వంటింటో పొయ్యిమీద రెండు బెల్లబ్బుట్ట లుండనే వున్నాయి లోటేం?"

అత్తగారిలా అనగా చలపతి వులిక్కిపడ్డాడు. జోగమ్మ కూడా మాట్టాడ లేకపోయింది మొదట; కాని యాక్కురారీ, బెల్లంకాఫీచే నేను పుచ్చుకోడం?" అనడిగింది మొదట.

"పోనీ, అవి కూడా అయిపోయాకా? అనడిగింది చివరికి.

"ఏమో, మీరేంచేసుకుంటారో చేసుకోండి. నాకు తెలియదు నన్నడక్కు" అంటూ బుంగమూతి పెట్టుకుని మొగం పక్కకి తిప్పుకుంది పూర్ణమ్మ.

"కానిపెట్టకపోతే మానె, ఉపాయం చెప్పడాని కేమే అమ్మా" అని మళ్ళీ అడిగింది జోగమ్మ.

దానికి బదులు చెప్పలేదు పూర్ణమ్మ. ఇటుస్నూ చూడలేదు.

"పోనీ, వొక పనిచేస్తానే" అంటూ జోగమ్మే అందుకుంది, చూసిచూసి.

"తెల్లగానే వుంటుంది కనక, తొమ్మిది కానులు పెడితే రెండు శేర్లు కూడా వస్తుంది కనక, మెత్తగా కొట్టుకుని యింత వుప్పు వేసుకుంటామే, ఏమే అమ్మా" అనిన్నీ అడిగిం దామె, కొంటెచూపులు చూస్తూ.

వకాలు మని విరగబడి నవ్వుకున్నారు, ముగ్గురూ.

బళ్ళప్పటికి వైర్రాగాంరోడ్డు మొగకి వచ్చాయి.

"తప్పుకో, తప్పుకో" అంటూ వొక కావటివాణ్ణి అదలిస్తున్నాడు బండి మనిషి.

"ఆనవ్వెందుకు చెప్పా?" అనుకుంటున్నాడు వేంకటాచలం తొంగిచూస్తూ.

ఈ సమయాన—అదేమండీ? దిగుతా రేమండీ?" అని జోగమ్మ అడుగుతూనే వుండగా, బదులు చెప్పకుండా గభీమని కింది కురికి, నాళంవారి సత్రం కేసి లఘువులు వేశాడు, చలపతి.

19

వివరాలు చెబుతూ, పూర్ణమ్మ, సామానంతా చూపించగా పరమానంద భరితు డయిపోయాడు జగ్గయ్య.

తరవాత జోగమ్మ అందుకుంది.

ఒక్కొక్కటే కాఫీపరికరాలు తెచ్చి యెదట వుంచి, వాటికోసం కొన్న చిన్న బీరువా కూడా చేతికందేటట్టొక పక్కగా నిలవబెట్టి, ఫిల్లరు ఏభాగాని కాభాగం విడమర్చి బోధిస్తూ చూపించి, చివరికి "మనయింట్లో పదకొండుదాకా భోజనాలు కావు కనక పొద్దున్నా, తరవాత రాత్రి చీకటిపడేదాకా వుండడం కష్టం కనక మధ్యాహ్నం మూడుగంటలవేళా కాఫీచేస్తూ వుంటాన్నేను. రెండు పూట్లా మీరు కూడా పుచ్చుకోవాలి మామయ్యగారూ! మీరు కనక, పుచ్చుకోక పోతే నేనూ మీఅబ్బాయీ కూడా మానేస్తాం సుమండీ?" అని చాలా చనువుగా చెప్పింది, తండ్రితో చెప్పినట్టు.

మరీ పొంగిపోయాడు జగ్గయ్య, దీనికి.

"అలాగే పుచ్చుకుంటాను తల్లీ" అన్నాడు ముందతను చాలాప్రేమగా. "మీరేమీ మానుకోవద్దు" అన్నాడు, తరవాత. "నీచేత్తో పచ్చిమంచినీళ్ళే యిచ్చినా అవే కాఫీ అని సంతోషిస్తాను గదా నేను, మరి, కాఫీయే ఇస్తే ఎంత సంతోషిస్తానో వేరే చెప్పాలా? కాఫీ పుచ్చుకోక మనకేమమ్మా? కొత్తది సంపాదించకపోయినా వున్నది వుంచి నాకప్ప చెప్పారు మానాయనగారు. నేనూ సంపాదించలేదు కొత్తది. అయితే, పాతదీ పాడుచెయ్యలేదు. మానాయన నాకిచ్చింది నేను చలపతి కిస్తున్నాను. ఇది వృద్ధిచేసుకుంటూ ఇప్పుడు చక్కగా అనుభవించవలసినవాళ్ళు మీరు. ఇక నేనా? మీ అభ్యుదయం చూసుకోవలసిన వాణ్ణి. మీ సుఖమూ మీ ఆనందమూ చూసుకోవలసినవాణ్ణి. మీ చేతిలో వెళ్ళిపో వలసినవాణ్ణి. ఇది గుర్తించి నువ్వు నన్నితంగా సుఖపెడతానంటే అంతకంటే

కావలసిందేమిటమ్మా నాకు - నా అదృష్టంకొద్దీ దొరికావు నువ్వు నాకు. మీనాన్నా రొకటి నేనొకటి కాదమ్మా నీకు" అంటూ ఆసామా నొక్కొక్కటే పుచ్చుకుని చూసి మెల్లిగా వుంచి "జాగ్రత్త చేసుకోమ్మా" అంటూ తన ప్రీతి అంతా వెల్లడించాడు చివరికి.

ఇవి విని జోగమ్మ అదృష్టానికీ, జగ్గయ్య నిండు హృదయానికీ పూర్ణమ్మా వేంకటాచలమూ చాలా ఆనందించారు.

ఈ సమయాన మెల్లిగా యింటికి వచ్చాడు చలపతి, నాళం వారి సత్రం తిరగవేసుకుని.

"ఏంనాయనా, బజారుకి వెళ్ళలేదూ?" అనడిగాడు జగ్గయ్య.

"ధవళేశ్వరం వెళ్ళాను నాన్నా"

జోగమ్మా, పూర్ణమ్మా, వేంకటచలమూ మొగమొగాలు చూసుకున్నారులిక్కిపడి.

"పనేమిటి నాయనా?" అనడిగాడు జగ్గయ్య.

చలపతి బదులు చెప్పలేదు.

"నీకు నువ్వే వెళ్ళావా?"

దీనికీ బదులు చెప్పలేదతను

"పోనీ, ఎవరు పంపారూ?"

"అక్కయ్య"

జోగమ్మా, పూర్ణమ్మా, వేంకటాచలమూ మళ్ళీ చూసుకున్నారు "మనం అనుకున్నదే కాదూ?" అనుకుంటూ.

"ఏమి చెయ్యమంది వెళ్ళి, అక్కయ్య?" అని మళ్ళీ అడిగాడు జగ్గయ్య.

చలపతి దిక్కులు చూడసాగాడు. అది గుర్తించి గభీమని అందుకుని వేంకటాచలం "సంసారం అన్న తరవాత లక్షపనులుంటాయి, వివరాలెందుకు బావగారూ?" అన్నాడు, సద్దుబాటు చేస్తూ.

కాని "నేనింట్లోనే వున్నాను గదా, వెళ్ళాటప్పుడు నాతో యెందుకు చెప్పావు కాదూ?" అని మళ్ళీ అడిగాడు జగ్గయ్య.

గభీమని అందుకుని "బుచ్చమ్మా మీరు కూడా సమానమే కదా బావగారూ, చలపతికి?" అని మళ్ళీ సద్ది చెప్పాడు.

పడమటింట్లో, తలుపుచాటున నక్కి వున్న బుచ్చమ్మ, ఇదంతా విని కొట్టినంత బాధపడి వెళ్ళి వంటింటి పెరట్లో కూలబడింది "మతిపోయింది ముసలాడికి" అనుకుంటూ.

20

"మీ అమ్మా మీ నాన్నారూ వెళ్ళారా వున్నారా చెల్లాయీ?"

నూతిపళ్ళెంలో వెండికంచం కడుగుతూ వుండగా యీమాట వినపడింది; కాని యెటుచూసినా యెవరూ కనపడలేదు, జోగమ్మకి.

"ఇక్కడున్నాన్నేను" అంటూ మళ్ళీ వచ్చింది మాట.

పక్కని వున్న డాబాకేసి చూసింది; కాని దానిమీదా యెవరూ కనపడ లేదు.

"ఇక్కడమ్మా వెర్రితల్లీ"

వెనక్కి తిరిగి చూడగా, గోడఅవతల. కరివేపచెట్టు కొమ్మల్లో నక్కి వుండి మాట్లాడుతోంది సోదెమ్మ.

ఆమె కనపడగానే మొగం యింతయింది జోగమ్మకి.

"ఇంకా వెళ్ళలేదండీ, బజారునుంచి వచ్చాము, భోజనం చేశామిప్పుడే"

"ఇవ్వదలుచుకున్న సామానంతా కొనడం అయిందా?"

"అయింది, వచ్చి చూడరూ అక్కయ్యగారూ?"

"ఇంతకంటేనా అమ్మా? అయితే, నువ్వు రమ్మన్నప్పుడు వస్తాను"

"ఇది కాదూ రమ్మనడం?"

"ఇలా కాదు చెల్లీ"

"మరెలాగ అక్కయ్యగారూ?"

సోదెమ్మ చెప్పలేదు; కాని అంతా బోధపడింది జోగమ్మకి.

"ఈ జన్మలో నాకంత అదృష్టం పడుతుందా అక్కయ్యగారూ?" అనడిగిందామె.

"అదేమి తల్లీ, అలా బేలపోతావూ ఇదంతా నీదే కాదూ? తక్కినవాళ్ళు గుప్పెడు మెతుకులుకోసం చేరిన వాళ్ళే కాదూ?"

"ఇప్పుడు నేనే అనా వున్నానండీ"

"తప్పు తప్పు, అలా అనుకోకమ్మా"

వంటింట్లో యేదో చప్పుడయింది.

"ఉపాయం చెప్పరూ అక్కయ్యగారూ?" అనడగింది జోగమ్మ. దానికి జవాబు రాలేదు. చూడగా సోదెమ్మ కనపడలేదు. కరివేపచెట్టు మాత్రం వూగి పోతోంది.

21

"ఇంకో రెండేళ్ళుపోతే నీయింటిపేరయినా పైకి రానియ్యదు. పెళ్ళయి

ఆరుమాసాలయినా తిరక్కుండా ఇల్లుపట్టింది, తన యిల్లని చెబుతోంది భామ, నడివీధిలో నుంచుని"

"ఇందుకే కామోసునే సోదెమ్మ అక్కయ్యగా రలా అన్నారు?"

"అందంటే అనదూ ఆవిడ? దీని గుణాలు మొదణ్ణుంచీ యెరగనివా మనకంటే కొత్తగానీ? నీమామగా రేమనుకుంటారో అని చూస్తున్నాను. లేకపోతే- వొక్క క్షణంలో దిగ్గుంజెయ్యనూ రాకాసిని?"

"ఏమి" టనడిగాడు వేంకటాచలం.

"ఎవరో ముసీలి పరదేశి బ్రహ్మ డడగ్గా, బుచ్చమ్మ ఈ యిల్లు తన దన్నట్టు చెప్పింది. "కందుకూరివారి దనకపోడం యేమీ?" "అంటుందమ్మాయి"

"ఆమాట నేనూ విన్నాను. "మాది" అంటే బాధ లేకపోవును "నాది" అంది, వెన్ను విరుచుకుంటూ, అయితే మన బంగారమే మంచిది కాదు'

"అతనికి చేతకాకపోతే అమ్మాయి చేసుకుంటుంది పెత్తనం, మధ్య యీభూతం యెవరండీ?"

"కొంచెం వోపిక పట్టాలి. వీలుకానప్పుడు పడివుండాలి"

"ఎన్నాళ్ళు?"

"వో — హో — హో, చలపతికి జ్ఞానం వచ్చేదాకాను, చెప్పడం యెందుకూ?"

"సముద్రంలో కెరటాలు తగ్గడమూ, చలపతికి—"

"నాకంత నిరాశలేదు"

"ఇక నేను లేననుకోండి నాన్నారూ"

ఇలా అంటూ తల్లిమీదికి వాలిపోయింది జోగమ్మ.

ఆది చూశాటప్పటికి వేంకటాచలం కళ్ళు చెమ్మగిల్లాయి.

పూర్ణమ్మ కూడా అలాగే అయింది; కాని కూతురు తన పొదిగిట వుండడంవల్ల బాధ్యతగుర్తించి "నీకేం తల్లీ? ఆ మనోవర్తిమనిషి నిన్నేం చెయ్యగలదమ్మా?" అంటూ వోదార్చి "ఇంకో పదిహేనురోజులు సెలవు పొడిగించుకోండి. అ రెండువారాలూ కూడా చూసి అమ్మాయినీ అల్లుణ్ణీ మన యింటికే తీసుకువెడదాం వీలులేపోతే" అంది, వేంకటాచలంతో.

"అది రానిస్తుందిటే అమ్మా?"

"అవునేవ్? మీరే మంటా రండీ?"

"రానిస్తుందే అనుకో. అతను మన యింటికి వస్తే యిక్కడ యేది యేమయి పోతుందో—"

"అదీ నిజమే, గండక త్తెర వచ్చి పడిందండీ, మనకి"

"సరే, ముందు సెలవుమాట చూసుకుని వస్తాను. తరవాత అట్నుంచి వరుక్కువద్దాం"

ఇలా చెప్పి, సూపర్నెంటు ఆఫీసుకి బయలుదేరాడు వేంకటాచలం.

22

"ముందుముందింత కంటే సయ్యోధ్య లుండి యేడుస్తాయా యేమిటి? ఏమయినా సరే- వోమాటు సోదెమ్మగారి యింటికి వెళ్ళి వస్తానే అమ్మాయీ"

జోగమ్మ నిలువుటద్దం యెదట నుంచుని వుండగా, ఆమె జడకి మీదుగా గులాబీబంతి సద్దుతూ ఇలా అంది పూర్ణమ్మ.

"నేనూ రావద్దూ?"

"కళ్ళల్లో నిప్పులు పోసుకోదూ?"

"ఎ-లాగే మరీ—?"

ఇలా గునుస్తూ యెదటికి తిరిగి తల్లి జబ్బలు పట్టుకుని వేళ్ళాడింది జోగమ్మ.

"ముందొకమాటు నన్ను వెళ్ళి రానియ్యి?"

"పోనీ. రేపు తీసుకువెడతావా నన్ను?"

ఈ సమయాన గుమ్మంలోకి వచ్చి "అమ్మాయీ, వంటిల్లు సవరించాలిట కాస్త చూడమ్మా" అని చెప్పి చక్కాపోయాడు జగ్గయ్య.

ఉత్కటానందంతో తల్లీ కూతురూ వొక్క క్షణం మాట్టాడలేక పోయారు.

"బతికాం" అంది జోగమ్మ, వొక్క క్షణానికి

"నువ్వు కూచో నేను సవరిస్తా నదంతా" అంటూ పూర్ణమ్మ బయలు దేరింది.

జోగమ్మ మళ్ళీ నిలువుటద్దం కేసి తిరిగింది.

రేగిన కనుబొమలు సవరించుకుని, లోలకుల సీమకమలాల జిగజిగ లతో ధగధగలాడుతున్న ఆబుగ్గ వొకమాటూ యీబుగ్గ వొకమాటూ చూసుకునే టప్పటి కామె కేదో వూహ తట్టింది.

చిటికెలు వేసుకుంటూ వెంటనే ముందు పడమటింటోకి, అక్కణ్నుంచి పెరట్టోకి వురికి, సరిహద్దుగోడ దగ్గిరగా నుంచుని "అక్కయ్యగారూ" అని పిలిచింది కంఠం నొక్కుకుంటూ.

బదులు రాలేదు.

కాని; అవతల బిందెలో చెంబుముంచిన చప్పుడు.

"అభూతానికి వినపడుతుందేమోనే" అంది పూర్ణమ్మ.

"ఎక్కడో—ఫర్లాంగుదూరాన వీధిగదిలో వుంది, వినపడదే!........ అక్కయ్యగారూ!"

అప్పుడూ బదులు లేదు.

"పని పూర్తిచేసుకుని వాకట్లోకి వెళ్ళిపోయారేమోనే అమ్మడూ"

"వెళ్ళిపోలే దింకా వంటింటోనే వున్నా రమ్మా!........ సోదెమ్మక్కయ్యగారూ!"

"చెల్లీ!"

"ఆ"

"పిలిచావా? అమ్మా?"

"అవునండి"

"ఏమమ్మా?

"ఏం చేస్తున్నారూ?"

"ఇక వాకట్లోకి వెళ్ళిపోదా మనుకుంటున్నాను. పిలిచావు నువ్వు"

"మూణ్ణాళ్ళ పండుగు వచ్చిందండీ నాకు"

"వచ్చిందా తల్లీ! వెయ్యిమంది దేవుళ్ళకు మొక్కుకుంటున్నా నేను, మీ అమ్మా నాన్నా వుండగా ఇలా జరగాలని. పిన్నిగా రేం చేస్తున్నారూ?"

"ఇక్కడే వుందండీ, తరువాత ఏం జరిగినా సరే అని మా అమ్మ మీ ఇంటికి రావా లనుకుంటూ వుండగా ఇల్లు సవరించా లని చెప్పారు మామగారు వచ్చి."

"వెర్రిబ్రాహ్మడు. మాయామర్మమూ యెరగడు పాపం. సత్యరుషి అంచేతనే ఆడుతోం దాట........పిన్నిగారూ!"

"వింటున్నా" నంది పూర్ణమ్మ.

"నూతిపెరట్లోకి రండి."

"వస్తున్నా........తల్లీ, వంటిల్లు నువ్వు సద్దుకో."

ఇలా అంటూ ఎక్కడ పని అక్కడ విడిచిపెట్టేసి పూర్ణమ్మ వెళ్ళిపోగా "ఇంటో వుండకుండా ఎక్కడికి పంపిందో! ఈ మూడు రోజులూ కంటపడనివ్వను" అనుకుంటూ, జోగమ్మ వంటింటి పని అందుకునే టప్పటికి "ఎక్కడికి రా యిట్టిట్టే వెడుతూ వుంటావూ? కుదురు నేర్చుకో నాయినా యీ పాటికి"అని వాకట్లోనుంచి జగ్గయ్య మాట వినవచ్చింది.

23

గదిలో కూచోపెట్టుకుని ఫలహారం చేయిస్తూ, తాను కూడా చేస్తూ, జోగమ్మ, చలపతికి జ్ఞానస్నానం చేయిస్తూ వుండగా, జగ్గయ్యకీ వేంకటాచలానికీ వంటింటి వసారాలో వడ్డించింది పూర్ణమ్మ.

అది చూశాటప్పటికి ప్రాణాలు లేచిరాగా "ఇదేమిటండోయి బావగారూ, మీకూ మేము చెయ్యవలసిన మర్యాదలు మా యింటో మీరే మాకు మొదలు పెట్టారేమిటండోయ్?" అనడుగుతూనే జగ్గయ్య వాక పళ్లెం దగ్గిర కూచున్నాడు.

"మా ఇంటోనూ మీ ఇంటోనూ కూడా మేమే చెయ్యాలి మీకు. ఆడపిల్లని కనుక్కున్నవాళ్ళం కాదుటండీ మేము?" అని బదులు చెప్పాడు దానికి వేంకటాచలం.

"నీ కూతురి వాలకం యేమయినా బోధపడుతోందా నీకు?" అన్న ప్రశ్న స్ఫురించిం దిందులో జగ్గయ్యకి.

మూడో మనిషితో సహవాసం తటస్థపడలేదు, తమ కింతవరకూ.

కోడలు కాపరానికి వచ్చేదాకా "సద్దుకోడం" ఆవశ్యకమే రాలేదు తమకి.

రుచిభేదమూ, భావవైవిధ్యమూ, భిన్నదృక్పథమూ, ప్రత్యేక వ్యక్తిత్వమూ, విభిన్న సంప్రదాయమూ — ఇన్నింటితో సంఘర్షణ ఏర్పడింది తమ కిప్పుడు.

"సామరస్యం" అనే సంగతి ఇప్పుడే ఆలోచించవలసి వచ్చిం దతని కిన్నాళ్ళకి.

ఇరవై దినాలుగా ఆ కుటుంబం ధోరణి చూస్తున్నాడు తాను.

మరి, ఆ సంస్కారం కనపడుతోందా తన కుటుంబంలో?

కోరి తనతో బంధుత్వం చేసుకున్నవారు పర్వతశిఖరాన వుండడమూ తాము లోయలో వుండడమూ బాగా అవగాహన అయింది అతనికి, దీంతో.

దీనికే అతను సిగ్గుపడవలసివుండగా "మా అదృష్టం అంతా మీదయా దాక్షిణ్యాలనుపట్టివుంది మరి" అని కూడా అన్నాడు వేంకటాచలం.

"అదేమిటి చాలా కొత్తమాటలు సెలవిస్తున్నారు మీరు. మీ అనుగ్రహమే కావాలి మాకు. చలపతి భారం అంతా మీమీద వుంది"

"మీరు చల్లగానే వుండగా అది మేము అందుకోడం ధర్మమా? మీ రిలా సెలవిప్పించవచ్చా?"

"నా ధోరణి మీరు గుర్తించే వుంటారు. నా పక్షంగా చూస్తే నేనన్న దే ధర్మం"

"మీకంటే చాలా చిన్న వాణ్ణి నేను"

"వయస్సులో చాలా పెద్దేనేను. మరి, తక్కిన సంగతులు"

"........................"

"వ్యవహారం యింతవరకూ వచ్చాక యిక లౌక్యాలు చూపించడం శ్రేయస్కరం కాదు. నాకు వ్యవహారజ్ఞానం లేశమూ లేదు. మీ వియ్యపురా లయినా నాలాగే శుద్ధ అమాయికురాలు. మాయిద్దరిలో యెవరు కాస్త శ్రద్ధ పట్టినా మాఆస్తి యింతకి రెట్టింపయి వుండకపోవునా? మీరు బాగా చదువు కున్నవారు. అన్నీ తెలిసినవారు. అంతా చేతనయినవారు. ఒక బాధ్యత స్తుతి పాత్రంగా నిర్వహించుకుంటున్నవారు. ఇక్కడి బాధ్యత కూడా మీమీదే వుంది. అంచేతే నేనిలా అంటున్నాను"

"చలపతి మీకు కుమారుడూ మాకు అల్లుడున్నూ. పైగా, చిట్టితల్లి తప్ప మాకు కడుపున పుట్టినవాళ్ళు మరెవరూ లేరు. ఆమె అభ్యుదయమే మాకు తారకం. అది సంపాదించుకోవాలంటే మా అమ్మాయికంటే చలపతే మా కెక్కువ. అతనికి శ్రేయస్సు కలగా లంటే మీతో బాటు మేమున్నా –"

"అదే నేను మనవిచేసేది. నేను చెయ్యలేని పని మీరు చెయ్యాలిక్కడ"

ఈ మాటమీద అందుకుని "ఈకాలపు మొగపిల్లల కొకళ్ళు చెప్పవలసిన పనే లేదు. ఆపైని, ఏమీ దిగడి పోకుండా అన్నివిధాలా మీ అమ్మాయి దిద్దు తూనే వుంది చలపతిని" అంటూ సన్నాయి నొక్కులు నొక్కి భర్తకి కన్నుగీ టింది పూర్ణమ్మ.

"అవు నవు" నన్నాడు, వేంకటాచలం, అది గుర్తించి. ఉలిక్కి పడ్డాడు జగ్గయ్య.

జోగమ్మ వచ్చినప్పణ్ణుంచీ బుచ్చమ్మ చేస్తున్న కుట్ర అంతా కాకపోతే కొంతయినా తెలుస్తూనే వుంది; కాని కజ్జా అంటే వెనక్కితీసే వేంకటాచలమే యిలా అనడంతో అది దుర్భరమే అయివుంటుం దని తోచిం దతనికి. దాంతో మొగం చిన్నపుచ్చుకున్నా డతను.

ఇది గ్రహించి ప్రసంగం మార్చడానికి చూశాడు వేంకటాచలం; కాని పూర్ణమ్మ అది సాగనియ్యలేదు.

"ఇంతకీ, - పాపం బుచ్చమ్మకి మాత్రం యింకెవరున్నారు గనకా? చలపతి బాగుపడ్డంకంటే మరోకోరిక యేమి వుంటుందామెకి? మా అమ్మాయి

కత్తగారయినా ఆడబడుచయినా - చలపతికిన్నీ తల్లి అయినా, అక్క అయినా సర్వమూ -"

కాఫీ పుచ్చుకుంటున్న జగ్గయ్య, గ్లాసు చేత్తో పట్టుకుని మాట కడ్డం వచ్చి "అక్కయ్యగారూ, మీరనవలసినమాటే అన్నారు మీరు; కాని చల్లకి వచ్చి ముంత దాచడం నావల్లకాదు. బావగారూ, మీరు బాగా వినండి. ఇక్కడి గొడవలు నాకు బొత్తిగా తెలియకపోలేదు. నేను ఆందోళనపడకపోనూ లేదు. అయితే, నిజానికి మీకిదంతా పూర్తిగా తెలుసు. మీ అమ్మాయేకాదు, మీరున్నూ అనుభవిస్తున్నారిదంతా. కనక, నా బాధకంటే మీబాధ యెక్కువది. ఇది సవరణ చెయ్యడం నావల్ల కాదు. నాప్రవృత్తే అలాంటిది కాదసలు. కాక, - మాటమీద మాట వస్తూనే వుంటుంది. కనక, వాగ్వాదం వద్దు. నామాట వినండి. వెంటనే మీరీవూరు బదిలీ చేయించుకోండి" అన్నాడు, దృఢస్వరంతో.

వేంకటాచలం "యిదంతా నీమాట మహిమ" అన్నట్టు చూడగా "వొప్పుకోండి" అన్నభావం పూర్ణమ్మచూపుల్లో వేంకటాచలాని క్కనబడింది.

"మీరు వినోదంకోసం యిలా అంటున్నారని కాదు; కానీ,—మీ అమ్మాయితో — "

"అవసరంలే" దన్నాడు జగ్గయ్య, కచ్చితంగా.

"మీరు నేను చెప్పినట్టు చేస్తే, మీరు మీ యేక పుత్రికను విడిచిపెట్టకుండా వుండినవారూ అవుతారు. చలపతిని బాగుచేసినవారూ అవుతారు" అన్నాడు జగ్గయ్య.

"తప్ప దారి, చిక్కు లేమయినా — "

"మనం ద్వంద్వాతీతులం కాము, నాక్కావలసింది నాకొడుకు బాగుపడడమూ, నావంశం వృద్ధికావడమూ—ఇంతే. కనక, మీరు తప్పకుండా—వెంటనే బదిలీ చేయించుకోండి"

ఎటూ చెప్పలేక ఆలోచనలో పడ్డాడు వేంకటాచలం.

"ఊఁ అనండి" అన్నాడు జగ్గయ్య, వొత్తి.

"మీ సెలవు"

"మీ సెలవా, మీవిధాః ఇది నేను వివరించి చెప్పలేను"

"అయితే, తప్పకుండా బదిలీచేయించుకుంటాను"

"చాలా సంతోషం, మీదయవల్ల నాకిప్పటి కొక బెంగతీరింది" అన్నాడు జగ్గయ్య.

తరవాత పూర్ణమ్మకి కూడా కొన్ని సంగతులు చెప్పి వాకట్లోకి బయలుదేరా డతను.

కూతురు సిద్ధంచేసి వుంచిన తాంబూలం జగ్గయ్య కిచ్చి తానున్నూ వేసుకుని, "వెళ్ళండి, వెళ్ళండి" అని తొందర పెడుతూ, పూర్ణమ్మ తెచ్చి యిచ్చిన కోటు తొడుక్కునీ, పాగా పెట్టుకునీ సూపర్నెంటు ఆఫీసుకి వెళ్ళి పోయాడు వేంకటాచలం, వుపాయం ఆలోచించుకుంటూ.

"ఇప్పటి కొక్క బెంగతీరిందా? ఇంకా ఆ వుండిపోయిన బెంగ లేమిటి చెప్మా?" అనుకుంటూ నిమిషంలో స్థలశుద్ధి చేసేసి, ఈ సంగతి జోగమ్మతో చెబుదామని తూనీగలాగ బయలుదేరింది పూర్ణమ్మ.

అప్పటికి, ఇక్కడ గదిలో "కాఫీ తరవాత ఏమిటో?" అంటున్నాడు చలపతి. "తాంబూలం తరవాత ఏమిటో?" అంటోంది జోగమ్మ.

24

ఆవేళా, మర్నాడూ, ఆ మర్నాడూ కూడా, జోగమ్మ వీధి గుమ్మం తొక్కి చూడలేదు.

జగ్గయ్య, ఎప్పుడో — ఎందుకో — ఎక్కడికో వెడతాడు వస్తాడు, అంతే.

ఎప్పుడు చూసినా వాకట్లో పేముకుర్చీలో కూచునో, గుడ్డకుర్చీలో ఏదో ఆలోచించుకుంటూ పడుకునో, వీధి గుమ్మం దగ్గిరనుంచి పడమటింటి గుమ్మం దగ్గిరకీ, పడమటింటి గుమ్మందగ్గిర నుంచి వీధి గుమ్మందగ్గిరికీ పచారుచేస్తూనే కనపడతాడు వేంకటాచలం.

పూర్ణమ్మ మాట వినపడ్డమే కాని మనిషి కనపడదు.

ఒకటి రెండుమాట్లు బజారుకి వెళ్ళవలసి వచ్చింది. అయితే, బుచ్చెమ్మ వీధిగదిలో తలుపు వేసుకుని వుంటే సింహద్వారం నుంచీ, తలుపు తెరుచుకుని వుంటే దొడ్డిగుమ్మం నుంచీ వెడుతూ వస్తూ వచ్చాడు చలపతి.

దీంతో, ఏకాంత వాసశిక్ష అనుభవిస్తున్నట్టు బాధపడి పోయింది బుచ్చెమ్మ.

అయినా, చలపతిని పిలవా లన్న సంకల్పం మొదటినాడు బలవంతాన అణిచిపెట్టుకుం దామె. రెండోనాడు కూడా మధ్యాహ్నం దాకా చాలా బెట్టుగానే వుండిపోయింది.

మధ్యాహ్నం కాఫీ లయినాక, సింహద్వారాన పూర్ణమ్మ లోగుమ్మంలో నుంచుని వున్నట్టయిం దామెకి.

ఇక వుండలేకపోయింది.

కూచోనే లేకపోయింది.

చరచరా గుమ్మందాకా వచ్చి "మాతమ్మ దేంచేస్తున్నాడండీ అత్తయ్య గారూ?" అంటూ మృదువుగానూ, చాలా వినయంగానూ, మహామర్యాదగానూ అడిగింది, కొండంత ఆశతో.

ఒక్క భోజనం పెట్టాటప్పుడు తప్ప పూర్ణమ్మ కూడా యెదటపడ్డం లేదు బుచ్చమ్మకి.

ఇది పట్టుదలగా జరుపుకుంటోం దామె.

కాగా, — బుచ్చమ్మ కనపడ్డంతోనే ముందు తలుపు చాటుకి జరిగేసిం దామె.

తరవాత, బుచ్చమ్మ నేర్పినపాఠం బాగా వల్లించుకుని వుందేమో "ఏమో నే నే మెరుగుదునూ?" అంటూ తిరగవేసికొట్టి, వచ్చిన పనికూడా విడిచిపెట్టేసి, గిరుక్కున మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది.

బుచ్చమ్మ మొగం గూక్కుపోయింది, దీంతో.

"భాగోతం ఆడేస్తా రీవూడు రోజులూ వీళ్ళు" అంటూ వొళ్ళు రవల బెట్టుకుందామె. అయినా, వూరుకోదలుచుకో లేదు.

"ఇప్పుడు మూ డయివుంటుంది" అని వూహించుకుంది. "కనక యిది ఫలహార సమయం" అని దృఢపరచుకుంది. "పడకగదిలోనే వున్నాడు చలపతి గాడు" అని నిశ్చయించుకుంది. "పలికేదాకా వూదరకొడితే కళ్ళుబడకుండా వుండగలడా?" అని ఆలోచించింది. "అటో యిటో తేలిపోవా లివాళ" అని నిరుకు చేసుకుంది.

చప్పుడు కాకుండా తలుపులు తెరుచుకుని అరుగుమీదికి వచ్చింది ముందామె.

మెల్లిగా వీధిలోకి దిగజారి, యెవరయినా వస్తున్నారేమో అని వొకమూ టలాగా ఇలాగ చూసి, యేడెనిమిది మాసాలనుంచి వీధిలోపడివున్న గుట్టలో నుంచి పట్టెడు కంకరరాయి సంగ్రహించింది, తరవాత.

వెంటనే వుత్తరపు అరుగెక్కి "చలపతీ, వొరేయ్ తమ్ముడూ" అంటూ పిలుపుమీద పిలుపు మొదలుపెట్టింది, టక్కు టక్కున కిటికీ తలుపుమీద కొడుతూ, చివరికి.

ఫలహారం పూర్తయి తాంబూల చర్వణం జరుగుతోం దప్పటికి గదిలో.

చలపతి "సొంత" కుర్చీలో కూచుని వున్నాడు.

ఎదట నుంచుని, చేతులు కుర్చీచేతులమీద ఆనుకుని, అతనిమీదికి వాలి, మొగంమీద మొగంపెట్టి కువకులలాడుతోంది. జోగమ్మ.

ఎడమచెయ్యి ఆమె నడుముకి చుట్టవేసి తెరపి మరపుల్లో వున్నాడు, చలపతి కూడా.

ఎలాంటి అలికిడీలేని అర్థరాత్రివేళ యివతల గాఢనిద్రలో వుండగా, దొంగపోటుగా వచ్చి అవతల కోటమీద ఫిరంగులు మోర్జాయించిన ట్టయింది, దీంతో.

ఉలిక్కిపడ్డారు దంపతు లిద్దరూ.

కంగారుపడుతూ వెంటనే లేవబోయాడు చలపతి.

కాని, అది సాగనివ్వలేదు జోగమ్మ.

ఇంకా యింకా మీదికి వాలిం దామె.

రెండుచేతులూ మెడకి చుట్టవేసి గభీమని వాళ్ళోకూచుంది.

మాటరాకుండా పెదవులతో పెదవులు నొక్కేసింది.

ఇక అత నులకడు పలక డన్న ధైర్యం కలిగిం దామెకి.

మెల్లిగా లేచింది, చురుగ్గా చూస్తూ.

ఔడు కరుచుకుని "పలికినా లేచినా బాగా జరగదు సుమండీ" అన్నట్లు తర్జనితో టొకాయించింది.

హార్మోనియం తీసి, ఆరున్నర శ్రుతివేసి, శ్రీరాగం వర్ణం యెత్తుకుని మూడోకాలం వాయించసాగింది, చివరికి, ఝామ్మని.

అటు గండం—ముసలమ్మపాటే అయినా, యిటు సంగీతం దొరకడం—దీంతో! కాళ్ళూ చేతులూ ఆడించుకుంటూ, లోపల్లోపలే "భలే—భలే" అని తల తిప్పేసుకుంటూ పొంగిపోసాగాడు, చలపతి.

కాని, బుచ్చమ్మ, తనపని మానలేదు.

మళ్ళీమళ్ళీ తలుపు కొట్టిం దామె.

ఇంకా యింకా గట్టిగా కొట్టింది, గబాగబా కూడా కొట్టింది.

ఇంకా గట్టిగా పిలిచింది, రకరకాలుగానూ పిలిచింది.

అయినా జవాబు రాలేదామెకి.

దీనికి సాయం, వీధి అరుగుమీద కూచుని చెల్లెలితో యేమో మాట్లాడుతున్న పక్కింటి సోదెమ్మ "ఈ అల్లరంతా, యేమిటిచెప్మా?" అనుకుంటూ నడివీధిలోకి వచ్చి చూసింది.

అక్కడితో సరి.

నిలువునా నీరయిపోయింది బుచ్చమ్మ.

కంకరరాయి అరుగుమీదే జారవిడిచేసింది.

"ఓసి నీమొగం మండెను గదే. నీకళ్ళు దించుకుపోయెను గదే" అని సోదెమ్మని మెల్లిగా తిడుతూ తన గదిలోకి వెళ్ళిపోయి తలుపులున్నూ బిడాయించుకుంది, భడీమని.

25

"ఒసే అమ్మోయ్" అంటూ యిలా వెళ్ళి జోగమ్మ

"విన్నారా పిన్నిగారూ?" అంటూ అలా వచ్చి సోదమ్మ యిదంతా చెప్పేశారు పూర్ణమ్మకి. వొగర్చుంకుటూ.

"అదేమి పోయేకాలం అమ్మాయిగారూ! పిల్ల ముచ్చటపడితే కోవాబిళ్ళలు తెప్పించానండీ బజారునుంచి, ఇప్పుడే పెట్టివచ్చానండీ యిద్దరినీ తినమని. ఒక్కబిళ్ళ అయినా నోట వుంచుకున్నాడో లేదో పాపం అతను, ఇంత అల్లరా దీనికి? ఎక్కడయినా విన్నామా యిలాంటి దారుణం? పట్టపగలా? కంకర రాయి పుచ్చుకుని కిటికీ తలుపులు బద్దలు కొట్టడమా? హా—వ్వ అని నోరు నొక్కుకుంటూ వెళ్ళి వేంకటాచలానికి చెప్పింది పూర్ణమ్మ.

"ఆడపుట్టుక పుట్టలేదూ? మనిషా పశువా యిది?" అని చర్రుమంటూ లేచాడు వేంకటాచలం. ఆవుద్రృతం చూసి, వీధిలోకి వెళ్ళి అల్లరిచేసిపోతాడేమో అని గభీమని వెళ్ళి అడ్డంగా నుంచుంది పూర్ణమ్మ; కాని అప్పటి కప్పుడే తగ్గిపోయి "చలపతి పలకలేదు గదా?" అనడిగా డతను, ఉబ్బెత్తుగా లేచినవాడల్లా తాపీగా కూచుంటూ.

"నేను పలక నివ్వలేదు నాన్నారూ" అంది, వొక్కదూకున యెదటికి వచ్చి జోగమ్మ.

"ఆ, అదీ పద్ధతి. అదీ మందు దానికి"

"లేవబోయారు, పాపం! కాని కదలనివ్వలేదు నేను"

"నీకా మాత్రం శక్తి వుంటే యిక లేని దేమిటీ?"

"..........."

"జీర్ణంజీర్ణం వాతాపిజీర్ణం. ఏమన్నా పడ్డం—ఏమిచేసినా చడీచప్పుడూ కాకుండా బదులువేసి వూరుకోడం—ఇదే చెయ్యవలసింది"

"అవునే అమ్మాయీ! మనమాట పైకి వినబడగూడదు. మనం కోపంగా వున్నామని కూడా యెవరూ అనుకోగూడదు" అంది పూర్ణమ్మ.

"అమ్మా" అని పిలిచాడు వేంకటాచలం మళ్ళీ.

"అందరికీ ఆధారం చలపతి. అతణ్ణి విడిచిపెడితే యెవరికీ యేమీలేదు. కాక,—తన పెత్తనానికి నువ్వడ్డువస్తా వన్నయేడుపే గాని, తన హద్దు

ఎక్కడికో, నీహక్కెంతటిదో గుర్తించుకోడం లేదామె. ఇది మనం తెలుసుకుంటే చాలదు, ముఖ్యంగా నీమామగా రంగీకరించాలి. లోకం కూడా హర్షించాలి. అంటే, నువ్వెంత జాగ్రత్తగా మనులుకోవాలో తెలుసా?" అనిన్నీ అడిగాడతను.

తన బాధ్యత గుర్తించి జోగమ్మ నీరవ అయిపోగా, పొదివి పట్టుకుని గదిలోకి తీసుకువెళ్ళిం దామెని, పూర్ణమ్మ.

పడమటింటి వసారాలోనుంచి వాకట్లోకి వచ్చాడు వేంకటాచలం.

కవాచీబల్లమీద కూచుని వున్నాడు చలపతి.

బుచ్చమ్మ చేసిన అల్లరికి కంగారూ, ఏమి జరుగుతుందో అని బెదురూను, అతనికి.

ఇద్దరి చూపులూ కలిశాయి.

వాణికినట్టయి చలపతి జరిగి కూచోగా "ఏమిటి ఆలోచిస్తున్నా" వనడుగుతూ వెళ్ళి పక్కని కూచున్నాడు, వేంకటాచలం.

"ఏమీ లేదండి" అన్నాడు చలపతి.

"అబద్ధం. నువ్వేదో ఆలోచిస్తున్నావు. పోనీ, రహస్యం కామోసు, నాతో చెప్పవద్దులే"

"ఆలోచనా లేదండి, రహస్యమూ లేదండి, వూరికెనే కూచుని వున్నానండి"

"అయితే ఆయింది గాని బజారుకి వెడదాం వస్తావా?"

"వస్తానండి"

ఇలా అంటూనే లేచినుంచున్నాడు చలపతి.

"తమలపాకు లయిపోయాయి నాన్నారోయ్" అంటూ, వచ్చింది జోగమ్మ, యివతలికి.

"మీ నాన్నారితో చెబుతావేం, కావలిస్తే నీమొగుడితో చెప్పుకో" మంటూ పూర్ణమ్మ వచ్చింది వెనకాలే.

ముగ్గురూ సరాగా లాడుకున్నా రొక్క క్షణం.

"సోఫా కావాలంటోంది అమ్మాయి, కొనుక్కొద్దాంరా" అంటూ మామగారు బయలుదేరగా, చంకలు గుద్దుకుంటూ అతని వెనకనే వెళ్ళాడు చలపతి.

ఆవెళ్ళడం, తలుపోర చేసుకుని చూస్తోంది, బుచ్చమ్మ కళబడింది.

తానెంత పిలిచినా పలకని చలపతి, సంబరపడుతూ మామగారితో కలిసి వెళ్ళడంచూసి కొట్టినంత బాధపడిపోయింది, ఆమె.

"సోదీ వాళ్ళూ లాలోచీ అయినా రేమో" అనుకుందామె. "పూర్ణమ్మే దాన్ని వీధిలోకి పంపి వుంటుం" దనిన్నీ వూహించుకుంది.

దీంతో అభిమానం ముంచుకురాగా, ముసుగు తన్నుకుని కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకుంది.

ఆరాత్రి తిండితినలేదామె.

ముందు జోగమ్మ పిలిచింది. తరవాత పూర్ణమ్మా పిలిచింది. ఇదేమీ యెరగని జగ్గయ్య చాలా బలవంతం చేశాడు; కాని యెవరిమాటా వినలేదామె.

26

తెల్లవారితే బుచ్చమ్మకి స్నానం.

"ఇంట్లోకి వెళ్ళాటప్పటి కేమి గందరగోళం పుడుతుందో" అనీ "వాళ్ళూ వాళ్ళూ కలిసి యేమేమి తలుచుకుని వున్నారో" అనీ చాలా బెదురుపట్టుకుందామెకి.

మనస్సంతా చీకాకుపడిపోయింది.

కాని "సోదినీ చెల్లెల్నీ విడదీసి దాన్ని అల్లరిపెట్టకపోతే నాపేరు బుచ్చికా"దనుకుందామె యెన్నోమాట్లు.

"తల్లినీ తండ్రినీ చూసుకుని యెగిసిపడుతోంది, తరవాత నేలబెట్టి రాసెయ్యకపోతే నేను బ్రాహ్మణజన్మ యెత్తలే" దనుకుందెన్నో మాట్లు, జోగమ్మని తలుచుకుని.

"ఆసానిపాపతో కులకనిస్తానేమో చూసుకోనిన్ను" అని చలపతిని తలుచుకుని పళ్ళు కొరుక్కుందామె.

"మాయకాఫీలుపోసి లోబరుచుకున్నారు వాళ్ళు, అన్నం అయినా సరిగా పెడతానేమో చూసుకో తరవాత నీకు," అని తండ్రిని తలుచుకునిన్నీ అగ్గయిపోతూ వచ్చిందామె, యెన్నోమాట్లు.

ఆ కంగారులో యీ వూహలు కొంత నిలవబెట్టగలిగాయామెని.

అయినా, పొద్దస్తమానూ తలుపులు బిగించుకుని కూచునీ పడుకునీ గడపడంలో కాళ్ళు గుదులుపట్టగా, మతిన్నీపోయినట్టు కాగా, నాలుగ్గంటలవేళ గోదావరిగట్టుకి బయలుదేరిందామె.

వెళ్ళి చూడగా, ఇలాంటిదే వొకామె గట్టుకింది రావిచెట్టు వేళ్ళమీద కూచునివుంది.

"నువ్వెవ్వ"రంటే "నువ్వెవ్వ"రని వివరాలు చెప్పుకుని లోకాభిరామాయణంలో పడిపోయారు, క్షణంలో వాళ్ళిద్దరూ.

సాగతీసుకోడాలూ, బుగ్గలు నొక్కుకోడాలూ, శాబాసులూ అవ్యాహతంగా వెళ్ళిపోసాగాయి.

నాలుగురోజులకిందట (ఫలానా) ప్రౌఢదంపతులు మసక చీకట్లో గోదావరిలో చాలాసేపు స్నానం చేశారు. అప్పుడా మొగుడు, ఆ పెళ్ళానికి సబ్బుతో వీపు తోమాడుట.

"కొత్తగా వచ్చాడుటే చదువుకోడానికి. వారా లింకా పూర్తిగా కుదరలేదుటే పాపం. ఇవాళ రెండుపూట్లా కాస్త అన్నంపెట్టవే" అని ముసలి మొగుడు ఎంత బతిమాలినా "ససేమిరా" అని, మరో నాలుగురోజుల కామొగుడు వూరికి వెళ్ళగా పిలిచి ఆ పిల్లాడికే భోజనంపెట్టి, నాలుగు గంటలవేళ ఆ పిల్లాడిచేతే బజారు నుంచి తినుబండరాలు తెప్పించుకుని వాడికింతపెట్టి, తానింత తిని "ఆకల్లేదు కాదూ?" అంటూ రాత్రి పదిగంటలుదాకా కూచోపెట్టి అప్పుడు భోజనం పెట్టి పంపేసిందిట.

ఒక మొగుడూ పెళ్ళామూ బజారుకి వెళ్ళారుట. ఒక గజం జాకెట్టుగుడ్డకోసం ఆమే, ఒక తువ్వాలుకోసం అతనూ కలిసివెళ్ళారుట జట్కాయెక్కి. నచ్చక పదిషాపులు తిరిగారు. బేరాలు కుదరక పదికొట్లు తిరిగారుట. అప్పటి కావిడకు నీరసం వచ్చిందిట. "రేపు వచ్చి కొనుక్కుందాం, రా, జట్కాయెక్కు" అని మొగుడుట. "ముందు కాఫీహోటలుకి వెడితేగాని జట్కాయెక్కలేనని ఆవిడట. చివరికి చెయ్యీ చెయ్యీ కలుపుకుని వొకరిలా లాగనూ, వొకరలా లాగనూట. బజారంతా విరగబడిపోయిందిట. ఎక్కడ మనుషులక్కడ ఆగిపోయారుట, ఎక్కడి బళ్ళక్కడ నిలిచి పోయాయిట. "మాబేరాలు చెడిపోతున్నా"యని వర్తకులు పోలీసులకు కబురుచేశారుట. చివరికావిడ, వొక చెయ్యి విసురుతూ దారిచేసుకుంటూ, వొకచేత్తో మొగుణ్ణి గోదావరిస్టేషను దాకా బరబరా లాక్కుపోయిందిట, పెద్ద కాఫీహోటలుకి.

ఇలాగ సర్గమీద సర్గా, కాండమీద కాండా తిరిగిపోయి చివరికి, పుట్టింటివారు వచ్చి జోగమ్మకి సారెసామాను కొనడం దగ్గిర నిలిచిపోయిందా రామాయణం.

"కూతురంటే యెంతముద్దే వారికి?" అనడిగింది చెలికత్తె.

"ముద్దుముద్దని అంత అబ్బరం యెందుకూ? అవతల మరెవరయినా వుంటేనా వారికి?" అంటూ గింజుకుంది బుచ్చమ్మ.

"అలాకాదే. నిజంగా, మరెవరూ లేరే అనుకో. డబ్బూ కావలసినంత

వుందనుకో. అయినా, అందచందాలు తెలియవద్దూ ముద్దుమురిపా లుండవద్దూ? సాహసమున్నూ వుండవద్దూ?"

"పెళ్ళిలో చూశాను, వాళ్ళమాటే చెప్పాలి నువ్వు."

"నేను చూశానా చేశానా మీవాడి పెళ్ళి? నీ మరదలు కావాలన్నవన్నీ కొన్నారు. ముద్దినుసువస్తువులూ కొన్నారు. ఎంత డబ్బయినా కొనమన్నవన్నీ కొన్నారు."

"నోరు మూసుకోవే. కూతురికివ్వడం కూడా గొప్పే అంటావేమిటి నువ్వు?"

"కూతురేకాదు, మీ చలపతి కూడా కోరుకున్న కుర్చీ—"

"ఏమిటీ?" అంటూ తెల్లపోయింది బుచ్చమ్మ.

"మా చలపతా, కోరుకున్నాడా కుర్చీ?" అనిన్నీ అడిగింది.

"అవును"

"మా చలపతికా?"

"మీ చలపతికే"

"మా తమ్ముడికే?"

"మీ తమ్ముడికే, ఏం, అలా వింతపడతావేం? ఆ కుర్చీకి తగ్గ టేబిలు కొన్నారు"

"టేబిలూ కుర్చీనా?"

"అవును, ఏం, అలా అంటావేం?"

చలపతిని తాను ధవళేశ్వరం పంపిన పూటే కొన్నారు వారా కుర్చీ, ఆటేబిలూను. బాగా జ్ఞాపకం వుంది బుచ్చమ్మకి.

"అబ్బే, ఏమన్నానూ? ఎందుకంటాను? అయినా, తనకి లేకా మావాడు వాళ్ళని దేవురించడం?"

"అదేమిటే నీమొగం యీడ్చా! అత్తవా రివ్వడమూ, అల్లుడు పుచ్చుకోడమూ, అడిగి, కోరి, అలిగి కూడా అవీ యివీ రాబట్టుకోడమూ అదో అందం కాదుటే మనలోనూ?"

"నీ అందం అడుక్కుతిన్నట్టే వుంది లే."

ఇలా అంటూనే యెగసి నుంచుంది బుచ్చమ్మ.

"లేస్తావేం?" అనడిగింది జతకత్తె, ఆత్రంగా.

"పోతా."

"అదేమిటే?"

"ఏమిటే అంటే, నీకేం? వచ్చినవారు వియ్యాలవారాయె, ఏవుందో ఏమి లేదో – మా కెన్ని వంకలు పన్నుతున్నారో వారు–"

మాట పూర్తి చెయ్యకుండానే బయలుదేరింది బుచ్చమ్మ.

"ఇంటికి వెళ్ళి వండాలా వార్చాలా నువ్వు? వాళ్ళకి తోచింది వాళ్ళు చేసుకోకుండా, అదనీ ఇదనీ, రమ్మనీ పొమ్మనీ – ఇంతే కాదూ వీధిగదిలో కూచుని నువ్వు చేసేదీ? ఇంటిదగ్గిర వూసిపోక వచ్చానే. కాస్సేపు కూచోవే మామ్మా."

ఇలా అంటూ లేచివచ్చి బతిమాలింది జతకత్తె.

అడ్డంగా నుంచుంది.

అయినా బుచ్చమ్మ వినిపించుకో లేదు.

విసురుగా బయలుదేరిం దామె.

"అయినా రెండణాలూ పుచ్చుకుని ఇంతపని చేశాడా చలపతిగాడు? ఇంకా ఏం చేస్తాడో ముందుముందు? వాళ్ళేమి చేయిస్తారో?"

అని ఇలా రవిలిపోతూ - మండిపోతూ ఎగిరిపోయిందామె.

27

బుచ్చమ్మ ఇలా గోదావరిగట్టుకి బయలుదేరింది, కోవా బిళ్ళలు తెమ్మని డబ్బు లిచ్చి జోగమ్మ అలా బజారుకి పంపించింది, చలపతిని.

చిటికలు వేస్తూ "........రావాలి, తెలుసా?" అని చాలా చురుగ్గానే చెప్పిం దామె, త్వరగా రావా లని; కాని గోదావరి స్టేషనుదాకా వెడితేగాని మంచిరకం దొరకలే దతనికి.

అక్కడికీ, జోగమ్మ ఎందుకు చెప్పిందో అందుకు – బుచ్చమ్మ కళ్ళ బడకుండా వుండడానికి వాయువేగ మనోవేగాలమీదే వచ్చేస్తున్నా డతను; కాని జూపూడివారి కొట్ల దగ్గిర మళుపు తిరిగేటప్పుడు దొరికిపోయా డత నామెకి.

ఆమె కూడా చెలికత్తె చెప్పినదానిమీద వొళ్ళు రవల బెట్టుకుంటూ అంత కంటే ఎక్కువ వాయువేగ మనోవేగాల మీదే వచ్చేస్తోంది, మరి.

అక్కడ తారసపడ్డందు కత నెంత పరితపించాడో, ఆమె అంత మురిసిపోయింది.

నిర్ఘాంతపడిపోయా డతను. అగ్గయిపోయిం దామె. ఇద్దరూ నిలిచి పోయా రప్రయత్నంగా, ఒక్కక్షణం మిడుతూ మిడుతూను, పులుకూ పులుకూనూ చూసుకుంటే గాని ప్రకృతిలో పడలేకపోయారు వారు.

"అనుగ్రహం తప్పిన ట్టుందే" అనందుకుం దామె.

"..............."

"ఇక నేను కనపడను కామోసు.......అవునా?"

"..............."

"అక్కయ్య చచ్చిపోయిం దనీ, శని విరగ డయిపోయిందనీ అనుకుంటున్నావు, కదూ?"

"..............."

"మాట్టాడవేం?"

"......... ......"

"పోనీ, చూడవేం రా?"

"..............."

"వాళ్ళు వద్దన్నారా?"

"..............."

"మొగం పైకెత్తూ"

"..............."

"వినపడ్డం లేదుట్రా?"

"ఏం?"

"ఏమి జరుగుతోం దేమిటి."

".............."

"అయిపోయిం దయ్యా పని."

"..............."

"వా ళ్ళేదో మందు రాశారు పెద్దమ్మ వారికి, నేననుకుంటూనే వున్నాను. మాయలమారి ముండలు వా ళ్ళేందుకైనా తగుదురు. కాకపోయినా, వాళ్ళిక్కడ వుండగానే ఈ గ్రహచారం తటస్థించాలా నాకు?"

"..............."

"పండువంటి సంసారం ఇక కుక్కలికీ నక్కలికీ అయిపోతుంది కామోసు."

"........... ..."

"వోరి చెవలవాజమ్మా, ఇప్పటికైనా కళ్ళుతెరుచుకో."

"..............."

"పెళ్ళాం చెప్పినట్టల్లా వింటావుట్రా"

".... ...."

"అన్నట్టు మొన్నపొద్దున్న నువ్వెక్కడికి వెళ్ళావూ?"

"ధవళేశ్వరం వెళ్ళ మన్నావు కాదూ నువ్వు?"

"వెళ్ళావా?"

"ఆ"

"ఛీఛీ నీబతుకుబండ లయిపోనూ, పెళ్ళాం కొంగుపట్టుకుని బజారుకి పోయి—ఎంత పొగరుపట్టావురా?"

"............"

"ఎంతలో మారిపోయావురా?"

"ఎవరు చెప్పా రమ్మా నీకు?"

"బుకాయిస్తావా యింకా?"

"నే నక్కడికే వెళ్ళాను"

ఈమాటలో "నీకు దిక్కున్నచోట చెప్పుకో యిక" అన్న అర్థం స్ఫురించిందామెకి. దాంతో రోషం పెరిగి పోయింది.

"నోరు ముయ్యి" అంటూ వురిమింది. పళ్ళు కొరుక్కుంటూ ఆమె.

"ధవళేశ్వరం వెళ్ళమన్నావు నువ్వు. వెళ్ళాను. అక్కడ నేను చెయ్య వలసిందేమీ చెప్పలేదు నువ్వు. వెళ్ళడం అయిపోయింది. వెళ్ళి రమ్మన్నావు, వచ్చేశాను, తప్పేం?"

"............"

"ఎవళ్ళో నేను ధవళేశ్వరం వెళ్ళలేదని చెప్పినవాళ్ళు?"

అయితే, పుల్లయ్య వేంవారం అనిపించుకొమ్మనా నిన్ను పంపుత?"

"......................"

"పోనీ, పది దాటితే గాని యింటికి రావద్దన్నాను కదా నేను?"

"పదకొండు కావచ్చింది నేనింటికి వచ్చాటప్పటికి. నీకు తెలియకపోతే యెవళ్ళ నయినా అడుగు"

తెల్లపోయింది బుచ్చమ్మ.

తనదే పైచెయ్యి అయినట్టు కనపడిం దతనికి.

పులుకూ పులుకూ చూశాడు,

"సరే, నీయిష్టం వచ్చినట్టేడ్చుకో" అంటూ చెండుకుందామె, అంత కంటే పులుకూ పులుకూ చూస్తూ.

"......................"

"చేతకాని పెద్దమ్మల కెంతచేసినా బూడిదలో పోసిన పన్నీరే అయి పోతుంది"

".........................."

"ఎంతకష్టపడ్డానురా నీకోసం!"

".........................."

"ఎంతెంత ఆలోచనలు చేశానురా, నిన్నుద్ధరిద్దా మని?"

"...................."

"చివరి కెంత గొంతుకోశావురా నువ్వు?"

తనమీద కారాలూ మిరియాలూ నూరడం కంటే, ఆమె పరితపించడం యెక్కువగా ధ్వనించిం దతని కిందులో.

మెల్లిగా బయలుదేరాడు, మాట్టాడకుండా.

"వెళ్ళిపోతావుట్రా?"

"............"

"ఇలారావూ?........నుంచోవూ?"

ఆగి, మొగం వెనక్కితిప్పి "ఏం?" అన్నట్టు పెంకితనంగా తల యెగరవేసుకున్నాడతను. నాలుగడుగులు అతనికేసి తానే వేసి "మించిపోలే దిప్పుడయినా బుద్ధి తెచ్చుకో" అందామె.

"............ ..."

"నామాట విను........ నేనెందుకు చెబుతున్నానో ఆలోచించుకో"

"................"

".... ఇదిగో.... వాళ్ళ సంప్రదాయం మంచిది కాదు"

"............"

"ఆ సాని పాప నిన్నెలాగా సని పెట్టదు. దానివల్ల పెద్ద తప్పు కనపడే దాకా వోపికపట్టి, తరవాత, రెండోపెళ్ళి చేసేస్తా న్నీకు, మూడోనాటికి"

"............"

"ఎరక్క పూరికే చేసుకున్నాం మనం దాన్ని. బోలెడు కట్నం వస్తుంది నీకిప్పుడు"

గుండెలు కొట్టుకున్నా యతనికి. కాళ్ళు వొణికాయి.

"ఆ పెద్దమ్మ వారిని సాగనంపేశామంటే, రంభల్లాంటి పిల్లల్ని తెచ్చి లక్షమంది నీకాళ్ళమీద పడేస్తారు, క్షణంలో"

"............"

"సమర్తాడిన పిల్లలే దొరుకుతున్నారిప్పుడు, చూస్తున్నావా?"

వొళ్ళు రణకంపరం యెత్తిపోయిందతనికి. దురుసుగా బయలుదేరాడు.

"వెళ్ళిపోతావేంరా?"

కంగారు పడిపోయిందామె.

వడి యెక్కువయిందతనికి.

"ఇదిగో ...."

"................"

వెంటనే, నడకా కాకుండా పరుగూ కాకుండా రొప్పుకుంటూ వెళ్ళి, బుచ్చమ్మ, కంఠం నొక్కుకుంటూ "వాళ్ళతో గానీ, నాన్నతో గానీ చెప్పావు సుమా యీ మాట? ఏం.... వినపడిందా?.... వొరేయ్, చలపతిగా — వోరి సీయిల్లు — వొరేయ్ —"

మాట సగాన కంఠం బిగుసుకుపోయిందామెకి.

28

కంభంపాటి వేంకటచయనులుగారి మేడమీద, వారి చిన్న కోడలితో వసారాగదిలో కూచుని గవ్వలాడుతున్న సోదెమ్మ యిదంతా చూసింది.

బుచ్చమ్మ మాట వినపడగానే లేచి, కిటికీ రెక్కచాటున నక్కి, మాట్లాడ వద్దనీ, యెదటికన్నీ వెళ్ళవద్దనీ స్నేహితురాలికిన్నీ సన్నచేసి గొడవ అంతా బాగా వింది కూడా.

"అదేం పోయేకాలమండీ?" "యెంత ఘోరం తలపెట్టిందో చూశావా?" అంటూ బుగ్గలు నొక్కుకున్నారిద్దరూ.

సోదెమ్మ, వెంటనే వెనకవీధి నింటి కెగిరిపోయి, కరివేపచెట్టెక్కి, పిలిచినట్టు నూతికి వచ్చివున్న పూర్ణమ్మని దగ్గిరగారమ్మని "తెలిస్తే పీకేస్తుంది సుమండీ పిన్నిగారూ, నన్ను" అంటూ అందుకుంది.

"ఏమిటో, చూసుకున్న వేళావిశేషం అలాంటిది. ఒక్క కడుపున పుట్టకపోయినా, జోగమ్మ నాకు రెండో చెల్లెలే అనుకుంటున్నాను"

"ఇంతకంటేనా? మా అమ్మా యదృష్టవంతురాలు. ఇంతకీ, - ఏదో చెప్పవచ్చారు"

"విన్నప్పణ్ణుంచీ వొక్క విధంగానే తరుక్కుపోతోంది నాకడుపు. మీతో యెలా చెప్పనూ? ఇదేం శుభవార్త కనకనా?"

"అదేమిటి తల్లీ? ఇప్పుడేం వచ్చింది మామ్మా?"

కంగారుపడుతూ నూతిగోడకి చేరబడింది పూర్ణమ్మ. ఏకపుత్రుడు చనిపోగా, ఏకపుత్రిక జోగమ్మే తమకు సర్వమూ అని నమ్ముకుని వుందామె. జోగమ్మ విషయమే ఇప్పుడేదో అశుభం అనేటప్పటికి ఆమె నవనాడులూ కుంగిపోయాయి.

ఇది చూశాటప్పటికి సోదెమ్మకీ పట్టుకుంది కంగారు.

''కొంపతీసి యెవరితోనయినా అన్నారు సుమండీ. నామాట పైకి వచ్చిందంటే యిక బతకడానికాస్కారం వుండదు సుమండీ యీపూళ్ళో'' అని అడుగడుక్కీ బెదురుతూనే, తాను చూసిందీ, తాను విన్నదీ, పూసగుచ్చి నట్టంతా చెప్పేసి ''ఏంచేస్తారో మరి. మీ జాగ్రత్తమీద మీరుండండి. అమాయిక బ్రాహ్మణుడు, ఈ సంగతి తెలిస్తే గోలపెట్టేస్తాడు, జగ్గయ్య మామ. బెంబేలు పడిపోతుంది చెల్లాయి క్కూడా తెలియనివ్వకండేం'' అంటూ ముక్తాయించి, ఇదంతా చెల్లెలికి తండ్రికీ మరిదికీ చెప్పడానికింట్లోకి చక్కాపోయింది.

"ఎంత ఘోరం తలపెట్టావు బుచ్చమ్మతల్లీ? మేము నీకేం విషం పెట్టాము మామ్మా" అని గుండెలు బాదుకుంటూ, ఇంటోకి వెళ్ళిపోయింది, పూర్ణమ్మ కూడా.

29

అరటిబోదె చాటున కొబ్బరి మొక్కకి పాదుకడుతూ పెరట్లోనే—వారి కిద్దరికీ మధ్యగానే వున్నాడు జగ్గయ్య. సోదెమ్మ చెప్పిన మాటలన్నీ ముందతని చెవిలో పడే తరవాత పూర్ణమ్మ దాకా వెళ్ళాయి.

అతనికీ గుండెలు కొట్టుకున్నాయి. కాళ్ళు తేలిపోగా వోపట్టాన లేవలేక పోయాడు. లేచాకయినా, గొబ్బరిమట్ట పట్టుకుని గాని నడవలేకపోయాడు.

తాను నెత్తీనోరూ బాదుకుంటూ, మధ్య మధ్య బుజ్జగిస్తూ అడిగాడు జగ్గయ్య. కొంతసేపు కొయ్యయిపోయి, కొంతసేపు వొణికిపోయి, చివరికి ''మరే నాన్నా'' అంటూ జరిగినదంతా చెప్పేశాడు చలపతి.

ఈ సమయాన వేంకటాచలం వచ్చాడు.

అతని చూపులు చాలా చురుగ్గా వున్నాయి; కాని ప్రయత్నపూర్వంగా వుద్వేగం అణచుకుంటున్నట్టుంది. వాలకం.

అతణ్ణి చూసి మరీ కంగారుపడిపోయాడు చలపతి.

విధిలేక ''రండి'' అని పిలిచి, చోటిచ్చి ''ఏమి సెలవు'' అనడిగాడు జగ్గయ్య.

"మీ సెలవుకోసమే వచ్చా న్నేను. అయితే, కొత్త సంగతి ఏమయినా విన్నా రా మీ రివాళ?"

"కొత్త సంగతి అంటే — "

"మా అమ్మాయి విషయమై."

"విన్నాను విన్నాను. ఒకరు చెప్పగా కాదు, నా చెవులారా విన్నాను. అంటే, పూర్ణమ్మక్కయ్యగారూ నేనూ వొక్కమాటే విన్నాం."

అర్థంకానట్టు మిడుతూ మిడుతూ చూశాడు వేంకటాచలం.

"అక్కయ్యగారు నూతిగోడకి ఆనుకునివున్నారు, అరటిబోదె చాటున కొబ్బరిపిలక దగ్గిర నే నున్నాను. అక్కయ్యగారికి మాత్రమే చెబుతున్నా ననుకుంది సోదెమ్మ తాను. నాకు తెలియనియ్య వద్దని కూడా అందది; కాని జరుగుతున్నది యెరుగదు, తానే చెప్పింది నాకున్నూ."

"అలాగా?" అంటూ కనుబొమ్మలూ తలా యెగరవేసుకున్నాడు వేంకటాచలం.

"సోదెమ్మ చెప్పింది కల్పన కాదు. చలపతికూడా ఇప్పుడే చెప్పాడు, వివరంగా" అన్నాడు జగ్గయ్య.

"భావగారిని నమ్మించగలమా?" అనుకుంటూ వచ్చాడు వేంకటాచలం. "భావగారు సత్యరుషే" అనుకున్నాడు చివరికతను.

"మేమేం పాపం చేసుకున్నా మన్నయ్యగారూ?" అంటూ గోలపెడుతూ వచ్చిం దక్కడి కీసమయాన పూర్ణమ్మ – వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమె వెనకనే వచ్చింది జోగమ్మ కూడా.

ఇది చూశాటప్పటికి కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి జగ్గయ్యకి.

కొయ్యే అయిపోయాడు చలపతి.

వెంటనే తూల్తూతూల్తూ జోగమ్మ దగ్గిరికి వచ్చి, జగ్గయ్య "ఏడవ కమ్మా, యేడవకు. ఈ క్షణాని కందరమూ బాగున్నాము. లోటేమీ రాలేదు, నిండింటో యేడవకు తల్లీ! నాకొడుకే నువ్వూ, నువ్వే నాకొడుకూను నాకు. నిన్ను విడిచిపెట్టి మేము బతగ్గలమా అమ్మా?" అని గద్గదికతో మరి మాట్లాడ లేక "నాయనా" అని మాత్రమే అన్నాడు చలపతికేసి చూసి.

కడుపు చెరువయిపోయింది చలపతికి. మండువా వాకిట్లోకి వచ్చేశా డతను వెంటనే.

తల్లి ఇంగితం గుర్తించి అతని వెనకనే వచ్చింది జోగమ్మ కూడా.

చలపతి కేమీ తోచలేదు.

ఒకరి నొకరు పొదువుకుని అప్రయత్నంగా గదిలోకి వెళ్ళారిద్దరూ.

చలపతి కుర్చీమీద కూచోగా, అతని వొళ్ళో కూచుంది జోగమ్మ.

ఇద్దరూ ఏడ్చారు.

ఏడుస్తూనే ఏమిటేమిటో అందామె.

అతనూ ఏమిటేమిటో అన్నాడు తాను ఏడుస్తూనే.

బాష్పావకుంఠనం వొత్తిగించుకుంటూ అతని కళ్ళల్లోకి చూసిం దామె.

కన్నీటి ప్రవాహం పాయలు పాయలుగా విడగొట్టేసుకుంటూ ఆమె కళ్ళల్లోకి చూశా డతనున్నూ.

ఆ లేతహృదయాలు రెండూ మిళితం అయినాయి.

ఇద్దరికీ దుఃఖం తగ్గిపోయింది, దీంతో; కాని వాన వెలిసినా కొంతసేపు చూరునీళ్ళు తప్పనట్టు, దుఃఖం తగ్గినా, వారి కను రెప్పల్లోనుంచి బాష్ప బిందువులు రాల్తూనే వున్నాయి.

అక్కడ, జగ్గయ్య వేంకటాచలం రెండుచేతులూ పట్టుకున్నాడు.

"బావగారూ, ఇవి చేతులు కావు కాళ్ళు" అన్నాడు సానునయంగా.

"చలపతి మీవాడు కాని మావాడు కాడు. మా సూరి శాస్త్రి చెప్పిన మాటమీద మీమీద యిలాంటి నమ్మకం పెట్టుకునే మావాడికి చేసుకున్నాను, మీ అమ్మాయిని. కనక, మీరిదేమీ బయటపెట్టవద్దు. దీనివల్ల మీరేమీ చలించ నక్కర్లేదు కూడా. చలపతి జీవితం యివాళ కొత్తదారి తొక్కింది. చాలు. దీంతో వాడి అజ్ఞానం తొలగిపోతుంది"

తరవాత పూర్ణమ్మని పలకరించాడు జగ్గయ్య. "అక్కయ్యగారూ" అన్నాడు. "మీకింకేం చెప్పనూ? జోగమ్మ కోడలేకాదు, నాకు, కొడుకున్నూ. అలాగే అల్లుడే కాదు చలపతి మీకు కొడుకున్నూ. ఇక రెండురోజులు వోపిక పట్టండి. బావగారూ నేనూ ఆలోచించి ఎవళ్ళకి తగిన యేర్పాట్లు వాళ్ళకి చేస్తాం. ఏమీ విననట్టూ ఏమీ యెరగనట్టూ వుండాలి మీరు. మీపిల్లని బాగానే దిద్దుకున్నారు మీరంతవరకూ. ఇప్పుడు చలపతిని కూడా దిద్దండి" అని ఆమెని కూడా బతిమాలాడా డతను.

ఏదోవిధంగా గోలపెంచక మానరనుకున్న వియ్యాలవారిలా అతి సులభంగా శాంతించగా, జగ్గయ్య "మా సూరి శాస్త్రి యింటికి వెళ్ళివస్తా" నంటూ మెల్లిగా బయలుదేరాడు.

30

చిమ్మచీకటి పడేదాకా ఇంటికి రాలేదు బుచ్చమ్మ.

అప్పు డయినా, అతిరహస్యంగా వచ్చి, అతిగుట్టుగా గదిలో ప్రవేశించింది.

ఇంటో భోజనా లవుతున్నా యన్నప్పుడు ఎదటింటివారి పిల్లను బతిమాలి తీసుకువచ్చి "నాకీపూట పిండీవద్దు, మరేమీ వద్దు" అని తండ్రికి చెప్పించి, దీపం పూదేసి ముసుగు తన్నుకుని పడుకుంది.

కాని, కన్ను పొడుచుకున్నా నిద్ర రాలేదు. పోనీ అంటే, బలవంతాన కళ్ళు మూసుకుందే గాని సకలమూ నానాబీభత్సంగానూ కనపడసాగింది.

తానన్నమాట లన్నీ చలపతి ఇంట్లో అందరితోనూ చెప్పేశాడేమో అని ఆదుర్దా. భవిష్య త్తేమి టని బెంగ. అది ఏమయినా "జోగమ్మని సాధించ డమూ, పూర్ణమ్మ నేడిపించడమూ ఎలాగా? అని ఆందోళన. ఈ పని చెయ్యక పోతే తనని చచ్చు పెద్దమ్మకింద కట్టేసి మాటిమాటికీ సోదెమ్మ, దెప్పుతూ చంపేస్తుందేమో అని తహ. ఇంతవరకూ వచ్చాక "చలపతినిమాత్రం విడిచి పెడతానా?" అని పట్టుదల.

నిజంగా, అట్టుడికిన ట్టుడికిపోయిం దామె.

మొదటిజాము తెలియకుండానే గడిచిపోయింది; కాని రెండోజాము, నిజంగా ప్రాణాలు కొరికేసింది.

ఎక్కడా అలికిడి లేదు. నిద్రరాదు.

ఏకాంతవాసపు కైదుశిక్ష ఈ స్థితి వొకటే వర్గంలోవి.

కొంతసేపటికి గోదావరి వంతెనమీద రెయిలు వస్తున్న చప్పుడయింది.

మరి కొంతసేపటికి కోటిపల్లిబస్సులు బర్రూబుర్రూ మంటూ, గందర గోళం చేసేశాయి.

రాత్రి గడిచిపోయిందని అప్పటికి నిశ్చయం చేసుకుందామె; కాని తెల్లవారితే ఏమి జరుగుతుందో?

అయితే కాలం ఆగుతుందా? ఎంత సాక్ష్యం సేకరించుకోవాలో సూర్యుడు? ఎన్నికడుపులు నకనక లాడిపోతున్నాయో ఇడ్లిసాంబార్ల కోసం?

ఉండుండి భళ్ళున తెల్లవారింది, అంటే, కళ్ళువిప్పి చూడగా కిటికీ రెక్కల సందుల్లో తెల్లని రేకలు కనపడ్డా యామెకి.

వెంటనే లేచి పావుగంటలో గోదావరికి వెళ్ళిపోయింది బుచ్చమ్మ.

వచ్చిన తరవాత యింటో యెవరూ పలకరించలే దామెని. కళ్ళువిప్పి చూడనూలే దెవరూ.

కట్టుకట్టినట్టూ వెలివేసినట్టూ కనపడ్డా రందరూ.

దీనికి సాయం, తానే యజమానురాల నన్నట్టు యిల్లంతా స్వేచ్ఛగా తిరుగుతూ, అన్నీ స్వతంత్రంగా సద్దుతూ వంటింటి వసారాలో కాఫీ తయారు చేస్తోంది పూర్ణమ్మ."

జన్మాని కల్లా శివరాత్రి అన్నట్టు, నూతిదగ్గిర స్వయంగా స్నానం చేసేశాడు చలపతి. "ఇక పట్టుషర్టులు కుట్టించుకుంటే గాని వొప్పుకోను మరి" అంటూ చలవమడత నూలుషర్టు అందిస్తోం దతనికి జోగమ్మ.

నిదానించగా, జోగమ్మా వోరచూపులే, చలపతీ వోరచూపులే, పూర్ణమ్మా వోరచూపులే, వేంకటాచలమూ వోరచూపులే.

పోనీ అనుకుంటే, జగ్గయ్య చిన్నచూపు.

వాళ్ళంతా చీమలూ జెర్రెలూ పాకుతున్నట్టనిపించిందామెకి దీంతో.

ఇలాంటి సమయాన "అత్తయ్యగా రేరీ?" అని చలపతి నడిగింది పనిమనిషి.

దానిమీద "లాంజముండా, నువ్వు కూడా నన్ను పరాయిదానికింద కట్టేశావా?" అనుకుంటూ కొట్టినంత బాధ పడిపోయింది బుచ్చమ్మ; కాని "అత్తయ్య" అన్నమాట మీద తన అత్తవారి యిల్లు జ్ఞాపకం వచ్చిందామెకి.

"నూటయాభై రూపాయల మనోవృత్తి వుండగా, అత్తవారి యింట రెండుగదులున్నూ కేటాయింపుగా వుండగా, ఈ నరకంలో యెందుకు మగ్గి పోవాలీ?" అనుకుందామె, వెంటనే.

"నా రెక్కలశక్తి అంతా నా చిన్నతోటికోడలికి ధారపోస్తాను. నామరిది యింటికి బంగారపుగోడలు పెట్టేస్తాను. దాంతో, యిక్కడ "జోగి"కి చెప్పు దెబ్బ కొట్టినట్టవుతుంది. అప్పటికి తీరుతుంది నాకసి" అనుకుంది.

31

దక్షిణపుగదిలో బుచ్చమ్మ తనబట్టలు సద్దుకుంటూ వుండగా అదిచూసి ఆసంగతి పూర్ణమ్మతో చెప్పాడు వేంకటాచలం. పూర్ణమ్మ జోగమ్మతో చెప్పింది. జోగమ్మ చలపతితో చెప్పగా, చలపతి జగ్గయ్య కందించాడా సంగతి.

ఇలాగ అందరికీ వుప్పందాటప్పటికిది బుచ్చమ్మ గ్రహించేసింది.

యథాప్రకారం, వియ్యంకు లిద్దరూ కవాచీబల్లమీద కూచున్నారు, వాకట్లో.

జోగమ్మ యేదో చెప్పగా, చలపతి, మండువా అంచున పచారుమొదలు పెట్టాడు, చేతులు వెనకకు విరుచుకునీ, పెదవులు బిగించుకునీ, మధ్యమధ్య మొగం యెత్తి చూస్తూనూ.

"పని తరవాత చూసుకోవచ్చు" నని పడమటింటి తలుపుచాటుకి చేరుకుంది పూర్ణమ్మ.

కాశీమజిలీకథల పుస్తకం చేతపుచ్చుకుని, జోగమ్మ, ఉత్తరపుగది గుమ్మంలో కూచుంది, వోరచూపులు చూసుకుంటూ,

చిన్నమూట చంకన పెట్టుకుని మెల్లిగా వాకట్లోకి వచ్చింది బుచ్చమ్మ, దక్షిణపు గదిలోనుంచి.

వేంకటాచలం మొగం వంచుకున్నాడు.

జగ్గయ్య వీధికేసి చూడసాగాడు.

తరవాత, వొక్కక్షణం నడవమొగలో నుంచుని, వీధికేసి చూస్తూ తండ్రిని పిలిచింది బుచ్చమ్మ.

"ఏం?" అన్నాడతను.

"నాయింటికి వెళ్ళిపోతున్నా న్నేను" అంది బుచ్చమ్మ.

"అదేం?"

ఇలా అడుగుతూ బాసినపట్టు వేసుక్కూచున్నవాడల్లా కాళ్ళు కిందికి చాపుకుని నిటాగ్గా కూచున్నాడు జగ్గయ్య.

"కూలిమెతుకులు తప్పనా కిక్కడేం వుందీ?" అనడిగింది ఆమె, నిష్ఠూరంగా చూస్తూ.

ఇది విని "ఇప్పటికి నెమరుకి వచ్చిందా చిట్టితల్లీ?" అనుకుంటూ తల పంకించుకుంది, పూర్ణమ్మ.

చలపతి యెగిసి తనకేసి చూడగా "విన్నారా?" అనడుగుతున్నట్టు పెదవులు కదుపుకుంటూ, కనుబొమ్మ లెగరవేసుకుంది, జోగమ్మ.

"ఈ సంగతి నీకిప్పుడే తెలిసిందా?" అనడిగాడు జగ్గయ్య.

"ఇదివరకే తెలుసు"

"మరిప్పుడేం వచ్చిందే కొత్తగా?"

"నన్నడగవద్దు, నీకే తెలుస్తుంది ముందుముందు"

"ఉన్నదంతా యెప్పటి కప్పుడే తెలిసిపోతోంది నాకు, ఎప్పటిదాకానో ముందటిదాకా వేచివుండ నక్కరలేదు.

"ఎన్నయినా కల్పించీ కవ్వించీ చెప్పేవాళ్ళున్నప్పుడు నీకేం లోటూ?"

"ఎవరమ్మా, ఆకల్పించీ, ఆకవ్వించీ చెప్పేవాళ్ళు?" అని నిలవతీద్దామని చర్రున మండువాలోనికి వచ్చింది పూర్ణమ్మ; కాని వేంకటాచలం యింగితం గుర్తించి వూరుకుంది, పులుకూ పులుకూ మాత్రం చూస్తూ.

గభీమని లేచి గది చివరిదాకా వచ్చింది జోగమ్మ, గంభీరంగా చూస్తూ.

అప్పటికి సాహసించి "నిజమే, బంగారబ్బొమ్మ వంటి పెళ్ళాం బతికి వుండగా నాకొడుక్కి మళ్ళీ పెళ్ళి కల్పించేవాళ్ళే వున్నారునాకు, లోటులేదు నువ్వన్నట్టు," అన్నాడు జగ్గయ్య నిరసనగా చూస్తూ.

ఉల్కిపడిపోయింది; పిల్ల కాని వెంటనే తేరుకుని "ఇంకేం? ఎవరేమి చెబితేమాత్రం వినపడుతుందీ యిక? కనక, ఇదిగో వెళ్ళిపోతున్నాన్నేను" అని, ఒక్క అడుగుముందుకి వేసిందామె.

కాలచక్రం నిలిచిపోయినట్టయిం దొక్క క్షణం; కాని తరవాత "అయితే, నాతాళాలు నాకిచ్చేసి మరీ కదులు" అని వొక్క వురుమురిమాడు చలపతి, పచారు కట్టిపెట్టి తీక్ష్ణంగా చూస్తూ.

అక్కడ వుండినవారికే కాదు, రెండుతరాల తరవాత, నిజంగా, ఆయింటి క్కూడా వురుమే యిది. జగ్గయ్య తండ్రి చనిపోయాక నేటివరకూ, మళ్ళీ అంత ఝూంకారమైన మొగమాట వినపడలేదు, ఆయింటో.

అది విని కొత్త ప్రపంచంలో పడ్డట్టయినాడు జగ్గయ్య, "ఏమిటీ?" అనుకుంటూ తిరగబడీ విరగబడీ చూశాడు వేంకటాచలం.

చలపతి మొగాన పూర్తిగా కొత్తవాలకం కనపడింది, పూర్ణమ్మకి.

ఆవురుముకి నెమలిపిట్టే అయిపోయింది జోగమ్మ.

కాని, తొడచరిచి, పంజాచాపి, ఎదటిజెట్టి "ర్-రా" అంటూ పిలిస్తే వీరుడైనవాడి కెలా వుంటుందో అలా వుంది యీ బొబ్బరింత బుచ్చమ్మకి.

రుసరుస లాడుతూ కైజారున్నట్టు మొలలో వున్న తాళాలగుత్తి చర్రున లాగి, నిప్పులు, కక్కుతూ, చూస్తూ మండువాలోకి విసిరేసి నిర్లక్ష్యంగా మళ్ళీ అడుగువేసింది. బుచ్చమ్మ, దాంతో.

అప్పుడు, ఇక బాగుండదని అడ్డంవెళ్ళి ఆమె రెక్క పట్టుకుంది పూర్ణమ్మ.

"ఇప్పుడేం వచ్చిందని వెడతావూ?" అనడిగాడు వేంకటాచలం కూడా, లేచినుంచుని.

మెల్లిగా గదిలోకి జారుకుంది జోగమ్మ, చూస్తూ తానూరుకుంటే బాగుండదని.

మూట వుశాక్కోపోయాడు జగ్గయ్య "చాల్లే, నడు, నడు ఇంటోకి" అంటూ.

కాని, అందర్నీ విదలించికొట్టి, బుచ్చమ్మ "అందరి పాలూ పొంగాయి కద్దా?" అంటూ మూట విడిపించుకుంది విసురుగా.

జగ్గయ్య మనస్సు పూర్తిగా విరిగిపోయింది. "వెళ్ళిపోనివ్వండి" అంటూ వెనక్కి తగ్గేశాడతను. "తొందరపడకు. నామాట విను. నీ అధికారానికెవరూ అడ్డురాలేదిక్కడ. అల్లరిపడిపోతావు సుమా" అన్నాడు, వేంకటాచలం. "వెనక్కిరావమ్మా వెర్రిపిల్లా" అంది పూర్ణమ్మ, వొక్క అడుగు ముందుకి వేసి.

కాని, యెవర్నీ, యెందుకూ లెక్కచెయ్యలేదు బుచ్చమ్మ. "ఎంతెంతలేసి ముళ్ళముచ్చెలయినా వున్నారు భూమ్మీద. నావుసురు తగలదూ? ముందుకి వస్తారా ఈ పీనుగులు?" అంటూనే వీధిలోకి వెళ్ళిపోయిందామె బాగా దురుసుగా.

వాకట్లో యిది యిలా జరుగుతూ వుండగా, గదిలో గుమ్మాన నుంచుని చెవులొరచేసుకుని వున్న జోగమ్మని, "చూసుకోనామజా" అంటూ అమాంతంగా యెత్తికుదేసి మళ్ళీ వాకట్లోకి వచ్చేశాడు, శ్రీ కందుకూరి చలపతిరావుపంతులు.

32

రెండు మూడు నిమిషాలసేపు అధరస్పందం చెయ్యలేదెవరూ. చేసినప్పుడు మాత్రం జగ్గయ్యే ప్రారంభించాడు.

"బావగారూ, నాఅదృష్టం యిలా వుంది. ఏమి లేదని యేమి పోయిందని యీ అల్లరి చెప్పండి. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఆవిడ నన్ను విడిచిపెట్టేసి వెళ్ళిపోయినా, యిక నాకేలోటూ వుండదనుకున్నాను. ఏమయినా, స్థితిగతులన్నీ మీరు చూశారు కదా? నేనిక మీకేమీ చెప్పనక్కరలేదు. వెంటనే యీవూరు బదిలీ చేయించుకోండి" అని చెప్పాడతను.

దీనిమీద "ఈ దురదృష్టం మాది కాని మీదికాదు. ఏం నలుగురున్నారనీ? మా చిట్టితల్లికి వొక్కగా నొక్క ఆడబడుచు. ఆమెకయినా వొక్కడే తమ్ముడు. ఆపైని తల్లి లేకపోడం. ఇటు మా అమ్మాయిని దిద్దుతూ అటు తాను పైనుండి చక్రం తిప్పుతూ వుంటే యెంత బాగుండిపోను?" అని బదులు చెప్పాడు, వేంకటాచలం.

ఎదటికి వచ్చి వెంటనే పూర్ణమ్మ అందుకుంది. "మేమీ వూరికి బదిలీ చేయించుకున్నా, మా యింటో మామానాన మేమూ, మీయింటో మీమానాన మీరు వుంటూ వస్తూనూ పోతూ, వొకళ్ళకు వొకళ్లాసరా అవుతూ వుంటే ఎంత అందంగా వుండునో ఆలోచించండన్నయ్యగారూ? తనకి మేమేమి లోటు చేశామూ? ఏమీ అపకారం మాత్రం చేశామూ? అడుగుపెట్టింది, అత్తగారిని సాగనంపేసిందని నా కూతుర్ని నాటికి నాడూ అల్లరిపెట్టింది. "కాపరానికి రావడానికి తడువుగా ఆడబడుచుని లేవగొట్టించిందని నేటికి నేడూ దండోరా వేస్తుంది. మాకి ప్రారబ్ధం ఏమిటి? పోనీ మా పిల్లవల్ల ఏమయినా తప్పుందే

తాను మందలించరాదూ? లేకపోతే, మేమిక్కడే వున్నాం గదా, మాతో చెబితే మేము కూకలేసుకోమూ? కాదంటే మీతోనయినా చెప్పి మమ్మల్ని ఛీ అనిపించ రాదూ? కాకపోయినా, మామొగాన కొట్టినట్టు మేమిక్కడ వుండగానే తానింతపని చెయ్యాలా?" అనడిగి, చాలా నొచ్చుకుందామె.

వారికిద్దరికేసి తిరిగి "వూరుకోండి" అన్నట్టు మొదట చెయ్యీ తలా వూపాడు. తరవాత చలపతిని పిలిచి "ఏం తాళాలు తీసుకున్నావు కావేం నాయనా? విసిరి మండువాలోకి గిరవటేసిందని కోపమా?" అనడిగాడు జగ్గయ్య.

తాను వెళ్ళి స్వయంగా గుత్తి పట్టుకువచ్చి "నాయనా, ఇది నాదికాదు నీదీయిల్లు" అంటూ మళ్ళీ ప్రారంభించాడు.

"ఈ యింటికి యజమానివి నువ్వు. ఇవిగో నీతాళాలు నువ్వుపుచ్చుకో; కాని అమాయకుడవు నువ్వు. వ్యవహార జ్ఞానం సంపాదించుకున్నావు కాదింకా. ఇకనైనా జాగ్రత్తపడు. నీ మామగారు సమస్తమూ తెలిసినవారు. సరసులు. పైగా నాలాగే నీమీదే ప్రాణాలు పెట్టుకుని వున్నారు వారు. వారు చెప్పినట్టువిను, బాగుపడు. ముందీతాళాలు నీ పెళ్ళాం దగ్గర వుంచు, మీరిద్దరూ కలిసి పెత్తనం చేసుకోండి. ఈ యింట్లో, రెండుమూడు తరాలుగా ఆడబడుచుల చేతిలో ఉంటూ వచ్చిన పెత్తనం యజమానురాలి చేతికి మారుతోందివాళ. ఇక ముందుతరం లోనే యజమాని చేతికి మారుతుంది, నాకు తెలుసు. నాక్కావలసిందిక గుప్పెడు మెతుకులు" అని చెప్పి గుత్తి చేతికందించాడు, అతను.

"బావగారూ" అని పిలిచా డతను, ఇటు వేంకటాచలాన్ని "ఇంటి జమా ఖర్చు లెవరికీ చెప్పకుండా తాళాలిక్కడ విడిచిపెట్టి వెళ్ళిపోయింది కూతురు. గర్వం కాదు, మాది తక్కువ ఆస్తి కాదు. అయితే ఆదాయం అంతా ఏమయిందీ?" అని ఎవరికైనా అనుమానం కలుగుతుంది. నాలుగు మాసాల కిందట పదివేలు నిలవవున్నాయి, మా ఇంటో. చెవినిల్లుకట్టుకుని పోరి మాసూరి శాస్త్రి చక్కని మేడ వొకటి తనఖాపట్టించి అప్పు ఇప్పించా డారొక్కం అంతా. పోతే, బుచ్చమ్మ మనోవృత్తి డబ్బు. అది దానిదగ్గిరే ఉంచుకోమన్నా న్నేను. అది పట్టుకువెళ్ళివుంటుం దది. దానికోసం తగువుపెట్టడానికి చలపతి కధికారంలేదు" అంటూ వివరించి చెప్పాడతను.

చూసిచూసి, జగ్గయ్య "ఇప్పుడే వస్తా" నంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

మామగా రక్కడ లేకపోడం గమనించి తల్లి దగ్గిరికి వచ్చి నుంచుంది. జోగమ్మ. "నీదగ్గిర వుంచు" అంటూ వెంటనే తాళా లామెచేతిలో పెట్టాడు, చలపతి. అయితే, తల్లీ ఇంగితం గ్రహించి, జోగమ్మ "నాదగ్గి రేమిటండీ? నాకేం తెలుసునండీ? మీదగ్గిరే వుంచండీ" అంటూ మళ్ళీ ఇచ్చెయ్యబోయింది.

"వద్దు, నీదగ్గిరే వుండనియ్యి" అంటూ మామగారి దగ్గిరికి వెళ్ళికూచున్నాడు చలపతి.

33

ఎగిరెగిరిపడుతూ వంటింటి పెరట్లోకి వెళ్ళి, పక్కయింటికేసి చూస్తూ "అక్కయ్యగారూ" అంటూ పిలిచింది, ఆత్రంగా జోగమ్మ.

జవాబు లేదు.

"సోదెమ్మక్కయ్యగారూ" అంటూ మళ్ళీ పిలిచిందిదామె, కొంచెం గట్టిగా.

"ఆ"

"ఎక్క డున్నా రండీ?"

"వచ్చె వచ్చె .... చెల్లాయీ"

"నేనే నండీ."

"ఏం తల్లీ?"

"నేను రమ్మన్నప్పుడు మా ఇంటికి వస్తా నన్నారుమీరు. ఇదిగో, నేనే పిలుస్తున్నాను మరి. తొరగా — నుంచున్న పాళంగా రావాలి."

సోదెమ్మకి జోగమ్మ పిలుపులో కంటే చిటికెల్లో ఆదరాభిమానా లధి కంగా స్ఫురించాయి.

అందు కానందిస్తూ "కందుకూరి జోగమ్మ —"

"అవును, బ్రహ్మశ్రీ కందుకూరి జగ్గయ్యశాస్త్రులుగారి కోడలు, శ్రీమతి జోగమ్మ — మీ దర్శనం కోరుతుంది.

"అబ్బో అబ్బో, ఎంత చక్కగా పిలిచావు చెల్లీ, ఏం జరిగిందేమిటి?"

"భామ వెళ్ళిపోయిందండీ."

"నిజంగా?"

"నిజంగానేనండీ,

"ఎక్కడి కమ్మా?"

"అత్తవారింటికి."

"అయ్యో, దానిల్లు బంగారంగాను — ఎంత సే పయిందమ్మా?"

"ఇప్పుడిప్పుడే వెళ్ళింది, ఈపాటికి మలుపు తిరుగుతుందండీ."

"ఎంతపని చేసిందీ?"

"అక్కడ, రెండు గదులు కేటాయించారు ట కాదూ. తనకోసం?"

"అయితే?"

"అక్కడ వుంటుంది కామోసు."

"కాదమ్మా, మరిదిగారి ఇంటో వంటలక్క — "

"అన్నమాట. సరిగా చెప్పారుమీ రక్కయ్యగారూ."

"ఇలాంటి వాళ్ళ బతుకు చివర కంతే; కాని చోద్యంగానే వుంది చెల్లీ."

ఈ సమయాన గబగబా వచ్చి పూర్ణమ్మ "తాళాలమాట మాత్రం చెప్ప కుమా ఆవిడతోను" అంది కంఠం నొక్కుకునీ, కళ్ళు తిప్పుకుంటూనూ.

"చెప్ప"నంది జోగమ్మ, మెల్లిగానే.

తనమాట మీద మళ్ళీ మాట రాకపోగా "అసలు దేనిమీద ఇంతగొడవ పెరిగింది చెల్లీ?" అనడిగింది సోదెమ్మ.

"కథ అంతా చెబుతా, నలా రండి" అంటూనే వాకిట్లో కుడాయించింది జోగమ్మ.

"అమ్మాయిగారూ" అంటూ అందుకుంది పూర్ణమ్మ.

"పిన్నిగారూ."

"విన్నారా.

"ఎంతపని జరిగిం దండీ?"

"ఎంత రాగతనం వుంది మామ్మా."

"మీరేం చూశారు పిన్నిగారూ?"

"అలా వస్తారు కాదూ?"

"వస్తున్నా."

"నేనూ రానా?' అని మరోమాట.

"వస్తే రా" అని సోదెమ్మ.

"వారెవరూ? చిన్నమ్మాయా?" అనడిగింది పూర్ణమ్మ.

"అవునండీ. మారుక్కమ్మ."

"తీసుకురండి."

"తీసుకువస్తా.... తొరగా కదలాలి, చెల్లీ, తొరగా."

"వీధిలోనుంచే రండి."

"రాక? ఇంకేం భయమూ?"

స్వాగత సత్కారం జరపడానికి వాకట్లోకి బయలుదేరింది పూర్ణమ్మ.

హెర్, హైనెస్, మహారాణీ సాహేబా, శ్రీశ్రీశ్రీ శ్రీమతి పీసపాటి సోదెయ్యమ్మాదేవిగారి ప్రయాణం సందర్భంలో, రాజ లాంఛనంగా, వంటింటి రెక్కతలుపులు రెండూ రెండు ఫిరంగులు వేశాయి.

1931 మార్చి, భారతి

(పెంపకం)